విశాఖ సంస్కృతి

తెలుగు మాస పత్రిక

వెల : 40/-

జనవరి 2026

సంక్రాంతి శుభాకాంక్షలు

SLV
BUILDERS & DEVELOPERS LLP
AMARAVATHI GRAND-III
@ Gunadala, Vijayawada
Largest Gated Community 214 Luxury Apartments & Lavish Clubhouse 3Bhk-2325, 4Bhk 2850 & 3250 sft
SLV
BUILDERS
SLV
GREEN
MEADOWS
@ Ramavarapadu, Vijayawada
Largest Gated Community@248 villas, 2-Level Club Houses, 3 BHK, 4BHK & Unique Villas
SLV
INFRA
SLV
Green Lands
WHERE NATURE RESIDES
Urban
Plotting
Development
Open plots, Villas
Nature Inspired Living:
A smart Investment
Guntupalli
Vijayawada
SLV
DEVELOPERS
SLV
Amaravati
Pride
It's An Exclusive
Gated community 410 Flats
2, 3 & 4 BHK Project
@ MANGALAGIRI
Book Now
98595 95939
94598 23444
94593 23444
www.slvdevelopers.in

సీతం కళాశాలలో ఘనంగా సంక్రాంతి ఉత్సవం

విజయనగరం దరి గాజులరేగలోని సీతం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరక్టర్ డా.మజ్జి శశిభూషణరావు, శ్రీమతి మజ్జి అనురాధ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసిన ఉత్సవాలను ప్రారంభించారు. అధ్యాపకులు, విద్యార్థులతో కలసి వేదిక వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సూర్యభగవానునికి పొంగలి నైవేద్యం సమర్పించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. అనంతరం డా. మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ యువత తప్పనిసరిగా సంక్రాంతి పండగ విశిష్టతను తెలుసుకోవాలని సూచించారు. సీతం కళాశాలలో ప్రతీఏటా సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా.డి.వి. రామమూర్తి మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక సంక్రాంతి పండుగని తెలిపారు.

కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. అమ్మాయిలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. మైదానంలో ఏర్పాటు చేసిన భోగిమంటను డైరక్టర్ డా.మజ్జి శశిభూషణరావు, డాక్టర్ బొత్స సందీప్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగిరెద్దుల వారికి కానుకలు అందజేశారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ సంబరాల్లో సీతం ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

RNI NO. APTEL/2012/42810 POSTAL REGISTERED NO. VSP-189 / 2025 - 2027

పత్రికను ఆదరిస్తున్న పాఠకులకు వినమ్ర సుమాంజలి

విశాఖ సంస్కృతి

తెలుగు మాస పత్రిక

సంపుటి : 14 జనవరి 2025 సంచిక : 6 పేజీలు : 70 వెల రూ. 40/-

సంపాదకులు

శిరేల సన్యాసిరావు

ఫోన్ నెం. 9603076777

E-mail : visakhasamskruthi2012@gmail.com

ఫ్లాట్ నెం. 402, వైష్ణో కీర్తన అపార్ట్‌మెంట్,

బొట్టవానిపాలెం, మధురవాడ, విశాఖపట్నం - 530048

చందా వివరాలు

విడి ప్రతి : రూ. 40/-

సంవత్సరం : రూ. 480/-

5 సంవత్సరాలు : రూ. 2400/-

పోస్టల్ ఛార్జీలతో కలిపి

అకౌంట్ పేరు : విశాఖ సంస్కృతి

యూనియన్ బ్యాంక్, సీతమ్మధార, విశాఖపట్నం

అకౌంట్ నెం. : **054011100001006**

ఐఎఫ్ఎస్‌సి కోడ్ : **UBIN0805408**

విషయ సూచిక

కథలు
ఆశల భారం - ఎస్.సురేంద్రనాథ్ 21
కొలతలు - కె.ఎన్.వి.ఆంజనేయులు 25
నేను సైతం - వాణిశ్రీ 30
టచ్‌ఫోన్ తికమకలు - వాడపల్లి పూర్ణ కామేశ్వరి 32
మసకబారుతున్న మానవత్వం - డా.నగరం వినోద్‌కుమార్ 50
మాతోనే మీరూ! - నందిరాజు పద్మలతా జయరాం 52
వ్యాసాలు
పల్లె మురిసే పచ్చని పండుగ - పద్మావతి వడ్లమూడి 6
సంక్రాంతి పాటల స్రవంతి - చెన్నాప్రగడ శర్మ 9
గజ్జెల మల్లారెడ్డికి ఘన నివాళి - ప్రతాప్ రాజులపల్లి 11
చెరిగిపోని సంతకం - జి.వి.శ్రీనివాస్ 15
అమెరికా క్వార్టర్ డాలర్ - జి.శివ ప్రకాష్ 19
స్త్రీని గురించి మహాత్మాగాంధీ - కర్లపాలెం హనుమంతరావు 20
సాహిత్య చైతన్య పథగామి విరియాల - అడపా రామకృష్ణ 23
మన సంగీత దర్శకులు - రాజేష్ యాళ్ళ 27
అభీష్టసిద్ధికి నైతిక ధైర్యం తప్పనిసరి - డా. అట్టాడ హేమసుందర్ 36
ఊరు - పేరు - వాండ్రంగి కొండలరావు 42
ఆత్మ విశ్వాసం విజయానికి వెలుగు రేఖ - నారంశెట్టి ఉమామహేశ్వరావు 43
జ్ఞాపకాల దొంతర - శీరంశెట్టి కాంతారావు 48
ఏయూ డాక్టరేట్లలో కళింగాంధ్రులు - డా.జి.లీలావరప్రసాదరావు 55
వరల్డ్ తెలుగు కార్టూన్లు 57
కనుమరుగవుతున్న జముకుల కథ - బద్రి కూర్మారావు 59
గ్రంథాలయమే నాకు దేవాలయం - ఆచార్య వెలమల సిమ్మన్న 63

మా పత్రికను ఆదరిస్తున్న పాఠకులకు, కవులు, రచయితలు, ప్రకటన కర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులకు **సంక్రాంతి** శుభాకాంక్షలు.

- ఎడిటర్ : శిరేల సన్యాసిరావు

చెరిగిపోని సంతకం వ్యాసం బాగుంది

డిసెంబరు సంచికలో ప్రచురించిన చెరిగిపోని సంతకం పేరిట 'బాబా ఆమ్టే' గురించి రచయిత జి.వి.శ్రీనివాస్ రాసిన వ్యాసం కూర్పు హర్షణీయం. పాఠ్య పుస్తకాలలో కూడా ఇంత వివరంగా ఉండదు. బాబా కోసం రేఖామాత్రం గానే నాకు తెలుసు. ఈ వ్యాసం ద్వారా సేవ, శ్రమ అనే అంశాలను పునికి పుచ్చుకున్న బాబా, వారి వారసుల అంకితభావం సమగ్రంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. జీవితమే కమిట్మెంట్... కమిట్మెంటే జీవితం. చిప్కో ఉద్యమ నేత బహుగుణ, మేధాపాట్కర్ కోసం తెలుసుకోవాలని ఉంది.

– కృష్ణారావు, విజయనగరం

అన్ని శీర్శికలు చదివింపజేస్తున్నాయి

విశాఖ సంస్కృతి మాస పత్రిక చాలా సంవత్సరాలుగా చదువుతున్నాను. ప్రతీ నెలా కవర్ పేజీ విభిన్నంగా ఉంటుంది. అన్ని శీర్శికలు చదివింపజేస్తున్నాయి. ప్రతీ సంచికలో కొత్త విషయాలు ఉంటున్నాయి. పత్రిక రాకకోసం ఎదురు చూస్తుంటాం. మంచి సాహితీ విలువలున్న పత్రిక చదువుతున్నామన్న అనుభూతి కలుగుతోంది. సంపాదకవర్గానికి అభినందనలు.

– ఎల్.వి.సుబ్రహ్మణ్యం, హైదరాబాదు

కథలు, వ్యాసాలు బాగుంటున్నాయి

డిసెంబంరు నెల సంచికలో ప్రచురించిన కథలు, వ్యాసాలు బాగున్నాయి. ప్రతీనెలా 'కవి వాక్యం – కథాత్మకం' శీర్శిక పేరుతో ప్రచురిస్తున్న కథ తప్పనిసరిగా చదువుతున్నాను. ప్రతీనెలా ప్రచురిస్తున్న సాహితీ ప్రముఖుల ఇంటర్వ్యూలు చదివి చాలా కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. ప్రస్తుత కాలంలో వెలువడుతున్న సాహిత్య పత్రికల్లో ఉత్తమ సాహితీ విలువలతో కూడిన పత్రిక విశాఖ సంస్కృతి అని నా అభిప్రాయం.

– ఎన్.రామారావు, విశాఖపట్నం

పాఠకులకు విజ్ఞప్తి

మీ అందరూ ఇస్తున్న ప్రోత్సాహంతో విశాఖ సంస్కృతి మాస పత్రిక గత 14 సంవత్సరాలుగా నిర్విఘ్నంగా వెలువడుతోంది. పత్రికను ఎంతో అభిమానంతో ఆదరిస్తున్న పాఠకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. పత్రికలో ప్రచురిస్తున్న కథలు, కవితలు, కార్టూన్లు, వ్యాసాలు చదివిన తరువాత మీ అభిప్రాయాలను సెల్ నెంబర్: 9603076777 వాట్సప్ చేయవలసిందిగా కోరుతున్నాం.

– శిరేల సన్యాసిరావు, ఎడిటర్

మా చిరునామా :

ఎడిటర్, విశాఖ సంస్కృతి, ఫ్లాట్ నెంబర్- 402, వైష్ణోకీర్తన అపార్ట్మెంట్, బొట్టవాని పాలెం, మధురవాడ, విశాఖపట్నం - 500048. వాట్సప్ నెంబర్ : 9603076777

సంపాదకీయం

కాలమే సజీవ సాక్ష్యం

కొత్త ఆంగ్ల సంవత్సరం ప్రారంభమైంది. 21వ శతాబ్దం ప్రారంభమై అప్పుడే పాతిక సంవత్సరాలు గడిచిపోయాయి. చాలా ఆశ్చర్యంగా ఉంది కదా! ఈ పాతికేళ్ల కాల గమనాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే చాలా విషయాలు అవగత మౌతాయి. 20వ శతాబ్దానికి ముందు.. ఆ తరువాత పరిశీలిస్తే మానవ జీవనశైలిలో చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. 2000 సంవత్సరానికి ముందు తరం 'నిదానమే ప్రధానం' 'అతి సర్వత్రా వర్జయత్' అనేవారు. ప్రస్తుత తరం ఆలోచన అందుకు భిన్నంగా ఉంది. పెద్ద పెద్ద లక్ష్యాలు పెట్టుకొని, వాటిని సాధించడం కోసం పరుగులు తీస్తున్నారు. ఆలోచనా విధానమే మారిపోయింది.

ఆధునిక వ్యవస్థలో మానవ జీవితం పూర్తిగా యాంత్రికమైపోయిందనే చెప్పాలి. సాంకేతిక పరిజ్ఞానానికి అలవాటు పడిన మనిషి స్వతహాగా ఏమీ ఆలోచించడం మానేశాడు. ఇంకా చెప్పాలంటే యంత్రాలు లేకుండా బతకలేని స్థితికి వచ్చేశాడు. తెల్లారి నిద్ర లేచింది మొదలు చేతిలో సాంకేతిక పనిముట్టు లేకుండా ముందుకు సాగలేని పరిస్థితి. ఒకప్పుడు మనిషి యంత్రాలను నియంత్రించేవాడు. ఇప్పుడు యంత్రాలు చెప్పినట్టు మనిషి నడుస్తున్నాడు. పరిస్థితి తారుమారయ్యింది.

ప్రస్తుతం మనిషి లక్ష్య సాధన కోసం చాలా వేగంగా పరుగులు పెడుతున్నాడు. అవసరమైతే తాను ఉన్న చోటు నుండి ఇతర ప్రాంతాలకు, దేశాలకు వెళ్లడానికి వెనకాడ్డం లేదు. ఈ క్రమంలో మానవ బంధాలకు, సామాజిక అంశాలకు ప్రాధాన్యం చాలా తగ్గించాడు. సంపదకు, విలాసవంతమైన జీవితానికే మాత్రమే తొలి ప్రాధన్యం ఇస్తున్నాడు. అందుకోసం కేవలం తానొక్కడే గమ్యం వైపు పరుగులు పెడుతున్నాడు.

జీవితంలో వేగంగా ఎదగాలనుకోవడం తప్పుకాదు. కానీ ఈ వేగంలో మనిషి తాను ఏం కోల్పోతున్నాడో గ్రహించాలి. ప్రతీ మనిషి జీవితంలో ఆరోగ్యం, కుటుంబం, నైతిక విలువలు, సామాజిక బంధాలు చాలా ముఖ్యం. వాటిని కాపాడుకుంటూనే నిలకడగా ముందుకు పరిగెత్తాలి. ఇలా చేస్తే గొప్ప పేరు, సంపద రాకపోవచ్చు. కానీ ఆనందకరమైన... ఆరోగ్యవంతమైన జీవితం ఖచ్చితంగా వస్తుందని చెప్పవచ్చు.



పల్లె మురిసే పచ్చని పండుగ

- పద్మావతి వడ్లమూడి, 94900 98462

ముంగిట ముగ్గులు, మధ్యన గొబ్బెమ్మలు, పుష్య మాసపు పుష్పరాగాలు. హరి కీర్తనలు, బసవన్నల విన్యాసాలు. ధాన్యపురాశులు... పసిడి కాంతులు. శ్రమ సౌందర్యం సిరులై విరియగ పల్లె మురిసే పచ్చని పండుగ, వెల్లివిరిసే పల్లె చైతన్యమే సంక్రాంతి.

ధనుర్మాసపు చలిని తరిమేస్తూ వెచ్చని నెగళ్లు. చుట్టూ ముచ్చట్ల ముషాయిరాలు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి వాలే అయినవారి కోసం పల్లె ప్రజలు ఎన్నాళ్లో వేచిన ఉదయం అది. పండుగ మూణ్ణాళ్లే కావచ్చు కానీ భోగి మంటల సాక్షిగా ఆ భోగం, భాగ్యం పల్లెకే సొంతం. పరుగులకు తాత్కాలిక విరామాన్ని ప్రకటించి, జీవితాన్ని ఆ నెగళ్లలో వెలిగించుకునేందుకే నగరాలు, పట్టణాలు ఆసాంతం ప్రణమిల్లుతాయి పల్లె పాదాల చెంత. ఆ మాత్రానికే పల్లె మళ్లీ పునఃప్రాణం పోసుకుంటుంది. సంక్రాంతి కొత్త కాంతిని ప్రసరిస్తుంది సంబరంగా.

ఏడాదికో పెద్ద పండుగ

ఏటా హేమంతంలో వచ్చే పెద్ద పండుగ సంక్రాంతి. తిథులు, నక్షత్రాలతో సంబంధం లేని ఏకైక పండుగ ఇది. వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో పంటచేతికి వచ్చిన తరుణంలో జరుపుకునే సంబరమే ఈ పండుగ. విశ్వానికి వెలుగులు పంచుతూ, జీవరాశి ప్రాణం నిలిపే సూర్యుడు దక్షిణాయణంలో నుంచి ఉత్తరాయణం (మకర రాశి) లోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణం. అదే మకర సంక్రాంతి. జనవరి 14 లేదా 15 తేదీల్లో వస్తుంది ఈ పండుగ. ఏ వెలుగులు పుడమిని పచ్చగా నిలుపుతూ, రైతుల శ్రమను ఫలింపజేస్తున్నాయో ఆ వెలుగులను పంచే సూర్యుడే ప్రజల ఆరాధ్యుడిగా పూజలు అందుకుంటాడు ఈ పర్వదినాన. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే తరుణమిది. ఆ కొత్త ధాన్యంతో పొంగళ్ళు పెట్టి సూర్యుడికి నైవేద్యంగా అర్పించడం, పాడిపంటలకు ఆధారమైన పశుసంతతిని పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం.

ముగ్గుల రథాలతో ఇంతుల సందడి

ధనుర్మాసపు ఘడియలు మొదలవడంతోనే సంక్రాంతి నెల ఆరంభమవుతుంది. యువతుల ముగ్గుల సంబరాలతో పల్లెకు కొత్త కళ వస్తుంది. వణికించే చలి సైతం వీరి ఉత్సాహానికి సలాము కొడుతుంది. కళ్లాపి చల్లిన వాకిళ్ల పసిడి వర్ణపు మెరుపులు, వరి పిండి కలిపిన ముగ్గు పిండితో గీసే రంగవల్లులు, వాటి మధ్య పూలతో అలంకరించిన గొబ్బెమ్మలు... చూసే కనులకూ పండుగే. విద్యా, ఉద్యోగ అవకాశాలను వెదుక్కుంటూ యువత దూర తీరాలకు వెళ్లడంతో కాలంతోపాటే ఆ సందడి కాస్త తగ్గుముఖం పట్టినా, పండగకు ఇంటికి చేరి, ఉన్న మూడు రోజులూ ఆ లోటును భర్తీ చేస్తున్నారు. పండుగ చివరి రోజు ముంగిట గీసిన

ముగ్గుల రథాలన్నింటినీ ఒక్కటిగా కలుపుతూ సంక్రాంతికి వీడ్కోలు పలికే సమష్టి ఆనందాల సంస్కృతి గ్రామసీమల్లోని ఇంతులకే సొంతం.

హరిదాసులు, బసవన్నలు...

సంక్రాంతి అంటేనే ముంగిట రంగ వల్లులు, ఇంటింటికీ వచ్చే హరిదాసుల హరినామ సంకీర్తనలు, డూడూ బసవన్నల విన్యాసాలు. ఒకనాడు గ్రామీణ సంస్కృతిలో భాగమై కొన్ని వృత్తుల వారికి తాత్కాలికంగా కడుపు నింపిన ఈ కళలు మారుతున్న కాలంతోపాటే సన్నగిల్లుతున్నాయి. గ్రామీణ వృత్తులు దెబ్బతినడంతో బ్రతుకుదెరువుకోసం వీరికి కొత్త మార్గాల అన్వేషణ అనివార్యమైంది. దీంతో వీరి సందడి పండుగ మూడు రోజులకు పరిమితమైంది.

బొమ్మల కొలువులు, భోగి పండ్లు...

బొమ్మల కొలువులు, బాలలకు భోగిపండ్లు మూడు రోజుల పండుగలో మొదటి రోజు జరుపుకునే ముచ్చటైన సంబరం. విశ్వానికి ప్రాణమొసగే ఆదిత్యుని ఆశీస్సులను ఆకాంక్షిస్తూ భోగి రోజు పిల్లలున్న ఇంట జరుపుకునే మురిపెపు వేడుకలివి. బొమ్మలను అందంగా అమర్చడం, వాటి మధ్య చిన్నారులను కూర్చోబెట్టి, సూర్యుని ప్రతీకగా భావించే ఎర్రని రేగిపండ్లకు పూలను, చిల్లర నాణేలను జోడించి వారి తలలపై పోయడం ఈ వేడుకలో భాగం.

మూడు రోజులు... మూడు క్షణాలు

వేకువనే భోగి మంటలతో సంబరాలు ఆరంభించి, పొంగళ్ళు ఆరగించి, సాయంత్రం బొమ్మల కొలువులు, భోగిపండ్లతో పిల్లలకు ఆనందాలను పంచడంతోనే తొలిరోజు గడచిపోతుంది. రెండో రోజు సంక్రాంతి. పిండి వంటలు, విందు భోజనాలు, బంధుజనం రాకపోకలు, స్నేహితుల ముచ్చట్లు, పిల్లలతో పతంగులు, ఆపై ఊరి శివార్లలో ఏర్పాటు చేసిన బరిలో కోడి పందేలు. క్షణంలా దొర్లిపోతుంది కాలం. కోడి పందేలు, పాడినిచ్చి, కాడి దున్నే పశువులకు పూజలు, కమ్మని విందు భోజనాలతో మూడో రోజు కనుమ కూడా ముగిసిపోగా, వేగంగా గడచిపోయిన కాలాన్ని తలుచుకుంటూ, భారంగా తిరుగు ప్రయాణాలు. మళ్ళీ వచ్చే ఏడాది కోసమే ఆలోచనలన్నీ.

మాటలు... మమకారపు ఊటలు

పట్టణవాసులను పల్లె బాట పట్టించే ఏకైక పండుగ సంక్రాంతి. సొంత ఊరు విడిచి ఎంత దూరమేగినా, అయిన వారందరి సమక్షంలో ఆనందంగా గడపాలనే తపనతో రెక్కలు కట్టుకు వచ్చి వాలేవారిని చూసి పల్లెలు సంబరపడతాయి. ఏడాది నిరీక్షణ ఈ క్షణాల కోసమే అన్నట్టు పల్లెల్లో ఉన్న పెద్దతరం ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతారు. పల్లె నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, ఆటలు, పాటలు, మాటలతో మనుషులంతా మమకారపు ఊటలవుతారు. ఊరంతా వంటశాలలే. ఇంటింటా ఘుమఘుమలే. పెద్దలు పాత జ్ఞాపకాల్లో మునకలేస్తుంటే, పిల్లలంతా ఒక్కటై కోలాహలాన్ని సృష్టిస్తారు. పల్లెకు నిజమైన పండుగ సంక్రాంతి కాక ఇంకేమవుతుంది!

పందెం కోళ్లతో కోట్లాట

మనిషి మనిషితో తలపడితే అది మల్ల యుద్ధం. బానిసలను మల్ల యుద్ధానికి దింపి, వారు పరస్పరం తలపడి రెండో వ్యక్తిని చంపేస్తే గెలిచిన బానిసపై పందెం కట్టిన బానిస యజమానులు కేరింతలు పెట్టిన వికృత వ్యవస్థ ఒకటుండి ప్రాచీన సమాజంలో. అదే బానిస వ్యవస్థ. ఆ వ్యవస్థ మారినప్పటికీ పందెం సంస్కృతిలో మార్పు రాలేదు. గుర్రప్పందేలు, పొట్టేళ్ల పందేలు, కోడి పందేలు దానికి కొనసాగింపే. సంక్రాంతి వచ్చిందంటే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పెద్దఎత్తున పందెం బరులను ఏర్పాటు చేస్తారు. పందేలకు సిద్ధం చేసే కోళ్లు కూడా ప్రత్యేకమైనవే. నెమలి, డేగ, సీతువ, రసంగి, కాకి, పర్ల తదితర జాతుల కోళ్లను తెచ్చి శిక్షణనిప్పిస్తారు. వాటికిచ్చే ఆహారం ప్రత్యేకం. శిక్షణ మరింత ప్రత్యేకం. సంప్రదాయ పందేలు మాత్రమే జరపాలని, వాటికి కత్తులు కట్టకూడదనే నిబంధనలున్నా, అన్నీ పక్కనపెట్టేసి కత్తులు నూరుతూనే ఉంటారు పందెంరాయుళ్లు. ప్రత్యేకించి గోదావరి జిల్లాల్లో జరిపే పందేలకు ప్రేక్షకులు కూడా ఎక్కువే. ఇక్కడ కోట్లలో సొమ్ములు చేతులు మారుతుంటాయి.

తెలుగు సాహిత్యంలో సంక్రాంతి

తెలుగు సాహిత్యంలో సంక్రాంతికి ప్రత్యేక స్థానముంది. ఈ పండుగ రోజుల్లో గొబ్బెమ్మలు పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ, 'సుబ్బీ గొబ్బెమ్మా శుభములియ్యవే' అంటూ బాలికలు పాడుకునే జానపద గీతాలకు కొదవే లేదు. ఇక ప్రాచీన సాహిత్యంలో ఆదికవి నన్నయ్య మొదలు ఆధునిక సినీ కవుల వరకూ సంక్రాంతి చుట్టూ అల్లిన పదాలెన్నో. హేమంతోదయాల వర్ణనలు, రంగవల్లులల్లుకున్న ముంగిళ్లలో సంక్రాంతి శోభను, పల్లె మనసుల స్వచ్ఛతను ఆవిష్కరించే పాటలు, పౌరుషాలను పెంచే కోడి పందేలు, ఎన్నో ఎన్నెన్నో. పాండవులు లక్క ఇంటికి వెళ్లే సమయంలో వారికి స్వాగతం పలుకుతూ వారణావతంలోని ప్రజలు ముంగిళ్లలో కర్పూర రంగవల్లులు తీర్చిదిద్దిన వైనాన్ని మహాభారతాన్ని ఆంధ్రీకరించిన నన్నయ్య వర్ణించారు. 'పల్నాటి వీర చరిత్ర' లోనూ రంగవల్లులను వర్ణించారు కవి సార్వభౌముడు శ్రీనాథుడు. రాజ్యాలు చేతులు మారడంలో కోడి పందేలు ఎలాంటి కీలక భూమిని పోషించాయో కూడా ఆ కావ్యంలో కనిపిస్తుంది.

ఆధునిక కవులు సైతం మూడు రోజుల పండుగను తమదైన శైలిలో వర్ణించారు

'కళ్యాణ కంఠి ఈ కన్నె సంక్రాంతి
భోగాల బాల ఈ భోగి సంక్రాంతి
వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి
తెచ్చింది తెచ్చింది లచ్చి సంక్రాంతి.'

అంటారు నవ్య కవితా పితామహుడు రాయప్రోలు సుబ్బారావు. సంక్రాంతి విందును చవులూరించేలా వర్ణించారు తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి.

మన సినీ గేయాలలోనూ సంక్రాంతి సందడి చేసింది. 'కొత్త ధాన్యాలతో కోడి పందేలతో ఊరు ఉప్పొంగుతుంటే.. 'ఎలా ఉంటుందో కవి భువనచంద్ర తన గీతంలో వర్ణించారు.

ప్రాంతానికో రీతిగా...

తెలుగు నేలపైనే కాదు. దేశంలోని అన్ని ప్రాంతాల్లోని అన్నదాతలూ ఆనందంగా జరుపుకునే పండుగ ఇది. అయితే ప్రాంతానికో తీరుగా ప్రజలు ఈ పండుగ జరుపుకుంటారు. మన పొరుగున ఉన్న తమిళనాడులో ఇది 'పొంగల్'గా పిలుచుకునే నాలుగు రోజుల పండుగ. తొలి రోజు భోగి పొంగల్. ఆ రోజు వర్షాధిపతి అయిన ఇంద్రుడిని పూజిస్తారు. రెండో రోజు థాయ్ పొంగల్. కొత్త కుండల్లో పొంగళ్లు చేసి సూర్యుడికి నైవేద్యంగా అర్పిస్తారు. మూడో రోజు మట్టు పొంగల్. పశువులను పూజిస్తారు. జల్లి కట్టు క్రీడ ఇక్కడ ప్రముఖంగా నిర్వహించే సంప్రదాయక వేడుక. నాల్గోరోజు కానుం పొంగల్. బంధుమిత్రులందరూ కలుసుకుని చేసుకునే సమష్టి ఆనందాల వేడుక. ఉత్తర భారతంలోనూ ఈ పండుగ పంట చేతికొచ్చిన తరుణంలో అన్నదాతలు వైవిధ్య భరితంగా జరుపుకుటారు. పంజాబ్లో ప్రజలు భోగి మంటలు వేసి, సంప్రదాయ నృత్యాలు చేస్తే, రాజస్థాన్, గుజరాత్ లలో ఇది పతంగుల పండుగ. రాజస్థాన్ లోని జైపూర్, జోధ్ పూర్, ఉదయపూర్‌లలో పెద్ద ఎత్తున పతంగుల పోటీలు నిర్వహిస్తారు. బెంగాల్ లో ఈ పండుగను పౌష్ సంక్రాంతి అంటారు. ఎక్కడ ఏ పేరుతో జరిపినా అయినవారందరి ఆనంద కలయికే కదా పండగ పరమార్థం.

సంక్రాంతి పాటల స్రవంతి

- చెన్నాప్రగడ శర్మ, 9440587567

తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి. కొత్త పంట.. కొత్తల్లుళ్లు.. కొంటె మరదళ్లు.. కోడిపందేలు.. ముత్యాల ముగ్గులు.. బొమ్మల కొలువులు.. హరిదాసులు.. గంగిరెద్దులు... పతంగులు.. పిండి వంటల ఘుమఘుమలతో ఊరూవాడా మెరిసిపోతూ మురిసి పోతుంది. చిన్నా పెద్ద సినిమాలు పండగ మూడు రోజులూ పోటాపోటీగా విడుదలై.. చివరికి ఒకరు సంక్రాంతి హీరోగా బరిలో నిలవడం ఆనవాయితీ. చిత్రసీమలో సంక్రాంతి బొమ్మకు ఎంతటి ప్రాముఖ్యత ఉందో.. అంతే విశిష్టత పాటలకుంది. పలువురు దర్శక నిర్మాతలు మన సంస్కృతీ సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఎన్నో సినిమాల్లో సంక్రాంతి పండగపై చిత్రీకరించిన అనేక పాటలు వీనులవిందు చేస్తాయి. ఒకప్పుడు పండగొచ్చిందంటే మూడు రోజులపాటు ఆకాశవాణి జనరంజనిలో ఇవే పాటలు మార్మోగేవి. ఆ సంక్రాంతి గీతికలను మరోసారి గుర్తు చేసుకుందాం.

రావమ్మా మహాలక్ష్మి రావమ్మా...

తెల్లారిపోయింది పల్లె లేచింది/పల్లియలో ప్రతి ఇల్లు కళ్లూ తెరిచింది/రావమ్మా మహాలక్ష్మీ రావమ్మా రావమ్మ... కృష్ణార్పణం... ఈ హరిదాసు పాటను 'ఉండమ్మా బొట్టు పెడతా' చిత్రం కోసం దేవులపల్లి కృష్ణశాస్త్రి రాశారు. రతనాల ముగ్గుల్లో గొబ్బిళ్ల గురించి, పశువులకు చేసే పూజల గురించి చక్కగా చెబుతారు.

'భోగిమంటలు' చిత్రంలో వేటూరి సుందరరామమూర్తి రాసిన భోగుల్లో భోగుల్లో భోగభాగ్యాల భోగుల్లో/భోగిమంటల భోగుల్లో/ తెల్లారకుండానె పల్లెపల్లెంతాను ఎర్రని కాంతుల భోగుల్లో పాట చలిని తరిమికొడుతుంది.

హీరో కృష్ణ, అక్కినేని నాగేశ్వరరావు నటించిన 'ఊరంతా సంక్రాంతి' చిత్రంలో మరో హుషారైన పాటుంది. సంబరాల సంకురాత్రి ఊరంతా పిలిచింది/ముత్యాల ముగ్గుల్లో ముద్దాబంతి గొబ్బిళ్లో/ ఆడామగ ఆడే పాడే పాటల్లో/ఏడాదికో పండగ.. బతుకంత తొలి పండగ.. దాసరి నారాయణరావు కలం నుంచి జాలువారిన ఈ గీతం తొలి పండగ ప్రాశస్త్యాన్ని చెప్పకనే చెబుతుంది.

మూలబడి ఉన్న బుట్ట తట్ట తీసి/భోగిమంటలోన నీవే వెయ్యరా/తెల్లవారగానే సంకురాత్రి కాదా/పొంగే పాలు అందరి పాలు హాయిగా.. అంటూ ఇళయరాజా స్వరకల్పనలో బాలు, జేసుదాసు పోటాపోటీగా పాడిన 'దళపతి' చిత్రంలోని పాట మరో ఆణిముత్యం.

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద...

సంక్రాంతి పండగంటే ఇలా ఉంటుందని భువనచంద్ర 'సోగ్గాడి పెళ్లాం' చిత్రానికొక అద్భుతమైన పాట రాశారు. సంక్రాంతి వచ్చిందె తుమ్మెద/సరదాలు తెచ్చిందె తుమ్మెద/కొత్త ధాన్యాలతో కోడి పందేలతో/ఊరే ఉప్పొంగుతుంటే ఏఏ అని సాగిపోతూ కొత్త అల్లుళ్లు.. కొంటె మరదళ్లను హేమంత సిరులుగా అభివర్ణించారు.

ఈమధ్య విడుదలైన ఫక్తు కుటుంబ కథాచిత్రం 'శతమానం భవతి'లో ఓ అందమైన సంక్రాంతి పాట ఉంది. హైలో హైలెస్సారే హరిదాసులు వచ్చారే/దోసిట రాశులు తేరే కొప్పును నింపేయరే/ దూడూ బసవడు చూడే వాకిట నిలుచున్నాడే/అల్లరి చేస్తున్నాడే సందడి మొనగాడే.. గొబ్బెమ్మలతో ప్రారంభమయ్యే పాటలో హరిదాసులు, గంగిరెద్దుల ప్రస్తావన తెస్తారు. ఆ తర్వాత కొత్త అల్లుళ్లు, బావామరదళ్లు, కోడిపందేలు, పేకాటరాయుళ్లను బరిలోకి

లాగుతారు. భగభగభగభగ భోగిమంటలు/గణగణగణగణ గంగి రెద్దులు/కణకణకణకణ కిరణ కాంతులు/ ధగధగధగధగ ధను సూర్యుడే/ చకచకచకచక మకరరాశిలో/ మెరిసే మురిసే సంక్రాంతే .. జోరుగా హుషారుగా ముగుస్తుంది శ్రీమణి రాసిన ఈ గీతం.

వెంకటేష్ నటించిన 'సంక్రాంతి' చిత్రంలో మరో హుషారైన పండగ పాటను చిత్రీకరించారు దర్శకుడు ముప్పలనేని శివ. మమతల మాలలు తెచ్చి.. ఆ కలతలనే చెరిపేసి/ ముంగిట ముగ్గులు పెట్టి ఈ.. గొబ్బెమ్మల కొలువే చేసి/ మనమంతా చేరి ఆడి పాడే వేళా/సంక్రాంతి పండగ చేద్దామా... సన్నాయి పాటలు విందామా/ డోలీ డోలీ డోలీరే... డోలీ డోలీ డోలీరే.. సూపర్‌గుడ్ ఫిల్మ్స్ పతాకంపై తీసిన ఈ చిత్రానికి ఎస్.ఎ.రాజ్‌కుమార్ వినసొంపైన సంగీతం అందించారు.

అక్కినేని, శ్రీకాంత్, రాశి నటించిన 'పండగ' సినిమాలో చంద్రబోస్ సాహిత్యం చూద్దామా.. ముద్దబంతులు మువ్వమోతలు /నట్టింట కాలుపెట్టు పాడిపంటలు/ వెండిముగ్గులు పైడికాంతులు/ పుట్టింట దీపమెట్టు ఆడపడుచులు.. అని ప్రారంభించి సంక్రాంతి చలి పండగేనని ఢంకా బజాయించి చెబుతారు. మరో చరణంలో అల్లుళ్ల ఆగడాలను భోగిపళ్లుగా, కోడళ్ల చూపులను భోగిమంటగా, అక్కయ్యను సన్నాయిగా, బావను బసవన్నగా సరిపోల్చడం బాగుంటుంది.

బాలయ్యబాబు 'రూలర్'లో రామజోగయ్య శాస్త్రి రాసిన కోలమ్మ కోలో సంక్రాంతి... సంక్రాంతి వచ్చిందిరా/ కోటి సరదాలు సందళ్లు తెచ్చిందిరా/ మకర సంక్రాంతి వచ్చిందిరా/ మన చిరునవ్వు రంగుల్ని మార్చిందిరా... గీతంలోనూ సంక్రాంతి ఔన్నత్యాన్ని గుర్తు చేశారు.

సందళ్లే సందళ్లే...సంక్రాంతి సందళ్లే...

'మంచిరోజులు వచ్చాయి' సినిమాలో మరో మంచి ముత్యం లాంటి పాటను కొసరాజు రాయగా ఘంటసాల మాస్టారు గానం చేశారు. ఏటేట వస్తుంది సంక్రాంతి పండగ/ బీదసాదలకెల్ల ప్రియమైన పండగ/ ఈనాటి సంక్రాంతి అసలైన పండగ/ కష్టజీవులకు అది కన్నుల పండగ... పల్లవితో ప్రారంభమవుతుంది.

పేదాగొప్ప అందరూ సమానమేనని హితబోధ చేస్తారు.

నాగార్జున 'రాముడొచ్చాడు' చిత్రంలో రేగుతుంటే భోగిమంట రేగుపండ్ల విందులంట/రేతిరంత కోడిపుంజు కొక్కొక్కో.. ఈ సాహిత్యం వేటూరి సొంతం. 'వారసుడొచ్చాడు' చిత్రంలో యాలాద్రి ఎంకన్న యాద దాగినావన్న/సంక్రాంతి వేడుకొచ్చిందోయ్/మా పల్లె ఈడుకొచ్చిందోయ్... జాలాది రాసిన ఈ పాట మాస్ జాతరను తలపిస్తుంది.

గోగులు పూచే గోగులు కాచే ఓ లచ్చా గుమ్మాడీ/ పొద్దు పొడిచే పొద్దు పొడిచే ఓ లచ్చా గుమ్మాడీ పల్లవితో ప్రారంభమయ్యే మహేష్ 'మురారి' చిత్రంలోని ఈ పాట రంగురంగుల భోగిమంట నేపథ్యంలో సాగుతుంది.

శర్వానంద్ 'శ్రీకారం' సినిమాలో సందళ్లే సందళ్లే సంక్రాంతి సందళ్లే/అంగరంగ వైభవంగా సంక్రాంతి సందళ్లే.. ఇలాంటి సందడి చేసే పాటొకటుంది. మన ఊరితో సమయాన్నిలా గడిపేయడం ఒక సరదా అంటూ హీరో పాడుతుంటారు. ముగ్గులు, భోగి మంటలు, హరిదాసులు, గంగిరెద్దులు ఇలా అందరి ప్రస్తావనలూ కనిపిస్తాయి.

తాజాగా విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం'లో రామ జోగయ్య శాస్త్రి తెలుగు, ఇంగ్లిష్‌ను మిక్సీ కొట్టి బ్లాక్ బస్టర్ పొంగల్ పాటొకటి అందించారు. జనవరి చలి పులి దెబ్బకు కోడి కూడా వణికిందని మొదలుపెట్టి ఏటుకూరి నాగలచ్చిమి రథం ముగ్గేసు కుంటూ ఎంత దూరం వెళ్లిందో... ఎటు పోయిందోనని ప్రశ్నిస్తారు. పండగొచ్చె గొబ్బియల్లో/ఎవ్రీబడీ గొబ్బియల్లో/సింగ్ దిస్ మెలొడీ గొబ్బియల్లో/పెద్ద పండగండి గొబ్బియల్లో... కమాన్ అంటూ ఉసిగొల్పుతారు. బేసికల్లీ.. టెక్నికల్లీ.. లాజికల్లీ.. ప్రాక్టికల్లీ అండ్ ఫైనల్లీ ఇట్స్ యాన్ యాటిట్యూడ్ పొంగలూ/ఇట్స్ ఏ బ్లాక్ బస్టర్ పొంగలూ.. గుక్కతిప్పుకోనివ్వడు విక్టరీ వెంకటేష్. అంతా కలర్‌ఫుల్‌గా చిత్రీకరించారు అనిల్ రావిపూడి.

ఇవికాకుండా గొబ్బియల్లో గొబ్బియల్లో కొండాలయ్యకు గొబ్బిళ్లు... ఆదిలక్ష్మి అలమేలమ్మకు అందమైన గొబ్బిళ్లు (తల్లిదండ్రులు) సంకురాత్రి కోడి.. కత్తిలాంటి కోడి (యువ), సన్నజాజి పక్కమీద సంకురాత్రి (వజ్రాయుధం), కో..కో..కోడి బాగుంది కూత బాగుంది (జైచిరంజీవ), బొమ్మల్లారా బొమ్మల్లారా

(బొమ్మలకొలువు), గొబ్బియల్లో గొబ్బియల్లో (ఆస్తి మూరెడు--ఆశ బారెడు), పదపదవె వయ్యారి గాలిపటమా (కులదైవం) వంటి మూడ్రోజుల పండగ సంబంధమైన పాటలు ఎన్నో ఉన్నాయి.

అన్నట్లు ఈ ఏడాది సంక్రాంతికి విడుదలయ్యే 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంలోనూ మాస్ పండగ పాటొకటుంది. మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లోని ఈ చిత్రానికి దర్శకుడు అనిల్ రావిపూడి. 'ఏంటి బాసు సంగతి... అదిరిపోద్ది సంక్రాంతి / ఏంటి వెంకీ సంగతి.. ఇరగదీద్దాం సంక్రాంతి. ఈ హుషారైన గీతాన్ని కాకర్ల శ్యామ్ రాయగా.. భీమ్స్ స్వరకల్పన చేశారు.

* * *

నిండు నూరేళ్ళ గజ్జెల మల్లారెడ్డికి

ఘన నివాళి

పద మల్లుని పథ గమనం

- ప్రతాప్ రాజులపల్లి, 97698 55645

నా చిన్నతనంలోనే లబ్ధప్రతిష్టులైన గజ్జెల మల్లారెడ్డి గారిని దగ్గిరనుండి చూసే అవకాశం, ఆయనతో చనువుగా వుండే అదృష్టం కలుగడం నా సౌభాగ్యం. ప్రొద్దుటూరులో మా ఇంటి ప్రక్కన కాలనీలో నివసించిన ఆయన తరచుగా, దాదాపు పెందరాళే మా ఇంటికొచ్చే వారు. ఆయనేమో కమ్యూనిస్టు, మా నాన్నగారు కాంగ్రెస్ కు చెందిన గాంధేయవాది. కాని అవన్నీ వారి సఖ్యతకు, స్నేహానికి ప్రతిబంధకాలు కాలేదు.

స్కూల్ విద్యార్థిగా ప్రొద్దుటూరు బహిరంగ సభల్లో ఆయన వాగ్ధాటి నెరిగిన నాకు ఆయన అప్పటికి కేవలం రాజకీయ నాయకుడిగా, వక్తగా మాత్రమే తెలుసు. పెరిగి పెద్దయి, ప్రొద్దుటూరు వీడిన తర్వాత క్రమక్రమంగా బహుముఖ ప్రజ్ఞాశాలైన ఆయన ప్రతిభాపాటవాలు మరింత తెలిసి అచ్చెరవొందాను. నేనెరిగిన మల్లారెడ్డి కంటే ఎరుగని మల్లారెడ్డి మరింత ఎత్తైన వ్యక్తి - వక్త,కవి, రచయిత, అనువాదకుడు, సంపాదకుడు, విమర్శకుడు, కమ్యూనిస్టు ఉద్యమనేత, అన్నింటినీ మించి మనసున్న మనిషి.

"పెద్దంకి రెడ్డి ఖూనీ జరిగిన" ఐదేండ్ల తరువాత బహుశా 1925 ప్రాంతంలో, ఒక సామాన్య గ్రామంలో, ఓ మధ్య తరగతి రైతు కుటుంబంలో గజ్జెల సోమిరెడ్డి, నాగమ్మ దంపతులకు 'యేదోడు' (రోగిష్టి) గా జన్మించాడు మల్లారెడ్డి. జీతగాడు మాదిగ అంకడిని 'అంకన్నా' అని పిలిచేంత సంస్కారం చిన్నప్పుడే పుణికి పుచ్చుకున్నాడు. తన బాల్యంలోనే తల్లితండ్రులు చనిపోతే మేనమామల ప్రాపకంలో దాదాపు అనాథగానే పెరిగాడు. విద్య వీధిబడి గడప దాటకపోయినా, బర్రెగొడ్లను మేపడం తప్పక పోయినా, బి.పి.చిన నరసరాజు అనే ప్రైవేట్ టీచర్ పుణ్యమా అని 14ఏళ్ళకే "శ్రీ రమణీ మణీ విమల....మము బ్రోచు గావుతన్" అనే ఉత్పలమాల ను ఊదేశాడు. కానీ తొలి తొలుత "ఆంధ్రప్రభ" దినపత్రిక చూసినప్పుడు ఎలా చదవాలో ఆయనకు తెలియలేదట!

పుట్టుకతో ఆయన పులివెందుల దగ్గిర అంకాలమ్మ గూడూరు వాసి యైనా, ఆయన వాసి కాశీ వరకు ప్రాకింది. హిందీ విశ్వ విద్యాలయంలో చదువుకోమన్న ప్రోత్సాహం బాల్య మిత్రుడు వెంకటరెడ్డిది. ఉత్తరోత్తరా ఉపయోగపడింది తరిమెల నాగిరెడ్డి ఇచ్చిన సిఫార్సు ఉత్తరం. అక్కడ హేమాహేమీలతో భుజాలు రాసుకున్నాడు. ప్రపంచ పరిజ్ఞానం పెంచుకున్నాడు. 1943లో కమ్యూనిస్టు సభ్యుడై పరిణతితో రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, బసవ పున్నయ్య ఇత్యాదులు సంపాదక వర్గంగా వుండి 'ప్రజాశక్తి' లోని వ్యాసాలు ఆయనపైన, ఆ తరువాతి రోజుల్లో ఆయన కాలమ్ 'పుణ్యభూమి' పైన చాలా ప్రభావాన్నే చూపాయని ఆయనే వ్రాసుకున్నారు. పులివెందుల తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ ప్రచారం, చేనేత కార్మికులను సంఘటిత పరచడం, 'ఒక కాలు ఇంట్లో మరో కాలు జైల్లో వున్నా' అమ్మాయి వాళ్ళకేమీ అభ్యంతరం లేకపోవడంతో

సంవేదన సాహిత్య త్రైమాసిక పత్రిక ఆవిష్కరణ - కడప : 30 మార్చి 1968

ఎడమ నుంచి : కూర్చున్నవారు 1. రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.), 2. ప్రొ॥ జి.యస్. రెడ్డి, 3. పుట్టపర్తి నారాయణాచార్యులు, 4. శ్రీశ్రీ, 5. కొడవటిగంటి కుటుంబరావు, 6. గజ్జెల మల్లారెడ్డి, 7. వై.సి.వి. రెడ్డి

నిల్చున్నవారు : 1. ఆర్వియార్, 2. ఐ. సుబ్బారెడ్డి, 3. టి. సాంబశివారెడ్డి, 4. వేలూరి సోమయాజులు, 5. కేతు విశ్వనాథరెడ్డి, 6. నల్లపాటి రామప్పనాయుడు, 7. వి. రామకృష్ణ, 8. చవ్వా చంద్రశేఖర్ రెడ్డి (సి.సి. రెడ్డి), 9. టి. చెన్నారెడ్డి, 10. సొదుం జయరాం

నచ్చిన 'సావిత్రి'ని తాడిపత్రి చింతలరాయుని దేవాలయంలో పెళ్ళి చేసుకోవడం –తరువాతి ముఖ్య ఘటనలు. 1946లో పెద్ద పసుపులలో జరిగిన జిల్లా రైతు మహాసభలో ప్రధాన వక్త కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు రాకపోవడంతో, అనుకోకుండా పదివేలకు పైగా వున్న కార్యకర్తల ఎదుట, మైక్‌లో రైతు సమస్యల గురించి సుమారు గంటన్నర సేపు అనర్గళంగా మాట్లాడ్డం ఆయన్ను తిరుగులేని వక్తగా నిలబెట్టింది. ప్రొద్దుటూరు బహిరంగ సభల్లో అనేక సార్లు ఆయన పలు పసందైన ఉపన్యాసాలు వినడానికి చెవులు కోసుకున్నదీ, మిగతా శ్రోతలతో పాటు చప్పట్లు కొట్టిందీ - నాకు బాగా జ్ఞాపకం. ఆయన 'మాటల కచేరి' అక్కడితోనే ప్రారంభమయ్యిందని నా నమ్మకం. కానీ ఇవేవీ ఆయన్ను 1955 ప్రాంతంలో ఎన్నికల్లో ఓడిపోకుండా కాపాడలేక పోయాయి. ఇల్లాలి నగలమ్మి, పొలం కొని వ్యవసాయంలోకి దిగి, చొప్ప మోపు స్వయానా మోయాల్సిన దుస్థితి.ఆస్తులంతకు ముందే

పార్టీ పరం చేసిన ఆయనకు జరిగిన ఒకే ఒక మంచి ఈ మల్లునికి మరో రాచమల్లుడు- సాహితీవేత్త రా.రా (రాచమల్లు రామచంద్రా రెడ్డి) మరింత సన్నిహితుడు కావడం. అందువల్ల తరువాతి రోజుల్లో ఆయన "సవ్యసాచి" పత్రికలో 'సమదర్శి' అనే సుదీర్ఘ రాజకీయ సమీక్ష వ్రాయడం. అటుపిమ్మట, ఎన్నడో ఆరంభ దశలోనే వదిలేసిన కవితాధార అకస్మాత్తుగా "ఇంటర్వ్యూహం" గా వెలికి ఎగజిమ్మింది. పుట్టపర్తి గారి ప్రోత్సాహమూ లభించింది. ఆ కవితా స్రవంతిలో మహోత్తుంగ తరంగం... మలికవిత 'భక్తిరసం'.

"తెలుగునాట భక్తి రసం
తెప్పలుగా పారుతోంది
డ్రైనేజీ స్కీములేక
దేంజరుగా మారుతోంది"

(ఈ వాక్యాలు నేటికీ అన్వయిస్తాయి. ఈ గేయంలో నాకు నచ్చిన మరో పదబంధం 'మగవిధవలు')

లాంటి వాక్యాల్లో అతినిశిత వ్యంగ్య ధోరణివల్ల ఈ గేయానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి.

ప్రఖ్యాత అభ్యుదయ కథా రచయిత కొడవగంటి కుటుంబరావు మెచ్చుకుంటూ 'ఇంతకు శ్రీశ్రీ మారు పేరుతో ఎందుకు రాసినట్లు?' అని రా.రా. ను ప్రశ్నించాడట.

అనతికాలంలోనే ఆయనకు కవిగా మంచి గుర్తింపు రావడం విశేషం. చీనీ తోటలో పాదులు తవ్వేటప్పుడు, కమ్యూనిస్టు కమిటీ సమావేశాల విరామాల్లో కూడా మధ్యమధ్యలో ఆయన కవిత్వం వెల్లువై పారింది. అతిత్వరలో సంపుటిగా మారింది. మల్లారెడ్డి పట్టుపట్టడం వల్ల ఆ సంపుటికి 'పరిచయం' రాసిన రా.రా మల్లారెడ్డి ది "గొప్ప కవిత్వం కాకపోవచ్చు. కానీ క్రొత్త కవిత్వం" అన్నాడు. మల్లారెడ్డిని పొగిడితే ఆత్మస్తుతవుతుందేమోనని సంకోచించాడు. కాని కొడవగంటి "గొప్ప కవిత్వం ఇంకెలా గుంటుంది?" అని ఆయనతో విభేదించాడు. శ్రీశ్రీ తను "పాతికేళ్లలో... కూడబెట్టుకున్న కీర్తి...తస్కరించా"వని కేసు పెడుతున్నానని నిందా స్తుతి చేశాడు. "మళ్ళీ అభ్యుదయ కవిత్వాన్ని ఆకాశానికెత్తాడన్నారు".

అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నిర్మాణంలో

"తొడగొట్టి బరిలోన దూకరా కార్మికా
నిఖిల పీడిత జాతి నీవెంట ఉంటుంది
....
లావా ప్రవాహాన్ని లాఠీలు ఆపునా?
.....
తెంపుగల్ల మొనగాడా తిప్పు మడమ నీ ఎడమకు"

లాంటి పలు గేయాలను వ్రాసినా, ఆశించిన ఫలితం దక్కలేదంటారు ఈ ప్రజాకవి.

అభ్యుదయ కవులు ప్రేమ కవిత్వం వ్రాయకూడదన్న నిబంధన ఎక్కడా లేదు. ఆ రకంగా మల్లారెడ్డి సవ్యసాచే. కావాలంటే ఆయన 'కష్టపడి' చేసిన మఖ్దూం కవితా 'ఇంతిజార్' స్వేచ్ఛానువాదం చూడండి:

మూలం :

"రాత్ భర్ దీద్ ఏనమ్ నాక్ మే లహరాతే రహే
సాంస్ కీ తరహ్ ఆప్ ఆతేరహే జాతే రహే"

అనువాదం :

"తడి కన్నుల రేయెల్ల
తొలకాడు చున్నావు
వలపుటూర్పుల పోలె
వచ్చి పోతున్నావు..."

వలపుటూర్పులు తప్పక ఆయన నగిషీయే!

ఇక భారత్-పాక్ సరిహద్దుల జరిగిన రక్తపాతాన్ని చిత్రిస్తూ ఆలీ సర్దార్ జాఫ్రీ వ్రాసిన ఉర్దూ కవిత

'సుబహ్ ఏ పర్దా' కు ఆయన అనుసృజన:

మూలం:

"కల్ ఇసీ సర్ హద్ పే
సూరజ్ దూబ్ గయే హెూకే దో టుక్ డా
కల్ ఇస్ సర్ హద్ పే జఖ్మీ హుయీూ థీ

సుబహే ఆజాదీ”

అనువాదం :

“అస్తమించెను మొన్న ఈ సరి
హద్దుపై రవి చీలి రెండుగ
నిన్ననిటు స్వేఛ్ఛాప్రభాతం
నెత్రు వరదల్లోన మునిగెను”

అడిగి ఈ కవిత వినిపించుకున్న ప్రముఖ కవి బాలగంగాధర తిలక్ స్వతంత్ర రచనలాగే వుందంటే, జాఫ్రీ స్వయంగా ‘ఇది మూలం కన్నా బాగుందే!’ అన్నారట.

మరోమారు తనకు కుదర్లేదని, వీలైతే తెలుగుకు అనువాదం చేయమని నార్ల చిరంజీవి గారు సాహిర్ లూధియానీ రాసిన సుధీర్ఘ కవిత “పర్ ఛాయియా” – రణమారణ హోమంలో బలియైన భగ్న ప్రేమ-ను ఇస్తే రసభంగం కాకుండా మల్లారెడ్డి మలిచిన తీరు చూడండి:

“పడుచు రాతిరి పేరురమ్మున
పాల వెన్నెల జిలుగు పయ్యెద
కదలుచున్నది స్వప్న సీమల
మెదలు సుందర దృశ్య మట్టుల”

పదండి నేడే క్షతాత్ములంతా
ప్రతి గాయమ్మొక ప్రజా వాక్కుగా
ఇంకో యుద్ధం రానేవస్తే
నీడలు కూడా నశించుతాయని
నినదిద్దాం పదండి పదండి పోదాం!!”

ఈ విధంగా ఉర్దూ/హిందీ ప్రణయ భావార్ద్ర కవితలను అనువదించడం వల్ల, స్వతంత్రంగా తెలుగులో అభ్యుదయ కవులకు లేని అవకాశాన్ని పూరించుకోవడమే కాదు, ఈ కవి మల్లుడు తన కడప కత్తికి రెండువైపులా పదునేనని తన కలాన్ని కదను తొక్కించారు.

రేడియో మాస్కోలో

“సోవియట్ల దేశమా
సమతా సందేశమా
ఆంధ్రజాతి విప్లవాభి
వందనాలు అందుకో”

అంటూ గళమెత్తి చదివాడు.

అంతేకాదు ప్రొద్దుటూరు రాజన్న కవి ఇచ్చు మేరకు కొన్ని పద్యాలు కూడా వ్రాశాడు.

“కళ్ళకు సిద్ధాంతాల గంతలు...అసంగతం”...

“ఏమైనా కవులూ, రచయితలూ ఏదో ఒక వాదానికి బందీ కానప్పుడే సాహితీ ఆకాశంలో స్వేచ్ఛగా విహరించగలరన్న సంగతి” తను చాలా ఆలస్యంగా అర్థం చేసుకున్నానని తన ఆత్మకథ “మనస్సాక్షి”లో చెప్పుకొస్తారు మల్లారెడ్డి. అందుకే రోత పుట్టించే వ్యక్తి పూజా విధానం అనుసరించిన మావోయిజం ను ఈసడిస్తూ ‘ముక్కులు’ వ్రాశానంటారు. ఆ రకంగా కమ్యూనిస్టు పార్టీ కి చెందిన అన్ని వర్గాలతో ఏదో ఒక సందర్భంలో ఆయనకు తగవు తప్పేది కాదు.

అంతేకాదు కవిత్వం లోని వివిధ ధోరణుల పై ఆయన విమర్శ తన ‘కవితా విపణి’ లో ప్రస్ఫుటించింది.

“కవితాసతి...గడసానై...ఆడిన దొమ్మరి ఆటలు”

అంటూ శ్రీశ్రీ లిమరిక్కులను,

“ఇంటింటికి ముఖ్యంగా

వంటింటికి పనికివచ్చు” అంటూ ఆరుద్ర “ఇంటింటి పద్యాల”ను విమర్శించడానికి ఆయన వెనుదీయలేదు.

“సెక్సు మీద సిగ్గు మీద సెన్సు మీద మనిషి మీద
ధిక్కారం ప్రకటించిన దిసమొల వీరావేశం”

అంటూ దిగంబరులను నిలదీశాడాయన.

“వందేమాతరం” పట్ల వక్రభాష్యం చేసిన విప్లవ కవి చెరబండరాజు ను ఈసడించుకున్నారు.

సినారెతో కూడా బాహాటంగా విభేదించిన సిరా ఆయనది. చేరాతో చెడుగుడులూ సరేసరి.

“దిగిరమ్ము దిగిరమ్ము
దివి వీడి భువిపైకి”

అని భావకవులను వాస్తవ జగతికి తెచ్చే ప్రయత్నం కూడా చేశారు.

“నీకు మంచి ఎక్కడా కనబడదా?” అన్న తన విమర్శకుల ప్రశ్నకు సమాధానంగా త్యాగరాజ గానసభలో ఆయన “చెప్పే నీతులను చేతల్లో చూపుతున్న నేత ఎవరో చెప్పండి” అని సూటిగా ప్రశ్నిస్తూ, అలాంటి వారికి “క్షోణితలంబు నెన్నుదురు సోకగ మ్రొక్కెద” అని బాహాటంగా ప్రకటించారు.

కానీ అంతకు ముందే, మూడు దశాబ్దాల క్రిందటే ఆయన తన ఓ కవితలో

"గొప్ప వాళ్ళ మాటల్లో
తప్పులెన్ను దుర్ వ్యసనం
పుట్టుకతో వచ్చె నీకు
పోతుందా మాటలతో!"

అని ఆత్మ బోధ చేసుకుంటే

తన సంధ్యా సమయంలో "ధమ్మపదం" అనువదిస్తూ, ఆ భావనను -మూలానికే మెరుగులు దిద్ది-

"పరుష వాక్కుల పరుల రాపాడవద్దు
తిట్టు కింకొక్క తిట్టు తోబుట్టువగును
దూషణల వల్ల కలుగు సంతోషమేమి
దెబ్బలాడిన తప్పదు దెబ్బ నీకు"

అని ఆత్మవిమర్శ చేసుకున్నాడు.

"నిప్పులాంటి నిజం చెప్పాలంటే నా జీవితంలో ఎవరితోను నాకు వ్యక్తిగతమైన తగవుల్లేవు" అని తన ఆత్మకథ "మనస్సాక్షి " లో వ్రాసుకున్నారాయన. అక్షరాలా నిజమే! అందుకే తన ఆత్మకథకు తావిమర్శించిన, తనను తెగడిన శ్రీశ్రీ కవితతోనే శ్రీకారం చుట్టాడాయన.

చాలామందికి తెలియని విషయం ఏమిటంటే నటుడు నాగభూషణం కోరిక మేరకు ఆయన "ప్రజానాయకుడు" సినిమాకు గాను

"మేడే పండుగ వచ్చిందీ ఎర్రని జెండా ఎగిరిందీ
కార్మికులంతా ఏకం కమ్మని కదన శంఖమూ ఊదిందీ"

అన్న పాట రాసిన వృత్తాంతం.

కానీ చిత్రంలో ఆ పాటకు బదులు ఆత్రేయ వ్రాసిన

"పండుగొచ్చిందీ ఓలమ్మీ పండుగొచ్చిందీ" అన్న పాట వాడుకోవడం ఒసింత వింతే! ఎంతైనా అది చిత్ర జగత్తే!!

రాంభట్ల కృష్ణమూర్తి ప్రమేయం వల్ల 1972లోనే రామోజీరావు తో పరిచయమైనా 1976లో 'ఈనాడు' హైదరాబాద్ ఎడిషన్ కు యువకవులకై ఓ కాలం వ్రాయమని మల్లారెడ్డిని ఆయన ఆహ్వానించడం, కమ్యూనిస్టు పార్టీ లోని కొందరు ముఖ్యులు మొదట హోల్ టైమ్ ఆర్గనైజర్ లు సైతం పాక్షిక ఆదాయం వచ్చే మార్గం చూసుకోవచ్చని చెప్పినా, తదుపరి ఆయనను 'ఈనాడు' ఆఫీసు కు వెళ్ళవద్దనడం, ఆయన పార్టీకి రాజీనామా ఇచ్చేలా చేసాయ్. ఆస్తులు సహా అర్పించిన నలభై యేళ్ళ ఆయన అంకితభావం, బాంధవ్యం అలా పంకిలంగా అంతమయ్యింది.

"కొత్తపాళీ' పాత పార్టీకి చరమగీతం పాడింది.

ఆ రోజుల్లోనే 'ఈనాడు' లో సిబ్బంది సమ్మెవల్ల సంక్షోభంతో ఎడిటోరియల్ బ్యూరో నుండి ముగ్గురు నిష్క్రమించితే, మొదట సంపాదకీయం మినహా ఇతర రచనలకు మల్లారెడ్డి అంగీకరించారు. కలం పేర్లతో ప్రారంభమైన కాలం లు క్రమేణా ఆయన పేరుతోనే వెలువడ్డాయి. చివరికి సంపాదకీయం కూడా ఆయనకే దక్కింది. 'పాత వాసన' కమ్యూనిస్టు పదజాలం దొర్లకుండా వ్యంగాన్నీ, అధిక్షేపాన్ని మేళవించి కవితాత్మకంగా సాగేది ఆయన శైలి. కాని రామోజీరావుతో కలిసి పనిచేయడం ఆయన్ను చాలామందికి, ముఖ్యంగా ఆయన కమ్యూనిస్టు మిత్రులందరికీ దూరం చేసింది... ఎంత దూరమంటే 1978లో ఆయనకు గుండెపోటొస్తే కనీసం వారెవరూ వచ్చి పరామర్శించ నంత దూరం.

'ఈనాడు'లో ఆయనకు ఎనలేని యశస్సు లభించినా తీరని ఆర్తి, ఆర్థిక సమస్య. అంచేత అంతకన్నా ఎక్కువ ఆర్థిక ప్రయోజనం సమకూరే ప్రతిపాదనను అంగీకరించి 'ఆంధ్రభూమి' చేరారు మల్లారెడ్డి. కాని పత్రికా రంగంలో తన స్థానమానాలన్నీ 'ఈనాడు' వల్లే అని ఆయన ఒప్పుకున్నారు. చెప్పుకున్నారు కూడా.

'ఆంధ్రభూమి'లో చురకలు పేలినా, ఐదేళ్ళ ఆయన "అజ్ఞాతవాసం' అడవిగాచిన వెన్నెలే అయ్యింది. తరువాతి "ఉదయం"లో స్వ, పర వివక్ష లేని 'అక్షింతలు' సంచలనాన్నే రేపాయి.

"సిగ్గు శరం ఉన్నవాడు సిపిఐ లో చేరడు
మతిస్థిమిత మున్నవాడు మార్క్సిస్టులతో ఉండడు"

– అన్నది అందులో భాగమే!

ఆనంద బుద్ధ విహార ట్రస్ట్ కోరిక ప్రకారం మల్లారెడ్డి 'ధమ్మపదం"ను తెనుగు చేశారు. అనువాదం జయప్రదంగా ముగించడ మటుంచి, బుద్ధుని ప్రవచనాలు, అదే సమయంలో జిడ్డు కృష్ణమూర్తి రచనలు ఆయనను ఆధ్యాత్మికం వైపు నడిపాయి.

1996లో స్వామి వివేకానంద వ్రాసిన "యతిగీతం" కవిత కు ఆయన తెనుగు తర్జుమా ను ఆయన నోటివెంటే విన్న రామకృష్ణ మఠం స్వామి పరమార్థానంద తన్మయులై ప్రశంసించారు.

ఆయన ఆచార్య నాగార్జునిని "సుహృల్లేఖ"ను కూడా అనువదించారు. ఆ పుస్తకావిష్కరణ సభే ఆయన పాల్గొన్న చివరి సభ.

1997 జూలై 5న మల్లారెడ్డి అంతిమ శ్వాస వదిలారు.

"బ్రతుకు పూలబాట కాదన్నా
ప్రతి మలుపులోనా
బలిసి ఉన్న ముళ్ళ పొదలన్నా"

అన్న ఆయన వాక్యాలు స్వానుభవాలే!

* * *

చెరిగిపోని సంతకం

జనవరి 23 తేదీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా

ధైర్యానికి మనిషి రూపం... సుభాష్ చంద్రబోస్

- జి. వి. శ్రీనివాస్
77024 55559

భారతదేశపు మొదటి ప్రధాని సుభాష్ చంద్రబోస్? భారత దేశపు మొదటి అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ ? భారత దేశపు మొదటి యుద్ధ (రక్షణ) మంత్రి సుభాష్ చంద్రబోస్ ? ఈప్రశ్నలు కాస్త వింతగా అనిపిస్తాయి. కానీ చరిత్ర ఏం చెప్తోంది. ఒకరకంగా నిజమే అని. ఆశ్చర్యం గొలిపే ఆ జవాబు వెనుక ఏం జరిగిందో చూద్దాం.

పరిచయం అవసరం లేని పేరు 'సుభాష్ చంద్రబోస్'. ఆ పేరు వినగానే ఏదో తెలియని ఉత్తేజం ఆవరిస్తుంది. కళ్ళ ముందు ఆజానుబాహు రూపం, గుండ్రటి కళ్ళద్దాలు, మిలటరీ యూనిఫారం, గంభీరమైన చూపులు, ప్రసన్నవదనం గుర్తుకు వస్తాయి. తెరిచిన పుస్తకంలాంటి అతని జీవితంలో మనం చూడలేని పేజీలెన్నో. అతని మాట.చేత, చివరికు మరణమూ మన ఆలోచనలకు పదును పెడతాయి. తెలిసిన విషయాలను, తెలియని విషయాలను, తెలిసీ తెలియని విషయాలను ఆ మహానేత జయంతిని పురస్కరించుకొని మరొక్కసారి గుర్తు చేసుకుందాం.

బోస్ నాన్నగారు జానకీనాథ్ బోస్. ప్రముఖ న్యాయవాది. తల్లి ప్రభాబతి బోస్. వీరికి 1897 జనవరి 23 తేదీన సుభాష్ చంద్రబోస్ జన్మించారు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకు, తెలివైన బోస్ తన 23 ఏట 1920లో భారతీయ సివిల్ సర్వీస్ రాసి, మొదటి ప్రయత్నంలోనే నాలుగో స్థానంలో నిలిచారు. కానీ స్వతంత్ర భావాల బోస్ ఆ ఉద్యోగం వదులుకున్నారు.

అంతకు ముందు 1902లో కటక్‌లోని ప్రొటెస్టెంట్ యూరోపియన్ పాఠశాల లో చేరారు. అక్కడ ఏ ఒక్క భారతీయ భాష గాని, సంస్కృతి గాని నేర్పలేదు సరికదా బ్రిటిష్ చరిత్ర, వారి సంస్కృతి మాత్రమే నేర్పేవారు. కానీ ఇంటి వద్ద తల్లి బెంగాలీలో బోధించే రామాయణ, భారత కథలు, పాటలు నేర్చుకొని తన జ్ఞాన సంపద, మాతృభాషపై మమకారం పెంచుకున్నారు బోస్. బ్రిటిష్ వారి ప్రభుత్వంలో కుమారుడు ఉన్నతోద్యోగం చేయాలంటే అటువంటి పాఠశాల, స్వచ్ఛమైన ఆంగ్లం చాలా ముఖ్యమని తండ్రి భావన. రెండు విరుద్ధ భావాల మధ్య తనదైన వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నారు.

ప్రాథమిక పాఠశాల తరువాత రావెన్‌షా కాలేజియేట్ స్కూల్‌లో బెంగాలీ, సంస్కృతం భాషలు కూడా నేర్చుకున్నారు. ఉన్నత విద్య కోసం 1913లో సంపన్న విద్యార్థులు చదువుకొనే కలకత్తాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో చేరారు, తత్వశాస్త్ర అధ్యయనం కోసం. కానీ అక్కడ 1916 ఫిబ్రవరిలో కాలేజీ చరిత్ర ప్రొఫెసర్ ఓటేన్ భారతీయ సంస్కృతి గురించి అభ్యంతరకరమైన వాఖ్యలు చేశాడని విద్యార్థులు గొడవ ప్రారంభించారు. ఒకరోజు ఓటేన్‌ను చెప్పులతో కొట్టి, కొంతమంది విద్యార్థులు పారిపోయారు. అందులో బోస్ ఒకరని ఆరోపణ చేసిన ఓటేన్ మాటతో బోస్‌ను కళాశాల నుంచి బహిష్కరించారు. తరువాత వేరే కాలేజీలో చేరి పట్టా పుచ్చుకున్నారు బోస్.

కానీ తండ్రి ఆలోచనలు వేరే ఉన్నాయి. ఇక్కడే ఉంటే ఇలానే ఉంటుందేమోనని, కొడుకును ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్ష శిక్షణ కోసం ఇంగ్లాండ్ వెళ్లమని కోరారు. తండ్రి కోరిక మేరకు 1919 అక్టోబరు 20న లండన్ చేరుకున్నారు బోస్. 1920లో జరిగిన పరీక్షలో నాలుగో స్థానంలో నిలిచారు. ఆ తరువాత 1921లో జరిగే తుది పరీక్షకు హాజరవ్వాలి. కానీ బోస్ మనసు ఆ ఉద్యోగంపై లేదు. తన సోదరుడు శరత్ బోస్‌కు రాసిన ఉత్తరంలో "నాలాంటి స్వభావం ఉన్న వ్యక్తికి ఈ ఉద్యోగం సరైంది కాదు. హృదయంలో ప్రాపంచిక ఆశలు లేని నన్ను జీవితంలోని అనిశ్చిత పరిస్థితులు భయపెట్టలేవు. నేను ఆ ఉద్యోగంలో చేరి పౌర సేవకే బందీ అయిపోతే, దేశానికి పూర్తి స్థాయిలో సేవ చేయలేను. కాబట్టి నేను పరీక్ష రాయకుండా ఇంటికి తిరిగి వచ్చేస్తాను".

పొంగుతున్న ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న 24 ఏళ్ల వయసులో 1921 జులై 16న బొంబాయి చేరుకున్నారు బోస్. లండన్లో ఉన్నప్పుడు తల్లి రాసే ఉత్తరాల ద్వారా గాంధీపై అభిమానం పెంచుకున్న బోస్ గాంధీని కలవాలి అనుకున్నారు. అనుకోకుండా గాంధీ బొంబాయిలోనే ఉండటంతో, కలవడానికి అనుమతి తీసుకొని కలిశారు. అప్పటికి గాంధీజీ వయస్సు బోస్ వయస్సుకి రెట్టింపు పైనే. 51 ఏళ్ల గాంధీజీతో తన అభిప్రాయాలు నిక్కచ్చిగా చెప్పిన బోస్

ఆవేశం, దేశభక్తి గాంధీజీని ఆకట్టుకున్నాయి. కానీ తీవ్రభావాలే నచ్చలేదు. అందుకే అతనిని చిత్తరంజన్‌దాస్ వద్దకు పంపారు, అక్కడ స్థిమిత పడతారని.

1922లో స్వరాజ్ పత్రికను స్థాపించి, తన స్వరాన్ని వినిపించసాగారు బోస్. అతని భావాలకు యువత ఎంతగానో ఆకర్షితులయ్యేవారు. 1923లో బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శిగా, భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగ అధ్యక్షునిగానూ ఎన్నికయ్యారు. అక్కడి నుండి బోస్ ప్రభావం దేశమంతా వ్యాపించసాగింది. 1924లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బోస్‌ను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసి, వారి ఆధీనంలో ఉన్న బర్మాలోని మండలే జైలులో ఖైదు చేసి ఉంచింది. అక్కడే బోస్‌కు క్షయ వ్యాధి సోకింది. 1927లో విడుదల అయిన తరువాత కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి అయ్యారు బోస్. 1928 చివరిలో కలకత్తాలో భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాన్ని ఎంతో గొప్పగా నిర్వహిస్తూ, స్వచ్ఛంద దళాన్ని ఏర్పాటు చేసి కొత్త మార్గం చూపాడు. కానీ గాంధీజీకి నచ్చలేదు. అతను ఈ సమావేశాన్ని 'బెర్ట్రామ్ మిల్స్ సర్కస్'గా పేర్కొన్నాడు. బెర్ట్రామ్ మిల్స్ అనే అతను లండన్‌లో ప్రసిద్ధి కెక్కిన సర్కస్ కంపెనీ యజమాని. గాంధీజీ అభిప్రాయం బెంగాల్లో తీవ్ర దుమారం రేపింది.

1934లో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయిన బోస్ ఆరోగ్యం రోజురోజుకు క్షీణించడంతో, జైలులో బోస్‌కు జరగరానిది జరిగితే ఎదురయ్యే పరిణామాలను ఊహించిన బ్రిటిష్ ప్రభుత్వం బోసును యూరప్‌లోని ఆస్ట్రియాకు చికిత్స కోసం పంపింది.

అక్కడే బోస్ జీవితం మలుపు తిరిగింది. చికిత్స పొందుతూనే యూరప్‌లోని భారతీయ విద్యార్థులను ఏకం చేసి, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో భాగస్వాములుగా చేయాలని తపన పడేవారు. అక్కడి ఒక పబ్లిషర్ కోరిక మేరకు 'ది ఇండియన్ స్ట్రగుల్' అనే పుస్తకం రాయాలి అనుకున్నారు. అందు కోసం ఇంగ్లీష్ తెలిసిన, టైపింగ్ వచ్చిన సహాయకులు కోసం చూడగా, 23 ఏళ్ల ఎమిలీ అనే ఆస్ట్రియా యువతి ఎంపిక అయ్యారు. అంతవరకు దేశస్వాతంత్ర్యపు ఆలోచనలు తప్ప, వేరేమి లేని బోస్ హృదయంలో ప్రేమ మొలకెత్తింది. ఆమె అంగీకారంతో అది మరింతగా పరిమళాలు

వెదజల్లుతూ పుష్పించింది. ఆ సమయంలో బోస్ రాసిన లేఖలు ఆమె పట్ల, తమ భవిష్యత్ పట్ల బోస్‌కున్న ఆలోచనలు తెలియజేశాయి.

"భవిష్యత్తులో ఏం జరుగుతుందో నాకు తెలీదు. బహుశా నేను జీవితాంతం జైలులో గడపాల్సి రావచ్చు. నన్ను కాల్చి చంప వచ్చు, ఉరి తీయవచ్చు. నేను మళ్లీ నిన్ను చూడలేకపోవచ్చు. బహుశా నేను ఉత్తరాలు కూడా రాయలేక పోవచ్చు. కానీ నన్ను నమ్ము. నువ్వెప్పుడూ నా హృదయంలోనే ఉంటావు. మనం ఈ జీవితంలో కలిసి ఉండలేకపోతే, వచ్చే జన్మలోనైనా కలిసి ఉందాం" అని ఎమిలీకి రాశారు.

బోస్ సోదరుడు శరత్ చంద్రబోస్ కుమారుడు శిశిర్‌కుమార్ బోస్ భార్య కృష్ణ బోస్ రాసిన 'ఎ ట్రూ లవ్‌స్టోరీ-ఎమిలీ అండ్ సుభాష్' అనే పుస్తకంలో ఎమిలీ, బోస్‌ల వివాహం 1937 డిసెంబర్ 27న ఆస్ట్రియాలోని బాడ్‌గస్టైన్‌లో జరిగిందని పేర్కొన్నారు. అయితే వారిద్దరూ తమ వివాహాన్ని రహస్యంగా ఉంచాలని నిర్ణయించుకున్నారని కూడా రాసారు.

ఎమిలీని అక్కడే ఉంచి, భారతదేశం వచ్చిన బోస్ 1939లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అది కూడా గాంధీజీ బలపరచిన అభ్యర్థి భోగరాజు పట్టాభి సీతారామయ్యపై పోటీ చేసి. 'అహింస ద్వారా మాత్రమే స్వాతంత్ర్యం రాదు. పోరాటమే సరైన మార్గం' అని నమ్మే బోస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో కొంతమంది చేసిన రాజీనామాలు చివరికి బోస్ తన అధ్యక్ష పదవిని వదులుకొనేలా చేశాయి. వెంటనే బోస్ 'ఫార్వర్డ్ బ్లాక్' ను ఏర్పాటుచేసి, దేశ వ్యాప్త వామ పక్షాలన్నింటిని ఒక త్రాటి పైకి తీసుకురావాలని ప్రయత్నం చేశారు.

కాంగ్రెస్ నాయకత్వాన్ని గాని, భారతీయులను ఎవ్వరినీ సంప్రదించకుండా 1940లో రెండో ప్రపంచ యుద్ధంలో భారతదేశం తరపున యుద్ధం ప్రకటించిన వైస్రాయ్ లార్డ్ లిన్‌లిత్‌గో నిర్ణయానికి వ్యతిరేకంగా తీవ్రంగా నిరసనలు తెలియ జేశారు బోస్. యుద్ధం అనంతరం బ్రిటిష్ వారు స్వాతంత్ర్యం ఇస్తారని గాంధీ, నెహ్రూ నమ్మారు. 'కాదు కాదు యుద్ధంలో మునిగిపోయిన బ్రిటిష్ వారిని దెబ్బ కొట్టడానికి ఇదే సరైన సమయం' అని బోస్ వాదన. కానీ ఈ విషయంలో గాంధీని ఒప్పించలేకపోయారు. సామూహిక నిరసనలు నిర్వహిస్తున్న బోస్‌ను బ్రిటిష్ అధికారులు 1940 జులై రెండో తేదీన

దేశద్రోహం నేరం కింద జైల్లో పెట్టారు. ఎంతకూ విడుదల చెయ్యక పోవడంతో, నవంబరు 29 నుంచి తన అక్రమ నిర్బంధానికి నిరసనగా నిరాహార దీక్ష చేస్తున్న బోస్‌ను డిసెంబరు 5 తేదీన విడుదల చేసి, గృహ నిర్భంధంలో పెట్టి, అతని ఇంటిపై గట్టి నిఘా ఉంచారు.

కొద్దిరోజులకు 'ఇక తనను బయటకు వెళ్లనివ్వరు' అని అర్థమైన బోస్ తప్పించుకు పోవడానికి ప్రణాళిక వేశారు. తన అన్న కొడుకు శిశిర్‌కుమార్ బోస్ సహాయంతో మారువేషంలో జనవరి 16 అర్ధరాత్రి 1:35 నిమిషాలకు తమ జర్మన్ వాండేరర్ కారులో తప్పించుకొని బయటకు వచ్చారు. చివరికి తన ప్రియమైన తల్లికి కూడా చెప్పకుండా. 'మహమ్మద్ జియాఉద్దీన్ బి.ఎ. ఎల్.ఎల్.బి., ట్రావెలింగ్ ఇనస్పెక్టర్, ది అంపైర్ ఆఫ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ' అనే నకిలీ విజిటింగ్ కార్డుతో రైలుమార్గంలో బోస్ పెషావర్ చేరు కున్నారు. అక్కడి నుండి మూగ, చెవిటివాడిలా నటిస్తూ జనవరి 31 నాటికి కాబూల్ (ఆఫ్ఘనిస్తాన్) చేరారు. అక్కడి నుండి మాస్కో, ఆ తరువాత మార్చి నాటికి జర్మనీ రాజధాని బెర్లిన్ చేరుకున్నారు బోస్.

సుభాష్ చంద్రబోస్ తన ఇంటి చుట్టూ ఉన్న బ్రిటిష్‌వారి కళ్ళు గప్పి తప్పించుకున్న విషయాన్ని అనారోగ్యంతో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్‌ను చూడటానికి వెళ్ళిన శిశిర్‌కుమార్ బోస్ అబద్ధం ఆడలేక ఉన్న విషయం చెప్పాడు. అది కూడా బోస్ సురక్షితంగా జర్మనీ చేరిన తరువాత. రవీంద్రనాథ్ ఆఫ్ఘనిస్తాన్‌లోని కఠిన దారుల గుండా స్వేచ్ఛ కోసం అన్వేషిస్తూ సాగిన ఒంటరి యోధుడి ప్రయాణం గురించి 'బద్నామ్' అనే కథను 1941 ఆగస్టులో రాశారు.

అక్కడి నాజీ నాయకత్వంతో కలిసి, భారత స్వతంత్ర పోరాటానికి మద్దతు కూడ గట్టే ప్రయత్నం చేశారు. అక్కడే ఆజాద్ హింద్ రేడియో ప్రసారాలు మొదలు పెట్టారు బోస్. యుద్ధంలో అగ్రరాజ్యాలకు బందీ అయిన 4500 మంది భారతీయ సైనికులతో 'ఇండియన్ లెజియన్' అనే దళాన్ని స్థాపించారు. ఆ సైన్యం తమ ప్రతిజ్ఞ ద్వారా హిట్లర్‌కు, బోస్‌కు తమ విశ్వాసాన్ని ప్రకటించారు. “భగవంతుని సాక్షిగా నేను జర్మన్ జాతి, రాజ్యం ఏకైక నాయకుడైన ఎడాల్ఫ్ హిట్లర్‌కు, భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడే జర్మన్ సైన్యం నాయకుడైన సుభాష్ చంద్రబోస్‌కు విధేయుడనై ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను' అని సైనికులందరూ ప్రతిజ్ఞ చేశారు. దళం మొత్తం జర్మనీ ఆధీనంలో ఉండి, భారత దేశ విషయంలో బోస్ నాయకత్వంలో నడిచింది. తన ఇండియన్ లెజియన్ దళంతో పాటు జర్మన్ సైన్యం రష్యా మీదుగా భారతదేశం వచ్చి, బ్రిటిష్ వారిపై దండెత్తి, వారిని తరిమి కొడుతుందని బోస్ ఆశ, నమ్మకం.

బోస్ తన భార్య ఎమిలీతో కలసి 1941-43 కాలంలో బెర్లిన్‌లో నివసించారు. అక్కడే 1942 నవంబరు 29న వారి జీవితంలోకి అందాల పాప అడుగు పెట్టింది. ఇటలీ విప్లవ నేత గారీబాల్డీ భార్య అయిన అనిత గారీబాల్డీ పేరిట ఆ పాపకు అనిత అని పేరు పెట్టారు.





Subhash Chandra Bose

రోజులు గడుస్తున్నా జర్మన్ సైన్యాధికారుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో భారత స్వాతంత్ర్య విషయంలో హిట్లర్‌ను ప్రత్యక్షంగా కలవాలని నిర్ణయించు కున్నారు బోస్. ఫలితంగా 1942 మే నెల చివరిలో హిట్లర్‌తో సమావేశ జరిగింది. కానీ చర్చలు సానుకూలంగా జరగలేదు. వెంటనే బోస్ మనసులో జపాన్ ఆలోచన మెదిలింది. తమ జలంతర్గామి ద్వారా బోస్‌ను జపాన్ పంపడానికి హిట్లర్ అంగీకరించారు. భార్య, పాపను అక్కడే ఉంచి, 1943 ఫిబ్రవరిలో జర్మన్ జలాంతర్గామి ద్వారా ప్రయాణం చేసి, మధ్యలో జపాన్ జలాంతర్గామిలోకి మారారు బోస్. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో రెండు దేశాల జలాంతర్గామిల మధ్య ప్రయాణం చేసిన ఏకైక వ్యక్తి బోస్. జపాన్ ఆధీనంలో ఉన్న సుమత్రా దీవుల్లో బోస్ అడుగు పెట్టారు.

జపనీస్ మేజర్ ఇవైచి ఫుజీవారా, నిఘా విభాగం అధిపతి ఫుజీవారా కికాన్‌ల సంయుక్త ఆలోచన నుండి ఇండియన్ నేషనల్ ఆర్మీ రూపుదాల్చింది. వారి ముఖ్యోద్దేశం యుద్ధంలో పట్టుబడ్డ భారతీయ సైనికులతో ఒక సేన ఏర్పాటు చేసి, జపాన్ కోసం జపాన్ సైన్యంతో కలిసి పోరాడే దళం ఏర్పరచడం. 1941 లో పశ్చిమ మలయన్ ద్వీపంలో తమకు పట్టుబడిన బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ కెప్టెన్ మోహన్‌సింగ్‌ను 1942 జనవరి మొదటివారంలో ఇండియన్ నేషనల్ ఆర్మీకి నాయకుణ్ణి చేశారు. కానీ మోహన్‌సింగ్‌కు, కికాన్‌కు మధ్య విభేదాలతో 1942 డిసెంబరులో ఇండియన్ ఆర్మీని రద్దు చేశారు. 1943లో బోస్ అడుగు పెట్టిన తర్వాత సరికొత్త ఉత్సాహంతో ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐ.ఎన్.ఏ) స్వాతంత్ర సైన్యం ఆలోచనలతో మరలా ఆవిర్భవించింది. బోస్ పిలుపుతో ప్రవాస భారతీయులు కూడా వేలాదిగా ఐఎన్ఏలో చేరారు. జపాన్ ఆధీనంలోని ఆగ్నేయాసియాలో బోస్ ఒక చారిత్రికమైన పని చేశారు.

సుభాష్ చంద్రబోస్ కోరిక మేరకు జపాన్ తన ఆధీనంలో ఉన్న అండమాన్, నికోబార్ దీవులను బోస్‌కు ఇచ్చింది. నేతాజీ అండమాన్ పేరును షహీద్ ద్వీప్ అని, నికోబార్ పేరును స్వరాజ్యద్వీప్ అని సరికొత్త పేర్లు పెట్టారు. అక్కడ 1943 అక్టోబరు 21న 'ఆజాద్ హింద్ ప్రభుత్వం' ఏర్పాటు చేస్తూ "భారతదేశ విముక్తి కోసం తుది పోరాటానికి వేదిక సిద్ధమైంది" అని ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. 'అర్జీ హుకుమత్-ఎ- ఆజాద్ హింద్' అని బోస్ ప్రభుత్వాన్ని పిలిచే వారు. త్రివర్ణ పతాకాన్ని జాతీయ పతాకంగా, జనగణమనను దేశ జాతీయ గీతంగా ప్రవేశ పెట్టారు. పులి చిహ్నంతో ఐఎన్ఏ జెండాను, ఇత్తెఫాక్, ఎత్ మాద్, ఖుర్బానీ (ఐక్యత, ఒప్పందం, త్యాగం) అనే నినాదంతో జాతీయభావాన్ని అలవరచారు. కుల మతాలతో సంబంధం లేకుండా ప్రజలందరూ జైహింద్ అని పలికే విధానం పెంపొందించారు. ఆజాద్ హింద్ ప్రభుత్వంలో దేశాధినేతగా, ప్రధాన మంత్రిగా, యుద్ధ మంత్రిగా బోస్ ప్రమాణం చేశారు. బ్రిటిష్ కరెన్సీ మొదలగు వాటిని తిరస్కరిస్తూ సొంత కరెన్సీ, తపాలా బిళ్లలు, పాస్‌పోర్టులు జారీ చేశారు. ఝాన్సీ రెజిమెంట్ అనే ప్రత్యేక మహిళా సైనిక విభాగం ఏర్పాటు చేసి, దానికి కెప్టెన్ లక్ష్మీస్వామినాధన్ నాయకత్వం వహించారు. బోస్ ప్రభుత్వం ఆధీనం లోనూ, పాలనలోనూ అండమాన్, నికోబార్ దీవులు, మణిపూర్‌లో కొద్దిభాగం ఉండేవి. జర్మనీ, జపాన్, ఇటాలియన్ సోషల్ రిపబ్లిక్, క్రొయేషియా స్వతంత్ర రాష్ట్రం, చైనాలోని వాంగ్ పాలన ప్రాంతం, బర్మా ప్రభుత్వం, ఫిలిప్పీన్స్ దేశాలు 'ఆజాద్ హింద్ ప్రభుత్వాన్ని' గుర్తించాయి. 1943 నవంబరులో జరిగిన 'గ్రేటర్ ఈస్ట్ ఆసియా కాన్ఫరెన్స్'లో కూడా ఆజాద్ హింద్ ప్రభుత్వం పాల్గొంది.

1943 డిసెంబరు 30న తమ పాలనలో ఉన్న ప్రాంతాలలో స్వాతంత్ర్య భారత పతాకాన్ని ఎగురవేశారు బోస్. బ్రిటిష్ సర్కార్ కన్నెర్ర చేసింది. నేతాజీ పాలన ప్రాంతాలపై యుద్ధం ప్రకటించింది. అప్పుడే బోస్ సరికొత్త నినాదం 'ఛలో ఢిల్లీ' అంటూ ఇండో-బర్మా సరిహద్దులో యుద్ధం ప్రకటించారు. ఇంఫాల్-కొహిమా సెక్టార్‌లో జపాన్ సైన్య సహకారంతో ఆజాద్‌హింద్ ఫౌజ్ తమ పరాక్రమంతో బ్రిటిష్ సేనను తరిమి కొట్టాయి. ఈ ఓటమి ఇక భారత్‌ను ఎక్కువ కాలం పాలించలేమనే భావన ఆంగ్ల ప్రభుత్వంలో కలగజేసింది.

బోస్ ధైర్యంగా బ్రిటిష్ వారి కళ్లు గప్పి ఒంటరి పోరాటం చేస్తూ, అగ్రదేశాల మద్దతు తీసుకోవడం, ప్రభుత్వం ఏర్పాటుచేయడం, ఇండియన్ నేషనల్ ఆర్మీ భారతదేశంలోని కొంతభాగాన్ని తమ స్వాధీనంలో ఉంచుకోవడంతో దేశం లోపల బోస్‌కు విపరీతమైన అభిమానగణం ఏర్పడింది. అదే సమయంలో బ్రిటిష్ వారికి చెమటలు పట్టాయి.

కానీ రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ వెనకడుగు, ఐఎన్ఏ స్థైర్యాన్ని కాస్త దెబ్బ తీసింది. 1945 ఆగస్టు 18న జరిగిన తైవాన్ విమాన ప్రమాదంలో బోస్ మరణించారు అనే వార్త ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపింది. భారతదేశాన్ని దుఃఖ సముద్రంలో ముంచింది. కానీ ఎక్కువ శాతం ప్రజలు ఈ వార్తను నమ్మలేదు. బోస్ బతికే ఉన్నారు అని చాలా సంవత్సరాలు నమ్మడం బోస్ పట్ల ప్రజల ప్రేమకు నిదర్శనం.

ఈరోజు మనందరం గర్వంగా పలికే జైహింద్ నినాదం సుభాష్ చంద్రబోస్ మనకు అందించిందే. అయితే ఈ నినాదం వెనుక చిన్న కథ ఉంది. హైదరాబాదుకు చెందిన అబిద్ హసన్ సాఫ్రాని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో కీలకంగా పనిచేశారు. అప్పట్లో ఇండియన్ నేషనల్ ఆర్మీ సైనికులు పరస్పరం పలకరించుకోవడానికి 'నమస్తే, నమస్కారం, రామ్ రామ్, సత్ శ్రీ అకాల్, సలాం వాలేకుం...' ఇలా భిన్న పదాలతో పలకరించుకునేవారు. అప్పుడు అబిద్ 'జై హిందూస్తాన్' అని సూచించారు. దానిని బోస్ 'జై హింద్'గా మార్చి జాతికి అందజేశారు.

బోస్ మరణం ఇప్పటికీ ఒక చిక్కుముడిగానే ఉంది. నలుగురు సభ్యులతో కూడిన షానవాజ్ కమిటీ బోస్ మరణాన్ని విచారించడానికి 1956 మే నెలలో జపాన్ వెళ్లింది. కానీ ఆశించిన ఫలితాలు రాలేదు. 1990-2005 మధ్యలో విచారణ చేపట్టిన ముఖర్జీ కమిషన్ 'బోస్ ప్రయాణిస్తున్న విమానం తైవాన్‌లో కూలిపోలేదు, జపాన్ రెంకోజీ ఆలయంలో ఉన్నది బోస్ చితాభస్మం కాదు' అనే నివేదికను 2005 నవంబరు 8న భారత ప్రభుత్వానికి సమర్పించింది. ప్రభుత్వం ఆ నివేదికను 2006 మే 17న పార్లమెంటులో ప్రవేశపెట్టి తిరస్కరించింది.

1985లో ఆయోధ్య దగ్గర ఫైజాబాద్‌లో ఉండే భగవాన్‌జీ అనే సన్యాసి అజ్ఞాతంలో ఉన్న బోస్ అని చాలామంది నమ్మారు. భగవాన్‌జీ మరణానంతరం అతని వస్తువులు పరిశీలించిన ముఖర్జీ కమిషన్ అతను బోస్ కాదని ప్రకటించింది. బోస్ మరణానంతరం అతని భార్య ఎమిలీ చిన్న పోస్టాఫీసులో పనిచేస్తూ, కూతురు అనితను జర్మనీలో ఒక గొప్ప ఆర్థికవేత్తగా తీర్చిదిద్దారు.

స్వాతంత్ర భారతదేశంలో బోస్ పేరిట నాణేలు, తపాలా బిళ్లలు విడుదల చేశారు. కలకత్తా విమానాశ్రయానికి సుభాష్ చంద్రబోస్ పేరు పెట్టారు. రైల్వేస్టేషన్‌కు, కొన్ని రైళ్లకు, విశ్వ విద్యాలయాలకు బోస్ పేరు పెట్టి నిత్యం స్మరించుకోవడం జరుగుతోంది. 2021 నుండి బోస్ జయంతి పురస్కరించుకొని జనవరి 23ను భారత ప్రభుత్వం 'పరాక్రమ దివాస్' అని ప్రకటించింది.

చిత్ర, విచిత్రం బోస్ జీవితం. అతని సాహసాలు, లక్ష్య సాధన కోసం బ్రిటిష్ కళ్లు గప్పి సుదూర తీరాలు ప్రయాణించడం, తనకంటూ సైన్యం తయారు చేసుకొని బ్రిటిష్ వారికి చెమటలు పట్టించడం, చివరకు మరణం కూడా ఇప్పటి వరకు చర్చించుకొనే విధంగా ఉండటం, ఇప్పటికీ భారతదేశ ప్రజల ప్రేమకు నోచుకోవడంతో సుభాష్ చంద్రబోస్ జీవితం మనదేశ చరిత్రలో చెరిగిపోని సంతకం అయ్యింది.

* * *

వారసత్వ, సంప్రదాయ సంస్కృతి - 14

అమెరికా క్వార్టరు డాలరు ఒక ప్రత్యేకం

- జి. శివప్రకాష్, 90003 45699

సాధారణంగా ఏ దేశ నాణెమైనా దానికి ఒకవైపు విలువ, ముద్రించిన సంవత్సరము ఆ దేశపు పేరు తదితర వివరాలు ఉంటాయి. రెండవవైపు ఆ దేశపు రాజులు, ఆ దేశం లోని ప్రముఖ కట్టడాలు, పూల మొక్కలు, పక్షులు, జంతువులు లేదా ప్రత్యేక సందర్భాల వివరాలు తదితర వాటిని ముద్రిస్తారు. ఇటువంటివి అన్ని రాష్ట్రాలకు ఒకేలా ఉంటాయి. రాష్ట్రాలకు ప్రత్యేకం అంటూ ఏమీ ఉండదు. ఆ దేశం యావత్తు ఒకే విధమైన మారక నాణెములు ఉంటాయి. అయితే అగ్రరాజ్యం అయిన అమెరికా మాత్రం క్వార్టరు డాలరు (1/4 డాలరు) విషయములో ఒక ప్రత్యేకత చాటుకుంటుంది.

అమెరికా ప్రథమ అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్

మినిసోటా రాష్ట్ర 1/4 డాలరు

న్యూయార్క్ రాష్ట్ర 1/4 డాలరు

కాలిఫోర్నియా రాష్ట్ర 1/4 డాలరు

సాధారణంగా అమెరికాలో ఒక డాలరు, అర డాలరు, పావు డాలరు, 10సెంట్లు (పెన్నీలు అని కూడా పిలుస్తారు), 5 సెంట్లు, ఒక సెంటు ఇలా నాణెములను ముద్రిస్తారు. ఈ క్వార్టరు డాలర్లకు మాత్రం రాష్ట్రం యొక్క ప్రత్యేకతను తెలియజేస్తూ ఉంటాయి. 1/4 డాలరుకు ఒకపక్కన అమెరికా మొదటి అధ్యక్షుడు జార్జివాషింగ్టన్ ముఖచిత్రం ఉంటుంది. రెండవ ప్రక్కన ప్రతి రాష్ట్రం యొక్క ప్రత్యేకతను తెలిపే విధంగా ఆ రాష్ట్రం పేరుతో, రాష్ట్రం యొక్క చిహ్నంతో ముద్రిస్తారు. ఇలా అమెరికా 50 రాష్ట్రాల క్వార్టరు డాలర్లనూ సేకరించడం ఒక మంచి అనుభూతిని కలుగచేస్తుంది.

అలాగే అమెరికా పోస్టలు శాఖ వారు కూడా ఒకే షీటులో అన్నిరాష్ట్రాల ప్రత్యేకత గల బొమ్మలతో స్టాంపులను విడుదల చేస్తారు. వాటిలో ముఖ్యంగా ఆయా రాష్ట్రాల అధికారిక పక్షులు, పువ్వులు, నదులు, తదితర వాటిని ముద్రించి ఆ రాష్ట్రాలకు గల కీర్తి ప్రతిష్టలను తెలియచేస్తూ ఒక కేప్షన్ (వాక్యం) ఉంటుంది.

అలాగే నోట్ల విషయంలో కూడా అన్ని దేశాల కంటే విభిన్నంగా ఉంటాయి. ఒక డాలరు మంచి 100 డాలర్ల నోటు వరకూ అన్ని నోట్లు ఒకే విధమైన కొలతలు కలిగి ఉంటాయి. నోట్లు పొడవు, వెడల్పు ఒకేలా ఉండటం ప్రత్యేకం. చాలా దేశాల కరెన్సీ విలువను బట్టి పొడవు, వెడల్పులలో తేడాలు ఉంటాయి.

రాష్ట్రాల వారిగా ప్రత్యేకత గలిగిన ఈ క్వార్టరు డాలర్లు అమెరికా వినియోగంలో ఎక్కువగా ఉంటాయి. వాటి తరువాత స్థానంలో 20 డాలర్ల నోట్లు ఎక్కువ వినియోగంలో ఉంటాయి. నా సేకరణలో గల వివిధ రాష్ట్రాల (50 రాష్ట్రాలు) క్వార్టరు డాలర్లను క్రమ పద్ధతిలో చేర్చి రాష్ట్రాల వారిగా గల స్టాంపులు, జెండాలను క్రమ పద్ధతిలో కూర్చి ప్రదర్శన ద్వారా నేటి తరానికి, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాను.



అమెరికా రాష్ట్రాల స్టాంపులు ఒకే షీటుపైన

* * *

స్త్రీని గురించి మహాత్మాగాంధీ

- కర్లపాలెం హనుమంతరావు, 81422 83676

స్త్రీని అబల అనడం నేరం. అది పురుషుడు స్త్రీలకు చేసే అన్యాయం. బలం అన్న మాటకు అర్థం పశుబలమే అయితే, స్త్రీ-పురుషునంతటి పశువు కాదని చెప్పాలి. అదే బలం అన్న మాటకు అర్థం నైతికబలమే అయితే స్త్రీ తప్పకుండా పురుషుడి కంటే ఎన్నో రెట్లు అధికురాలని చెప్పాలి. స్త్రీకి సహజంగానే జ్ఞానం, ఆత్మ త్యాగ నిరతి, ఓర్పు, ధైర్యమూ ఎక్కువ. స్త్రీ లేకుంటే పురుషుడి మనుగడేలేదు. స్త్రీ కంటె హృదయాన్ని కదిలించే శక్తి ఏముంది?

పురుషుడు స్త్రీని తన పరికరంగా పరిగణించాడు. ఆమె కూడా అలా ఉండడానికి అలవాటు పడింది. అలా ఉండడం ఆమెకు సులువుగాను, సంతోషకరంగానూ పరిణమించింది. ఎందుచేత... కిందికి పడిపోతూ ఉన్నవాడు తనతోబాటున్న వ్యక్తిని దిగువుకులాగుతున్నప్పుడు అలా పడడం సులువుగానే ఉంటుంది మరి.



(అప్పటి మాట... ఇప్పుడు ఆ పరిస్థితుల్లో కొంత మార్పు వచ్చింది.)

స్త్రీ పురుషుని స్నేహితురాలు. ఆమెకు పురుషునితో సమానమైన తెలివి తేటలున్నాయి. ఆమెకు పురుషుని కార్యకలాపాలలో పాల్గొనే హక్కు ఉంది. అతని కున్నంత స్వాతంత్ర్యమూ స్వేచ్ఛా కూడా ఆమెకున్నాయి. అజ్ఞానులు, పనికిమాలినవాళ్ళు అయిన పురుషులు కూడా స్త్రీలపై ఆధిక్యత కనబరుస్తున్నారు. ఆ ఆధిక్యత చూపడానికి వారికి అర్హతలేదు. వారలా చూపకూడదు కూడా. మన ఉద్యమాలన్నీ సగంలోనే ఆగిపోవడానికి మన స్త్రీలు వెనకబడి ఉండడమే కారణం.

నేను స్త్రీగా పుట్టి ఉంటే - స్త్రీ తన 'ఆటబొమ్మ' కావడానికే పుట్టిందనుకొనే పురుషుణ్ణి ఎదిరించి విప్లవం లేవదీసి ఉండేవాణ్ణి. స్త్రీ తాను 'మగవాడి విలాస వస్తువు' అనుకోవడం మానాలి. అందుకు పరిష్కారం ఆమె చేతుల్లోనే ఉంది. ఆమె పురుషుడితో సమానమైనదే అయితే అతని ఆనందం కోసం (ఆ పురుషుడు తన భర్త అయినా సరే) అలంకరించుకోవడాన్ని వ్యతిరేకించాలి. రాముణ్ణి తన సౌందర్యంతో ఆకర్షించడం కోసం సీత ప్రయత్నించి ఉంటుందని నేను అనుకోను.

పెళ్ళి చేసుకోవడానికి, కట్నానికీ ముడిపెట్టే యువకుడు తన చదువును, స్వదేశాన్ని, స్త్రీత్వాన్ని కించపరుస్తున్నాడని నా భావం. కట్నాలు తీసుకునే వాళ్ళను సంఘం నుంచి బహిష్కరించాలి. ఆడపిల్లల తండ్రులు డిగ్రీలను చూసి మోసపోకుండా కులాల అడ్డు గోడలను దాటి, తమ కుమార్తెలను పెళ్లాడగల ధైర్య సాహసాలు కల యువకుల కోసం విశాల ప్రపంచంలో అన్వేషించాలి.

స్త్రీ అహింసకు మరో రూపం. అంతులేని ప్రేమే అహింస. ఓర్పుకు ఉనికి అదే. అలా ఓర్పుకు నిదర్శనం స్త్రీ. గర్భధారణతో తొమ్మిది నెలలు కష్టపడినా, ప్రసవానంతరం తన కన్నబిడ్డ కంట బడగానే స్త్రీ హృదయం మాతృప్రేమతో జాలువారుతుంది.

స్త్రీ జాతి తమ ప్రేమను మానవజాతిపై కురిపించాలి. మగవాడి తల్లిగా, మార్గదర్శిగా స్త్రీ ఉన్నత స్థానం పొందాలి.

స్త్రీలకు చదువు అక్కరలేదనే వారితో నేను ఏకీభవించలేను. చదువు కొన్న స్త్రీ తన పిల్లలను విద్యావంతులు చెయ్యడంలో గొప్ప పాత్ర వహిస్తుంది. చదువు స్త్రీలను 'మంచి మనుషులు'గా తీర్చిదిద్దుతుంది.

ఆడవాళ్ళూ, మగవాళ్ళూ వేర్వేరని నేను అనుకోను. స్త్రీ పురుషులు ఒక నాణెం రెండువైపుల వంటివాళ్లు. కనుక ఈ రెండు జాతులలో ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ అనే ప్రశ్నకి తావులేదు. ఒకరు లేకపోతే ఇంకొకరు లేరు. స్వార్థపరులైన పురుషులు చాలామంది స్త్రీలు తమకంటే తక్కువ వారని చెవిన ఇల్లు కట్టుకుని పోరవచ్చు. అయితే మహాత్ములు మాత్రం స్త్రీల విలువను గుర్తించారు. శక్తి స్వరూపమైన స్త్రీ లేకుంటే పురుషుడు ఏం చెయ్యగలడు?

* * *

కథ

కీ.శే. బెహరా వెంకట సుబ్బారావు స్మారక జాతీయ కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

ఆశల భారం

- ఎస్. సురేంద్రనాథ్, 812130 3029

అధ్యాయం - 1

"నాన్నా ఇదేనా రావడం. ముందుగా చెబితే స్టేషన్‌కి వచ్చేవాడిని కదా" అన్నాడు గోపి.

"పర్లేదు లేరా, అలవాటే కదా. పోయినేడు బోర్ల కోసమని ఇక్కడ డబ్బులు ఇప్పించావు కదా. పంట డబ్బులొచ్చాయి. కట్టి పోదామని వచ్చాను" అన్నాడు కృష్ణయ్య.

"ఇక్కడ సర్దుబాటు అయ్యింది. కట్టేసాలే...ఆ డబ్బు నీ దగ్గర ఉంచు. తమ్ముడెలావున్నాడు."

"ఏరు దాటించిన తెప్పతో ఇక వాడికి పనేం ఉంది. చదువులో మెరుగ్గా ఉన్నాడని ఖర్చుకు వెనుకాడక అమెరికాలో ఎం.ఎస్ చదివించాం. ఉద్యోగం వచ్చాక అక్కడ జీతమెంతో, ఎంత మిగిలిస్తున్నాడో ఒక్క మాటైనా చెప్పడు. ఇంటికి ఇప్పటి వరకు ఒక్క రూపాయి రాల్చలేదు. మహా స్వార్థపరుడు" అంటూ ఆవేశపడ్డాడు.

"పరాయి దేశంలో వాడు బాగుంటే చాలు. ఇక్కడ మనకేం లోటుంది, బాగానే ఉన్నాం కదా."

"మీ అమ్మమాట విని పెళ్లి చేసా. అప్పటి నుండి పంజరంలో చిలకల్లే పెళ్లాం పలికిందే వేదం వాడికి. నిన్ను చూస్తే మాత్రం సంతోషమనిపిస్తుందిరా పెద్దోడా" అన్నాడు.

"ఊరుకో నాన్నా...అవన్నీ మనసులో పెట్టుకోవద్దు" అన్నాడు.

అధ్యాయం - 2

కృష్ణయ్య ముప్పై ఎకరాల మోతుబరి రైతు. పెద్దవాడైన గోపి వ్యవసాయమంటే ఆసక్తి లేదనడంతో టౌన్లో ఆటోమొబైల్ షాప్ పెట్టించాడు. చిన్నవాడైన వంశీతో అమెరికాలో ఎం.ఎస్ కంప్యూటర్స్ చేయించాడు. ఉద్యోగం వచ్చిన తర్వాత వంశీ చాలా మారిపోయాడు. జీతమెంతో చెప్పడు, డబ్బులు ఇంటికి పంపడు. ఈ వైఖరితో కృష్ణయ్య మనస్తాపం చెందాడు.

కొన్ని నెలలు గడిచాయి. వంశీ జంట అమెరికా నుండి ఇంటికొచ్చారు.

"నాన్నా బాగున్నావా" అని కృష్ణయ్యను పలకరించాడు.

"ఆ..." అంటూ ముక్తసరిగా పలికాడు కృష్ణయ్య. ఆయన కళ్లకు వంశీ ఇష్టం లేని అతిథిలా అనిపించాడు. కొడుకు రాకతో హడావుడి చేస్తున్న భార్యను చూసి కృష్ణయ్యకు ఒళ్ళు మండిపోతూ వుంది. వంశీని చూస్తేనే చిరాకనిపించడంతో ముఖం తిప్పుకొని సరిగా మాట్లాడడం లేదు. మూడు రోజులు గడిచాయి. తమ్ముడ్ని చూసేందుకు గోపి కుటుంబంతో గ్రామానికొచ్చాడు.

అధ్యాయం - 3

భోజనాల తర్వాత అందరినీ సమావేశపరచి "ఆస్తుల్ని పంచుదామనుకుంటున్నాను" అన్నాడు కృష్ణయ్య.

"ఏంది నాన్నా ఇది అకస్మాత్తుగా! ఇప్పుడేం తొందరొచ్చింది" అన్నాడు ఆవేదనగా గోపి.

"నిజమే నాన్న తొందరపడొద్దు" అన్నాడు వంశీ. ఈ మాట వినగానే ఎగిరి గంతేస్తాడనుకుంటే, ఆశ్చర్యంగా వద్దంటున్నాడే వీడు అనుకున్నాడు కృష్ణయ్య.

"ఈ ఇల్లు, అమ్మ బంగారం మా తదనంతరం అమ్మి ఇద్దరూ పంచుకోండి. ముప్పై ఎకరాల భూమి నాతో కలిపి తలా పదెకరాలు. నా తదనంతరం నా పాలు భూమిని పెద్దోడికి ఇస్తామనుకుంటున్న. ఎందుకంటే ముసిలిమబ్బున మమ్మల్ని చూసుకునేది వాడే కాబట్టి. ఏమంటావు" అన్నాడు వంశీవైపు చూసి.

"నువ్వు ఎట్లంటే అట్లే నాన్నా" అన్నాడు వంశీ. అక్కడ దాచుకున్నది పంచాల్సిన అవసరం తప్పిందని ఈ పంపకానికి ఒప్పుకున్నాడని అర్థమైంది కృష్ణయ్యకు.

"మంచిది. నీ భార్య కూడా ఒక మాటంటే బాగుంటుంది. తర్వాత సంసారంలో గొడవలు రాకూడదు కదా" అన్నాడు.

"మామయ్యా మీరెలా అంటే అలాగే" అంది వంశీ భార్య. ఏందబ్బా వీళ్లు అక్కడ రెండేళ్లలో అంత వెనకేసుకున్నారా! పదెకరాలు పోతాయన్నా తొణకడమే లేదు అనుకున్నాడు.

"మామయ్యా...నేనొక మాట అడగొచ్చా" అంది వంశీ భార్య కాస్త తడబడుతూ.

ఏదో పితలాటకం పెట్టబోతుంది అని అనుకున్నాడు కోడలి మనస్తత్వం తెలిసిన కృష్ణయ్య.

"అడగమ్మా" అన్నాడు.

"ఎందుకు మామయ్య వచ్చినప్పటి నుండి మాతో సరిగా మాట్లాడడం లేదు. ఆయన ఎంతో బాధపడుతున్నారు" అంది తడి కన్నులతో. అందరూ వంశీవైపు చూసారు. వంశీ కళ్లలో సుడులు తిరుగుతున్న కన్నీరు! కనబడనివ్వకుండా లేచి పక్కకెళ్లి నిల్చున్నాడు.

"రేయ్ ఎందుకురా నొచ్చుకుంటావు...నాన్నకు నువ్వొకటి నేనొకటి కాదు...ఇలా వచ్చి కూర్చో" అంటూ తమ్ముడిని ఊరడించాడు.

కొడుకు బాధతో విలవిలలాడటం చూసి కృష్ణయ్య మనసు కరిగిపోయింది.

"మరి చిన్నోడా రెండేళ్ల సంది అక్కడ ఏం సంపాదిస్తున్నావో, జీతమెంతో అడిగితే పలకవు. పెళ్లయ్యాక మరీ మారిపోయావు. మనసు బాగోలేక నీతో అలా ఉన్నాను" అన్నాడు.

"మీ అబ్బాయికి అక్కడ ఉద్యోగం లేదు మామయ్యా. ఇద్దరం చిన్న పార్ట్‌టైం జాబ్ చేస్తూ సంసారం నెట్టుకు వస్తున్నాం" వణుకుతున్న స్వరంతో అంది వంశీ భార్య. ఉబికి వస్తున్న కన్నీటికి పైటతో అడ్డుకట్ట వేస్తూ.

"ఏందమ్మా నువ్వనేది" పట్టరాని ఆశ్చర్యంతో అడిగాడు కృష్ణయ్య.

"అవును నాన్నా... పెళ్లయిన కొత్తల్లో ఏఐ పుణ్యమా అని ఉండే ఉద్యోగం ఊడిపోయింది. ఇద్దరం కావడంతో ఖర్చులు పెరిగిపోయాయి. కారు ఈఎంఐలు, ఇతర లోన్లు కట్టలేకపోయాను. కారు కూడా జప్తు చేసారు. నీకు, అన్నకు విషయం తెలియజేద్దామనుకున్నాను. కానీ నీ కోడలు నన్నాపింది. మనింట్లో, వాళ్లింట్లో ఏమీ చెప్పొద్దని మాట తీసుకుంది" అన్నాడు గద్గద స్వరంతో.

"మామయ్యా... మా జీవితం బాగుండాలనే ఆశతో ఖర్చుపెట్టి చదివించారు. అమెరికాలో ఉద్యోగమని ఎంతో ఆశతో మా అమ్మానాన్న పెళ్లి చేసారు. నిజం చెప్పి అందరినీ బాధపెట్టడం కన్నా ఆ కష్టమేదో మేమే అనుభవిద్దామనుకున్నాము. ఒక్కోసారి పనివేళల్లో తిండి తినే సమయం లేకపోయినా, నెల చివర్లో డబ్బులు లేక పస్తులున్నా ఇప్పటికీ పోరాటం చేస్తునే ఉన్నాం. అంతేకాని మిమ్మల్ని బాధ పెట్టాలని కాదు" అంది కన్నీళ్లు తుడుచుకుంటూ.

కృష్ణయ్య కళ్లు తెరుచుకున్నాయి. కోడలి వ్యక్తిత్వం ఎంత గొప్పదో అర్థమయ్యింది.

"మేమే కాదు నాన్నా. మాలాంటి ఎందరో ఏ.ఐ కారణంగా విదేశాలలో ఉద్యోగాలు పోగొట్టుకుని ఇబ్బందుల్లో ఉన్నారు. పస్తులుండి పనులు వెతుక్కుంటున్నారు. మన ప్రాంతంలో వలస కూలీలకు, మాకూ తేడా ఏమీ లేదు. మాలాంటి వారి మీద తల్లిదండ్రుల అంచనాలు పెరిగిపోతున్నాయి. మీ ఆశల భారం మోస్తూ, వాస్తవంలో బ్రతకడం బరువై ఒక్కోసారి చావడం మేలని పిస్తుంది. లేనిపోని ఆశలతో దూరతీరాలవైపు చేతగాని ఈతకొట్టి మునిగిపోవడం కన్నా ఇక్కడే ఏదో ఒక పనిచేసుకుంటూ, పచ్చడి మెతుకులు తింటూ ఉన్నంతలో సంతోషంగా బ్రతకడమే మేలు" అన్నాడు అదుపులేకుండా స్రవిస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ.

వాస్తవం భూకంపంలాగా కృష్ణయ్యను కదిలించింది.

"చిన్నోడా అక్కడ ఎన్ని ఇక్కట్లు పడ్డావురా... పౌరుషంతో పస్తులున్న నీముందు ఆస్తుల ప్రసక్తి తెచ్చి మూర్ఖంగా నిన్ను బాధపెట్టాను" అంటూ కౌగిలించుకొని బాధపడ్డాడు.

"రేయ్... నీకు అభ్యంతరం లేకుంటే ఇక్కడే ఉండిపో. వ్యవసాయం చూసుకో. సన్నిమ్మ, చీని, మామిడి ఐదైదు ఎకరాలలో నాటు. ఐదేళ్లలో అక్కడి కన్నా ఎక్కువే రాబడి ఉంటుంది. మిగిలిన భూమిలో నాన్న సలహా మేరకు సేద్యం చేయి. హెచ్చుతగ్గులకు నేనున్నాను. భయపడకు" అన్నాడు ప్రేమగా తమ్ముడి తలనిమురుతూ గోపి.

"నా మనసులో కూడా ఇదే ఉందన్న" అన్నాడు వంశీ. మదిలో సంతోషం మోహన రాగమై వినిపిస్తుండగా.

* * *

సాహిత్య చైతన్య పథగామి... విరియాల లక్ష్మీపతి

- అడపా రామకృష్ణ
95052 69091

కొత్త ఏడాది వస్తూ వస్తూనే విశాఖ సాహిత్య సాంస్కృతిక లోకానికి తీరని హృదయ విఘాతం కలిగించింది. అభ్యుదయ సాహిత్య స్వర విరుల విరియాల లక్ష్మీపతి ఆకస్మిక మృతి ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని విషాదంలో ముంచింది.

విశాఖపట్నం పోర్టు సంస్థ అందించిన విశిష్ట రచయితలలో వాకాటి పాండు రంగారావు, భమిడిపాటి రామగోపాలం, ఆదూరి సీతారామమూర్తి, విరియాల లక్ష్మీపతి, నవులూరు వెంకటేశ్వరరావు, పాట్నిడి చక్రరావు, పి.అనంతరావు, తోట తిరుపతిరావు వంటి కథకులు, నాటకకర్తలు, కవులలో ఒకరిగా విరియాల లక్ష్మీపతి ప్రసిద్ధులు. వీరి అకాల మరణం అభ్యుదయ రచయితల సంఘానికి సైతం తీరనిలోటు కలిగించింది.

రాష్ట్రానికి చెందిన పలువురు ప్రఖ్యాత సాహిత్యవేత్తలతో పరిచయాలు, నాటక రచయితగా పెంపొందిన నాటకరంగ సాన్నిహిత్యాలు, అనేకమంది రచయితలు, నటులు, గాయకులతో విరియాల లక్ష్మీపతి దీర్ఘకాల స్నేహాన్ని పెంపొందించాయి. అటు ఆచార్య చందు సుబ్బారావు గారితో పాటు విరియాల లక్ష్మీపతి 'అరసం' కార్యవర్గ ముఖ్యుడిగా నిర్వహించిన ఎన్నో కార్యక్రమాలకు విశాఖ మహానగరం వేదిక అయ్యింది. పురిపండ అవార్డు పేరిట 'అరసం' పురస్కార ప్రధాన సభల్లో పాల్గొనే ఎందరో రచయితలు పాల్గొనే సాహిత్య సందడితో, ఇటు అరసం, అటు విశాలాంధ్ర రెండింటికి సి.పి.ఐ. ప్రాంతీయ యూనిట్ల తోడ్పాటు లక్ష్మీపతిని మంచి నిర్వాహకుడిగా తీర్చిదిద్దాయి.

ఆరుబయిట అరుణోదయం కవితా సంపుటితో తన లోకాభ్యుదయ భావజాలాన్ని వెలార్చిన విరియాల లక్ష్మీపతి డాక్టర్ ఆవంత్స సోమసుందర్, మహాకవి శ్రీశ్రీల సాహిత్యంపై విశ్లేషణా వ్యాసావళి అందించారు. పాబ్లో నెరోడా కవితల తెలుగు అనువాద సంపుటి వెలువరించడంలో ఎందరో కవులచే నెరుడా కవితలను అనువదింపజేసిన ప్రోత్సాహశీలిగా సాహిత్య లోకం గుర్తించుకునే ప్రజారంజక పుంభావానికి తాను పెట్టింది పేరు. అనేక యువ కవుల సంపుటాలకు ముందుమాటలు రాసి, వారి సాహిత్య భవిష్యత్తుకు తీరైన దారులు వేసిన జగమంత సాహిత్య కుటుంబీకుడు విరియాల లక్ష్మీపతి.

సాంస్కృతిక విషయాలనుశీలనంలో కొత్త పుంతలు తొక్కిన నాటకకర్తగా సింహాచల క్షేత్రానికి చెందిన వందల ఏళ్ళనాటి సాహిత్యమూర్తి అన్నమయ్య కన్నా ముందువాడైన వచన కృతికర్త శ్రీకాంత కృష్ణమయ్య జీవిత సాహిత్య వివరాలను పరిశోధించి, వెలికి తీసి, ఈ ప్రాంతపు సాహిత్య సాంస్కృతిక చరిత్ర ప్రాచీనతను తెలియజేసే దృశ్యకావ్యంగా, 'శ్రీకాంత కృష్ణమయ్య' నాటకాన్ని రచించారు లక్ష్మీపతి. ఇది సింహాచల దేవస్థానంలో ఎన్నో ప్రదర్శనలు అందించిన నాటక సమాజాల వారికి ఎంతో ఆప్తుడయ్యారు రచయిత. 'సింహగిరి వచనాలు'గా శ్రీకాంత కృష్ణమయ్య వెలువరించిన వచనాలు మన భక్తి సాహిత్య ఆవిర్భావాన్ని చరిత్రను ఎంతో ముందుకు తీసుకువెళతాయి.

రాయలసీమ, మహారాష్ట్ర, కర్నాటక, ఉత్తరప్రదేశ్‌లలో అన్నమయ్య, తుకారం, సంత్ జ్ఞానేశ్వర్, మీరా, అక్కమహాదేవి వంటి ఎందరో భక్తి సాహిత్య శిరోమణులు కన్నా తొలితరం వాడిగా మన ప్రాంతపు శ్రీకాంత కృష్ణమయ్యను నిలుపుకునే ప్రయత్నాలేమి ఇంకా ఎవరూ చేయకముందే ఈ విషయమై ముందడుగు వేసినవాడు సాహిత్య, సాంస్కృతిక ఐక్య చైతన్య పథగామి 'విరియాల లక్ష్మీపతి'. కథనాన్ని దృశ్యానువాదం చేయడంలో దిట్ట. నిజానికి లక్ష్మీపతి సేవలు ఇంకా ఎక్కువగా ఈ రంగానికి (నాటకీకరణ) అందాల్సిన, నిండు అభివ్యక్తి గల సాహిత్య ప్రతిభావంతుడిని అకాలంలో పోగొట్టుకున్నా మన్నదే తీరని దుఃఖః. చాసో, రావిశాస్త్రి, కారా, బలివాడ కాంతారావు, పతంజలి వంటి వారి రచనల దృశ్యా నువాదం, మారుతున్న సాహిత్య, ప్రసార మాధ్యమాల వేగంలో ఒక తప్పనిసరి అంశం. దీనికి మూలస్థంభంగా నిలబడగల శక్తి గలవాడు విరియాల. అయిదు వందల ఏళ్ళనాటి భక్తి యుగపు కథను నాటకంగా మలిచినా, ఇటు ఆధునిక తెలుగు సాహిత్యపు మణిమకుటం లాంటి కేశవరెడ్డి నవలిక 'అతను అడివిని జయించాడు'ను రేడియో నాటకంగా మలిచినా రెండింటా విజయం సాధించిన సవ్యసాచి విరియాల లక్ష్మీపతి.

'శ్రీకాంత కృష్ణమయ్య' నాటకం మన ఉత్తరాంధ్ర ప్రాంతపు చారిత్రిక సాంస్కృతిక అభివ్యక్తికి తోరణంగా నిలిస్తే, అతను అడివిని జయించాడు నవలికకు విరియాల చేసిన శబ్ద నాటకీకరణ, ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రానికి, జాతీయ స్థాయిలో ఉత్తమ సమర్పణగా గుర్తింపు తీసుకురావడం లక్ష్మీపతి ప్రతిభకు గీటురాళ్ళు.

ఎంతోకాలం మన మధ్య ఉండాల్సినవాడు, ఉత్తరాంధ్ర కవి సమ్మేళనంలో యాభైమంది కవులతో గొంతు కలిపిన సీనియర్ కవి, చాసో సాహిత్య సమాలోచనలో ప్రధాన భాగమై, చాసో శత జయంతికి ప్రణాళికలు రచిస్తున్న అభ్యుదయ కార్యకర్త... తటాలున నిష్క్రమించడం భరించలేక ఒక్కటే అడిగింది రుద్ధస్వరంతో సాహిత్యలోకం...' ఆరుబయట ఏ అరుణోదయం పిలుస్తోందని వెళ్లి పోయావయ్యా. ఇంకా ఈ లోకాన విరియాల్సిన ఎన్నో పూలగుత్తుల్ని గుండెల్లో దాచుకొని' విరియాల లక్ష్మీపతి. 12 జనవరి 2012న నిష్క్రమించడం తీరని లోటుగా భావించక తప్పదు.

* * *

విశ్వ సాహిత్య లలిత కళావేదిక ఆధ్వర్యంలో విశాఖపట్నం లోని పౌర గ్రంథాలయంలో డిసెంబరు 26 తేదీన నిర్వహించిన సభలో 'గణపతిరాజు ఈశ్వరవర్మ సాహితీ పురస్కారం'తో విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకులు శిరేల సన్యాసిరావును సత్కరిస్తున్న అతిథులు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఆచార్య కందర్ప శ్రీనివాస్, డా.డి.వి.సూర్యారావు తదితరులు.

అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబరు 24 తేదీన హనుమకొండలో నిర్వహించిన ప్రథమ నవలల పోటీలో ద్వితీయ బహుమతి గెలుచుకున్న జి.వి.శ్రీనివాస్ దంపతులు సత్కరిస్తున్న అతిథులు ఆచార్య బన్న అయిలయ్య, అంపశయ్య నవీన్, స్వప్న తదితరులు.

బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని కొరటాల సమావేశ మందిరంలో డిసెంబరు ఏడో తేదీన వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్, విశాఖ సంస్కృతి మాస పత్రిక సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలో విజేతలైన రచయితలు నందిరాజు పత్మలతా జయిరాం, వాడపల్లి పూర్ణ కామేశ్వరి, కైకాల సుమలతలను సంస్థ అధ్యక్షులు బండికల్లు జమదగ్ని, అతిథులు శీరంశెట్టి కాంతారావు, గంటేడ గౌరునాయుడు తదితరులు ఘనంగా సత్కరించారు.



2026 జనవరి పోస్టు కార్డు క్యాలెండర్

న్యూటన్ పోతుల స్మారక కథల పోటీలో ఎంపికైన కథ

కొలతలు

- కోనే నాగవెంకట ఆంజనేయులు
92906 60220

దసరా పండుగ మరో పదిహేను రోజుల్లో రాబోతోంది. ఊరి మధ్యలో వెలసిన అమ్మవారి గుడిలో కడువైభవంగా జరుగుతాయి నవరాత్రి ఉత్సవాలు.

రావిచెట్టు మీద తన మిత్రునితో కలిసి కోతికొమ్మచ్చి ఆడుకుంటున్నాడు ఈరిగాడు అని పిలిచే పన్నెండేళ్ల వీరయ్య. వాడి నాన్న రిక్షా లాగుతాడు. ఈరిగాడు ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు.

సైకిల్ తొక్కుకుంటూ అటుగా వస్తున్న సుబ్బారాయుడు ఆగి ఆ పిల్లలందరినీ పరిశీలనగా చూస్తున్నాడు. సుబ్బారాయుడు తమవైపే చూస్తుండడం గమనించి పిల్లలందరూ కాసేపు తమ ఆట ఆపుచేసి నిశ్శబ్దంగా చూడసాగారు.

"ఒరేయ్ ఇలా రారా" ఎప్పుడూ తనను చూసినా చీదరించుకునే సుబ్బారాయుడు అంతమందిలో తననే వేలుపెట్టి చూపిస్తూ పిలవడంతో ఆశ్చర్యపోతూ బెదురుగా అతని వద్దకు వెళ్లాడు ఈరిగాడు.

'నాతో రారా. సైకిలెక్కు' అంటూ వాడిని తన సైకిల్ వెనుక క్యారేజీమీద ఎక్కించుకుంటూ సైకిల్ తొక్కుకుంటూ లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో ఉన్న 'రామా క్లాత్ స్టోర్' బట్టల దుకాణం దగ్గరకు తీసుకుని వెళ్లి సైకిల్ ఆపాడు సుబ్బారాయుడు.

సైకిల్ దిగి స్టాండ్ వేసిన సుబ్బారాయుడు తన చేయి పట్టుకుని ఆ బట్టల దుకాణంలోకి తీసుకుని వెళ్తుంటే ఆశ్చర్యంగా అతన్ని అనుసరించాడు ఈరిగాడు.

తన ఒంటిమీద ఉన్న మాసిపోయిన చొక్కా, లాగువైపు చూసుకున్నాడు వాడు. అవి ఎప్పుడో పొట్టివైపోయి చిరుగులు కూడా పట్టాయి. గత వారం రోజులుగా ఆ చొక్కాలాగు వాడి ఒంటిని అంటిపెట్టుకుని ఉన్నాయి కంపుకొడుతూ. లోపలికి వెళ్లిన సుబ్బారాయుడు ఈరిగాడిని చూపించి వాడి సైజుకు సరిపడే కొలతలతో ఖరీదైన చొక్కాగుడ్డలు, లాగు గుడ్డలు నాలుగు జతలు తీసుకున్నాడు.

తనను చూసి చిరాకుపడే అయ్యగారికి ఈరోజు తనమీద దయ ఎందుకు కలిగిందో అర్థం కావడం లేదు ఈరిగాడికి. మౌనంగా తన సంతోషాన్ని తన మనసులో దాచుకున్నాడు వాడు.

అయ్యగారు కొన్న రంగురంగు గుడ్డలన్నీ తనకు నచ్చినవే. తనుపుట్టి బుద్ధెరిగి అలాంటి ఖరీదైన బట్టలు ఎప్పుడూ వేసుకోలేదు.

డబ్బులు చెల్లించి ఆ గుడ్డల సంచీ పట్టుకుని బయటకు నడిచాడు సుబ్బారాయుడు. వెనుకే అనుసరించాడు ఈరిగాడు.

మళ్లీ వాడిని సైకిలెక్కించుకుని మసీదు పక్కనున్న భాషా టైలరింగ్ షాపు దగ్గర సైకిల్ ఆపాడు సుబ్బారాయుడు.

చాలాకాలం తరువాత తన షాపునకు వచ్చిన



కథ

సుబ్బారాయుడిని సాదరంగా ఆహ్వానించాడు భాషా.

"బాషా...ఇవిగో గుడ్డలు. వీడి కొలతలు తీసుకుని అందంగా బట్టలు కుట్టేయాలి. వారం రోజుల్లో ఇచ్చేయాలి సుమా" చెప్పాడు సుబ్బారాయుడు అక్కడ ఉన్న కుర్చీలో కూలబడుతూ.

మెడలో వేలాడుతున్న టేపు తీసి, వీరిగాడి చొక్కా, లాగుల కొలతలు తీసుకున్నాడు భాషా - సుబ్బారాయుడు పర్యవేక్షణలో నాలుగు చొక్కాలన్నీ ఫుల్ చేతులవే. నాలుగు ఫుల్‌ఫ్యాంటులు.

ఈరిగాడి సంబరానికి అంతులేదు. మొదటిసారి పొడుగు ఫ్యాంటు, పొడుగు చేతుల చొక్కా వేసుకోబోతున్నాడు తను.

"కొలతలన్నీ సరిగ్గా తీసుకున్నట్టే కదా" అడిగాడు భాషాను సుబ్బారాయుడు.

"తీసుకున్నానండీ, వారం కాదుగాని పదిరోజుల తర్వాత ఇస్తాను బట్టలు. ఇంకా కుట్టాల్సినవి చాలా ఉన్నాయి. పండుగ రోజులు కదా" అన్నాడు వినమ్రంగా బాషా తిరిగి బట్టలన్నీ సంచిలో సర్దుతూ.

"సరేలే. అన్నట్టు కుట్టేముందు బట్టలన్నీ తడపడం మర్చిపోకు సుమా. పది రోజుల తర్వాత ఆపై బుధవారం వస్తాను. ఆ రోజుకి బట్టలన్నీ చక్కగా ఇస్త్రీచేసి తయారుగా ఉంచు" చెప్పాడు సుబ్బారాయుడు కుర్చీలోంచి లేస్తూ.

నోట మాటరాక ఆనందంగా చూస్తున్న ఈరిగాడిని "ఎక్కరా" అంటూ సైకిలెక్కించుకుని వాడిని వాళ్ల పాక ముందు దించేసి వేగంగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిపోయాడు సుబ్బారాయుడు.

ఈరిగాడు పొంగిపోతున్నాడు. నాలుగు జతల కొత్తబట్టలు. ఈ మాసి, చిరుగులు పట్టిన బట్టలు చూస్తుంటే రోత మొదలయ్యింది వాడికి అప్పుడే. వాడు మూడో క్లాసులో ఉన్నప్పుడు వాళ్లనాన్న పెద్ద పండుగకు కుట్టించిన బట్టలవి. ఆ తర్వాత ఎన్ని పండుగలు వచ్చి వెళ్లినా అవే వాడి కొత్తబట్టలు.

"సుబ్బారాయుడు కుట్టిస్తున్న ఆ నాలుగు జతలతో ఓ నాలుగైదేళ్లు హాయిగా గడిపేయవచ్చు" మేఘాల్లో తేలిపోతున్నట్టుంది ఈరిగాడికి. ఈ విషయం ఇంటిలో ఎవ్వరికీ చెప్పలేదు వాడు. ఒకేసారి బట్టలు తీసుకువచ్చి చూపించి ఆశ్చర్యపరచాలి వాళ్లని అనుకున్నాడు.

పండుగ సమయంలో రోజుకో కొత్త జత వేసుకుని తన జతగాళ్ల దగ్గర ఫోజు కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నాడు. పది రోజులు ఎప్పుడు గడుస్తాయా అని క్షణమొక యుగంలా ఎదురు చూస్తున్నాడు వాడు ఆ రోజు నుంచే.

ఆపై బుధవారం నాడు సుబ్బారాయుడు కోసం, అతను తన కోసం తీసుకురాబోయే కొత్త బట్టల కోసం ఉదయం నుండే వీధి గుమ్మం ముందు పడిగాపులు గాస్తున్నాడు ఈరిగాడు.

"ఎవరొస్తర్రా అయ్యా" అని అడుగుతున్న అమ్మకు సమాధానం కూడా చెప్పలేదు వాడు. గుండె వేగంగా కొట్టుకుంటుండగా వీధివైపే చూస్తూ ఉండిపోయాడు.

ఉదయం మధ్యాహ్నం అయ్యింది. మధ్యాహ్నం సాయంత్రంగా మారిపోయింది. ఊహూ...సుబ్బారాయుడు రాలేదు. తనకు బట్టలు తీసుకువచ్చి ఇవ్వలేదు.

ఈరిగాడిలో నిరుత్సాహం. అంతలోనే మళ్లీ ఏదో ఆశ. ఈరోజు భాషా బట్టలు ఇవ్వలేదేమో! లేకపోతే సుబ్బారాయుడు ఊళ్లో లేడేమో! గురువారం, శుక్రవారం, శనివారం కూడా గడిచిపోయి ఆదివారం కూడా వచ్చేసింది. ఈరిగాడి కొత్తబట్టలు వాడి చేతికి అందలేదు.

"మరునాటి నుంచే ఊర్లో అమ్మవారి గుడిలో నవరాత్రి మహోత్సవాలు మొదలు కాబోతున్నాయి. ఒకవేళ పండుగ రోజు ఇస్తామనుకున్నాడేమో తనకు బట్టలు సుబ్బారాయుడు!" తనకు తానే సమాధానం చెప్పుకున్నాడు ఈరిగాడు.

పండుగ రోజు కూడా ఈరిగాడు పాత చిరిగిన బట్టలే వేసుకుని గుమ్మం ముందు నిలబడ్డాడు ఇంకా ఆశ చావక. గంటలు గడుస్తున్నాయి.

పదకొండు గంటల సమయం. గుమ్మం నుంచి బయటకు చూశాడు ఈరిగాడు. వాడి ఆశ నెరవేరినట్టే ఉంది. దూరంగా సుబ్బారాయుడు సైకిల్ తొక్కుకుంటూ వస్తున్నాడు. ఈరిగాడి గుండె వేగంగా కొట్టుకుంటోంది.

సైకిల్ తమ పాక దగ్గరకు వస్తుంది. ఇంకా బ్రేక్ వేసి సైకిల్ ఆపడమే తరువాయి. సైకిల్ తమ పాక సమీపంలోకి వచ్చింది. పాక దాటి ముందుకు వెళ్లిపోయింది. అప్పుడే సైకిల్ వెనుక క్యారేజీ మీద ఎవరో కూర్చుని ఉండడం గమనించాడు ఈరిగాడు. వాడెవడో గుర్తుపట్టాడు. వాడు...సుబ్బారాయుడి మనవడు. తన ఈడువాడు. ఐదో తరగతి వరకు ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఇప్పుడు తను ఉన్న ఊళ్లోనే తెలుగు బడిలో ఏడో తరగతి చదువుతుంటే వాడు పట్టణంలో ఇంగ్లీషు స్కూల్లో చదువుతున్నాడు హాస్టల్లో ఉండి. వాడి వంటిమీద ఆ రోజు సుబ్బారాయుడు కొని కుట్టించిన కొత్తబట్టలు. ఆ రంగు బట్టల్లో వాడు దొరబాబులా మెరిసిపోతున్నాడు.

అంటే ... అంటే... వాడు ఊళ్లో లేనికారణంగా, వాడంత పొడుగే ఉన్న తనను తీసుకుని గుడ్డలు కొని తన కొలతలు తీసుకుని సుబ్బారాయుడు తన మనవడికి కుట్టించాడని అప్పుడర్థమైంది ఈరిగాడికి.

ఈరిగాడి దసరా పండుగ సరదా అలా ముగిసింది. ఆశలు ఆవిరైపోగా తలుపు మూసి నీరసంగా ఇంట్లోకి నడిచాడు ఈరిగాడు అనబడే వీరయ్య.

* * *

స్వరతరంగం

మన సంగీతదర్శకులు

పరవశాల 'పాట'శాల! ఘనుడు మన ఘంటసాల!!

- రాజేష్ యాళ్ళ, 97004 67675

పెండ్యాల నాగేశ్వరరావు, సాలూరి రాజేశ్వరరావు, కె.వి.మహదేవన్, విశ్వనాథన్, తాతినేని చలపతిరావు, మాస్టర్ వేణు మొదలైన ఎందరో ప్రతిభావంతులైన సంగీత దర్శకులు తెలుగు చలన చిత్రరంగంలో సుమధుర సుస్వరాలను అందిస్తూ రాజ్యమేలుతున్న స్వర్ణయుగంలో వారందరి వద్ద పాడుతూనే తాను ఓ చక్కని సంగీత దర్శకుడనని నిరూపించుకున్న ఏకైక గాయకు డెవరైనా ఉన్నారంటే ఆయన ఘంటసాల గారే!

వీనులవిందైన సంగీతంతో పాటు చక్కని పాటలనెన్నో తన సంగీత దర్శకత్వంలో అందించిన ఘంటసాల వెంకటేశ్వరరావు గారు 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీపములోని చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మ దంపతులకు జన్మించారు. వీరి వంశ జన్మస్థలం కృష్ణా జిల్లాలోనే ఉన్న ఘంటసాల గ్రామం. అక్కడి నుండే వీరు చౌటపల్లికి వలస వెళ్ళారు. నేటికీ వీరి వంశీకులు ఘంటసాల గ్రామంలో ఆలయ పూజారులుగా ఉన్నారు. సూర్యనారాయణ మృదంగం వాయిస్తూ, భజనలు చేసేవారు. అతను ఘంటసాలను భుజంపైన కూర్చోబెట్టుకొని పాటలు పాడుతూ సంగీత సభాస్థలికి తీసుకెళ్ళేవారు. ఘంటసాల అక్కడ జరుగుతున్న భజనలు వింటూ పాటలు పాడుతూ నాట్యం చేసేవాడు. ఘంటసాల నాట్యానికి ముగ్ధులై అతన్ని బాలభరతుడు అని పిలిచేవారు. ఘంటసాల 11వ ఏట తండ్రి సూర్యనారాయణ మరణించారు. చివరి రోజుల్లో అతను సంగీతం గొప్పదనాన్ని ఘంటసాలకు వివరించి ఆయన్ను గొప్ప సంగీత విద్వాంసుడిని అవమని కోరారు.

తండ్రి ఆశయం నెరవేర్చడానికి ఘంటసాల సంగీత గురుకులాలలో చేరినా ఆ కట్టుబాట్లు తట్టుకోలేక వెనక్కు వచ్చేశాడు. ఒకసారి సమీప గ్రామంలో జరిగిన సంగీత కచేరిలో విద్వాంసులతో పోటీపడి ఓడిపోయి నవ్వులపాలయ్యారు. అప్పటి నుండి ఆయనలో పట్టుదల పెరిగింది. తనకు తెలిసిన కొందరు సంగీత విద్వాంసుల ఇళ్ళల్లో పనిచేస్తూ సంగీతం అభ్యసించడానికి నిశ్చయించుకున్నారు. రెండేళ్ళ కాలంలో ఒక ఇంట్లో బట్టలు ఉతకడం, మరొక ఇంట్లో వంట చేయడం నేర్చుకొనవలసి వచ్చింది. ఆలస్యమైనా తన తప్పు తెలుసుకొన్న ఘంటసాల తన దగ్గరున్న నలభైరూపాయల విలువగల ఉంగరాన్ని ఎనిమిది రూపాయలకు అమ్మి అప్పటి ఆంధ్రరాష్ట్రం విజయనగరంలో ఉన్న ఏకైక సంగీత కళాశాలలో చేరారు. కళాశాలలో చేరినప్పటికీ వేసవి సెలవుల కారణంగా కళాశాల మూసి ఉంది. ఆ కళాశాల ప్రిన్సిపల్ దగ్గరకు వెళ్ళి అభ్యర్థించగా ఆయన కళాశాల ఆవరణలో బసచేయడానికి అనుమతి ఇచ్చారు. ఘంటసాల అక్కడ ఉంటూ రోజుకొక ఇంట్లో భోజనం చేస్తూ ఉండేవారు. ఒకసారి తోటి విద్యార్థులు చేసిన తప్పుకు ఘంటసాలను కళాశాల నుండి బహిష్కరించారు. అది తెలిసి వారాలు పెట్టే కుటుంబాల వారు తమ ఇళ్ళకు రావద్దన్నారు. గత్యంతరం లేక ఆ ఊరి ఎల్లమ్మ గుడికి వెళ్ళి తలదాచుకున్నారు. అప్పుడు గుడికి వచ్చిన పట్రాయని సీతారామ శాస్త్రి ఘంటసాల గురించి తెలుసుకొని తన ఇంటిలో ఉచితంగా సంగీత శిక్షణ

ఇవ్వడానికి అంగీకరించారు. ఘంటసాల తన జీవితంలో ఎన్నోసార్లు గురువంటే అతనే అని చెప్పేవారు.

శాస్త్రి చాలా పేదవాడు కావడంతో ఘంటసాలకు భోజన సదుపాయాలు కల్పించలేకపోయాడు. ఆకలితో ఉన్న ఘంటసాలకు ఒక సాధువు జోలెకట్టి మధుకరం (ఇంటింటా అడుక్కోవడం) చేయడం నేర్పించాడు. భుజాన జోలెకట్టుకొని వీధివీధికి తిరిగి రెండు పూటలకు సరిపడే అన్నం తెచ్చుకొనేవాడు. మిగిలిన అన్నాన్ని ఒకగుడ్డలో పెడితే చీమలు పడుతుండేవి. గిన్నె కొనుక్కోవడానికి డబ్బులేక మేనమామకు ఉత్తరం వ్రాయగా అతను పంపిన డబ్బుతో ఒక డబ్బా కొనుక్కొని అందులో అన్నం భద్రపరచేవాడు.

వేసవి సెలవులు పూర్తైన తర్వాత ఘంటసాల కళాశాలలో చేరారు. శాస్త్రి శిక్షణలో నాలుగు సంవత్సరాల కోర్సును రెండు సంవత్సరాలలో పూర్తిచేసాడు. తర్వాత కొన్నాళ్ళు విజయనగరంలో

సంగీత కచేరీలు చేసి మంచిపేరు తెచ్చుకొని తన సొంతవూరు అయిన చౌటపల్లెకు చేరి అక్కడ ఉత్సవాలలో, వివాహ మహోత్సవాలలో పాటలు పాడుతూ సంగీత పాఠాలు చెప్పేవాడు.

1942లో స్వాతంత్ర్య సమరయోధుడిగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండు సంవత్సరాలు అలీపూర్ జైల్లో నిర్బంధంలో ఉన్నారు. 1944 మార్చి 4న ఘంటసాల తన మేనకోడలైన సావిత్రిని పెళ్ళిచేసుకున్నారు. ఆరోజు సాయంత్రం తన పెళ్ళికి తానే కచేరి చేసి అందరినీ ఆశ్చర్యానందాలలో ముంచెత్తారు. కొన్నాళ్ళకు దగ్గర ఊరికి సముద్రాల రాఘవాచార్యులు వచ్చినపుడు ఆయన్ను కలిసారు. ఘంటసాల సామర్థ్యం గ్రహించిన సముద్రాల ఘంటసాలను మద్రాసు వచ్చి కలుసుకోమన్నారు. ఘంటసాల రెండు నెలలు కష్టపడి కచేరీలు చేసి కొంత అప్పుచేసి మద్రాసు వెళ్ళారు. సముద్రాల ఘంటసాలను రేణుకా ఫిలింస్‌కు తీసుకెళ్ళి చిత్తూరు నాగయ్య, బి.ఎస్.రెడ్డిల ముందు పాట కచేరీ చేయించారు. వారిరువురు ఘంటసాల పాట విని అవకాశాలు ఉన్నప్పుడు ఇస్తామన్నారు.

సముద్రాలవారి ఇల్లు చాలా చిన్నది కావడంతో అతనికి ఇబ్బంది కలిగించడం ఇష్టం లేక ఘంటసాల పానగల్ పార్కు వాచ్‌మెన్‌కి నెలకు రెండురూపాయలు చెల్లించే పద్ధతిపై తన మకాంను అక్కడకు మార్చాడు. పగలంతా అవకాశాలకోసం వెతికి రాత్రికి పార్కులో నిద్రించేవారు. చివరికి సముద్రాల అప్పటి మద్రాసు రేడియో కేంద్రంలో లలిత గీతాల గాయకుడి అవకాశాన్ని ఇప్పించారు. ఇలా పాటలు పాడుతూ మరోవైపు సినిమాల్లో చిన్నచిన్న వేషాలు వేసేవారు. మరోవైపు బృందగానాలు చేస్తూ నెమ్మదిగా సినీరంగ ప్రముఖుల గుర్తింపుపొందారు. ఘంటసాల చేత తరచు పాటలు పాడించుకొని అస్వాదించే చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిలు తమ సినిమా స్వర్గసీమలో మొదటిసారి నేపథ్య గాయకుడి అవకాశాన్ని ఇచ్చారు. భానుమతి పక్కన భయపడుతూ ఘంటసాల పాడుతుంటే భానుమతి, నాగయ్యలు ధైర్యం చెప్పేవారు. ఆ పాటకు ఆయనకు 116 రూపాయల పారితోషికం లభించింది. తర్వాత భానుమతి, రామకృష్ణలు తీసిన 'రత్నమాల' చిత్రానికి సహాయ సంగీత దర్శకుడిగా చేసే అవకాశం వచ్చింది. తర్వాత బాలరాజు, మనదేశం వంటి హిట్ చిత్రాలకు కూడా సంగీత దర్శకత్వం వహించారు.

1951లో పాతాళభైరవి విజయంతో ఘంటసాల పేరు ఆంధ్రదేశమంతా మారుమోగింది. అప్పుడే మద్రాసులో ఇల్లు కొనుక్కొని తన కుటుంబాన్ని తీసుకువచ్చారు. తరువాత విడుదలైన 'మల్లీశ్వరి' చిత్రంలోని పాటలు అత్యంత ప్రజాదరణ పొందడానికి సాలూరి రాజేశ్వరరావు సంగీతానికి ఘంటసాల గాత్రం తోడవడమే. 1953లో వచ్చిన 'దేవదాసు' ఘంటసాల సినీజీవితంలో కలికితురాయిగా నిలిచిపోయింది. ఆ చిత్రంలో తన నటనకంటే ఘంటసాల గాత్రమే తనకు ఇష్టమని అక్కినేని నాగేశ్వరరావు చెబుతుండేవారు. 1955లో విడుదలైన 'అనార్కలి' చిత్రం మరింత గొప్పపేరు తెచ్చింది. 1957లో విడుదలైన 'మాయాబజార్' సినిమా పాటలు తెలుగు సినీచరిత్రలో అగ్రతాంబూలం అందుకున్నాయి. 1960లో విడుదలైన 'శ్రీ వెంకటేశ్వర మహత్యం' సినిమాలోని 'శేషశైలావాస శ్రీ వేంకటేశా...' పాటను తెరపైన కూడా ఘంటసాల పాడగా చిత్రీకరించారు. ఎటువంటి పాటైనా ఘంటసాల మాత్రమే పాడగలడు అన్నఖ్యాతి తెచ్చుకొన్నాడు. 1970 వరకు దాదాపు ప్రతిపాట ఘంటసాల పాడినదే. ఏనోట విన్నా అతను పాడిన పాటలే. గాయకుడిగా ఎన్నో అమూల్యమైన పాటలను పాడి అజరామరం చేసిన ఘంటసాల సంగీత దర్శకుడిగా కూడా తన ప్రతిభను ఎంతగానో చాటుకున్నారు. జనరంజకమై పాటలను స్వరపరచి శ్రోతలను మైమరపించారు. శాస్త్రీయ సంగీతంలో అపారమైన ప్రతిభ ఉన్నా కూడా ఆ పాండిత్యాన్ని తన పాటలలో ఎప్పుడూ చొప్పించ లేదు. ప్రజలు ఏం కోరుకుంటారో అలాంటి సంగీతాన్నే అందించి ఆలరించారు ఘంటసాల.

స్వయంగా గాయకుడే సంగీతాన్ని కూడా అందిస్తే ఆ పాట సరికొత్త అందాన్ని సంతరించుకుంటుందనేది నిజం. షావుకారు, పాతాళభైరవి, చిరంజీవులు, లవకుశ, రహస్యం, పాండవ వనవాసం వంటి ఎన్నో చిత్రాలను ఆణిముత్యాలుగా నిలిచి పోయాయి అంటే ఆ ఘనత ఘంటసాలగారి సంగీత దర్శకత్వ ప్రతిభే అంటే అతిశయోక్తి కాదు.

వందకు పైగా ఘంటసాల సంగీత దర్శకత్వం నెరపిన చిత్రాలలో చాలా పాటలు విపరీతమైన ప్రజాదరణను పొందడం విశేషం. పదేపదే ఆ పాటలను ప్రేక్షకులు పాడుకోగలిగేలా చేయడం సంగీత దర్శకుడిగా ఘంటసాల ఘనవిజయంగానే చెప్పుకోవాలి.

'షావుకారు' చిత్రంలోని 'కాదు సుమా కల కాదు సుమా' పాట ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. అలాగే 'కీలుగుర్రం'లోని 'ఎంత కృపామతివే' అన్న పాటకూడా సుమధురంగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. విజయా వారి 'పాతాళభైరవి' చిత్రానికి వన్నె తరగని అద్భుతమైన సంగీతాన్ని అందించారు ఘంటసాల. "హేమండ్ ఆర్గాన్' అనే వాయిద్యాన్ని ఈ చిత్రంలో ప్రవేశపెట్టారు ఘంటసాల. ప్రముఖ హిందుస్తానీ సంగీత విద్యాంసులు ఉస్తాద్ బడే గులాం అలీఖాన్ మద్రాసుకు వచ్చినప్పుడు ఆయనకు తన ఇంట్లో ఆతిథ్యం ఇచ్చి ఖాన్ వద్ద హిందుస్తానీ రాగాలలో చేసుకున్న ఆకళింపు మనకు 'పాతారభైరవి' పాటల్లో స్పష్టంగా వినిపిస్తుంది.

"ఇంట ఇంటనూ ఎవ్వరి కంఠం వింటారో ఆ ఘంటసాల వారే ఈ చిత్రానికి నాదబ్రహ్మలండి!" అంటూ పింగళి వారు రాసిన ఈ మాటలే 'పెళ్ళిచేసి చూడు' చిత్రంలో టైటిల్స్‌లో రావడం ఆ రోజుల్లో ఘంటసాలగారి సంగీతానికి ప్రేక్షకులలో ఉన్న గొప్ప ఆదరణకు నిదర్శనం! ఈ చిత్రంలో 'ఏడు కొండలవాడా

వెంకటారమణా' అనే పాటను చక్రవాక రాగంలో సమకూర్చి అపురూపమైన గీతంగా మలిచారు ఘంటసాల.

"కన్యాశుల్కం" నాటకం అంటేనే గిరీశం పాత్ర మన కనుల ముందు తళుక్కు మంటుంది. ఆ పాత్ర స్వభావానికి తగ్గట్టుగా ఘంటసాల గారు స్వరపరచి అలవోకగా పాడిన పాట 'చిటారు కొమ్మను మిఠాయిపొట్లం చేతికందేరా గురుడా!".

"మాయాబజార్" చిత్రంతో ఘంటసాలగారి పేరు మరింతగా మారుమ్రోగిపోయింది. ముందుగా సంగీతదర్శకుడిగా రాజేశ్వర రావుగారిని అనుకున్నా కారణాంతరాల ద్వారా తనకు దక్కిన ఆ అవకాశాన్ని స్వరమయం చేసారు ఘంటసాలగారు. "అహ నా పెళ్ళియంటా!, భళి భళి భళి దేవా, వివాహ భోజనంబు" పాటలతో ప్రేక్షకులకు వీనుల విందును అందించారు ఘంటసాల. ఈ చిత్రంలో వినిపించే నేపథ్య సంగీతం కూడా అంతర్వాహినిగా సాగుతూ ప్రేక్షకులను ఈనాటికీ అలరిస్తూ ఉంది.

క్లిష్ట హిందుస్తానీ రాగాలతో అతి లలితమైన పాటలను రూపొందించడం ఘంటసాల గారి మరో విశిష్టత. అది మనకు 'రహస్యం' చిత్రంలోని పాటల్లో స్పష్టంగా వినిపిస్తుంది. తాను సంగీత దర్శకత్వం చేసిన చిత్రాలలో అన్నిటికంటే ఇష్టమైన చిత్రం 'రహస్యం' అని ఘంటసాల చెప్పేవారు.

సంగీత దర్శకుడిగా ఘంటసాలగారి ప్రస్థానంలో మరో అతిపెద్ద మైలురాయి 'లవకుశ' యావదాంధ్ర ప్రేక్షకులనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా మారుమ్రోగేలా ఆయన ఆ చిత్రంలో కూర్చిన పాటలు నభూతో నభవిష్యతి.

దేశ్ రాగంలో తియ్యని సుశీల కంఠంతో గుండమ్మకథ చిత్రం ద్వారా ఆయన అందించిన "అలిగిన వేళనే చూడాలి" పాట అమోఘం. అలాగే రాగేశ్వరి రాగంలో "సారంగధర" చిత్రంలోని "అన్నా నా భామినీ" పాటను విన్నప్పుడు హిందుస్తానీ రాగాలను మాస్టారు ఎంత చక్కగా తెలుగులో తేలికైన రీతిలో మధురంగా అందించారా అనిపిస్తుంది.

ఒక చిత్ర నిర్మాత ఇళయరాజా గారిని 'మన చిత్రంలో ప్రతి పాటా సూపర్ హిట్ కావాలి' అని కోరాగా, దానికి ఇళయరాజా గారు ఒక్క నవ్వు నవ్వేసి, 'అది ఘంటాసాల గారికే సాధ్యం' అని అన్నారంటే సంగీత దర్శకుడిగా ఘంటసాలగారి ప్రతిభ ఎంత గొప్పదో మనకు అర్థం అవుతుంది.

ఏ చిత్ర సంగీత దర్శకుడూ స్పృశించని హిందుస్తానీ రాగం 'మధుకోన్స' రాగాన్ని తీసుకుని ఘంటసాల గారు స్వరపరచిన 'ఊహలు గుసగుసలాడే' పాట కానీ, భీంప్లాస్ రాగంలోని వైవిధ్యాన్ని కనపరచే బ్రతుకు తెరువు చిత్రంలోని 'అందమే ఆనందం' పాట కానీ, పహాడీ రాగంలో చేసిన 'మర్మయోగి' చిత్రంలోని 'నవ్వుల నదిలో పువ్వుల పడవా' పాట కానీ మేస్టారి అసాధారణ ప్రజ్ఞకు అందమైన మచ్చుతునకలుగా ఎప్పటికీ నిలిచిపోతాయి.

లలిత సంగీతానికి ఏమాత్రం పనికిరావనుకునే రంజనీ, భైరవి వంటి రాగాలను తీసుకుని కరుణశ్రీగారి పద్యాల్లో ఉపయోగించుకున్న విధానం, 'రహస్యం' చిత్రంలో సందర్భాను సారంగా 'సరస్వతి' 'లలితా' వంటి దేవతల పేర్లున్న రాగాలను వాడుకున్న తీరు ఘంటసాల గారికే చెల్లు అని నిరూపిస్తాయి.

తెలుగువారి గుండెల్లో గాయకుడిగానే కాదు, సంగీత దర్శకుడిగా కూడా చెరగని స్వరముద్ర వేసుకున్న ఘనుడు మన ఘంటసాల

* * *

అద్దంలో నా ముఖం

కవిత

అద్దంలో
నా ముఖం
నాకు వికృతంగా కనిపిస్తుంది.
కొండొకచో మాయమైపోతుంది.

నిలువుటద్దం...
నిజాల్ని చెప్పేస్తుంది
ఇజాల్ని విప్పేస్తుంది.

అంధకారంలో
వెలుగును చూపిస్తుంది.
ఒంటరి బతుకులో..
తోడై బాధలు వింటుంది.

కళ్ళు మూసుకుంటే...
మన ప్రతిబింబం మనకు కనపడదూ!
పగలగొడితే...
పది బింబాలు కూడా అవుతాయి.

అద్దం...
పౌడర్ అద్దుకోవడానికే కాదు
మనల్ని మనం దిద్దుకోడానికి కూడా!

- బేతా రామసూర్య ప్రకాశరావు
94412 90321

నేను సైతం

- వాణిశ్రీ
93900 85292

డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ రాజేశ్వరి దంపతులకు పెళ్లయి ఏడేళ్లయినా పిల్లలు కలగలేదు. ఇద్దరూ టెస్టులు చేయించుకున్నారు. రాజేశ్వరిలో ప్రాబ్లం లేదు. రవిచంద్ర స్పెరమ్‌లో కౌంట్ తక్కువగా ఉంది అని రిపోర్టు వచ్చింది. కొంతకాలం మందులు వాడారు. స్పెరమ్ కౌంట్ పెరగలేదు.

ఐవీఎఫ్ ద్వారా గర్భం ధరించడానికి రాజేశ్వరి ఒప్పుకోలేదు.

"నాకు జీవితాంతం గిల్టీగా ఉంటుంది. ముక్కూ ముఖం తెలియని వాడి ద్వారా బిడ్డని కన్నాననే ఫీలింగ్ బాధిస్తుంటుంది" అన్నది.

"రవీ! రాజేశ్వరికి ఇష్టం లేనప్పుడు వదిలేయ్. అనాధాశ్రమం నుంచి ఒక పిల్లవాడిని తెచ్చుకుని పెంచుకుందాం. అనాధాశ్రమాల్లో ఆలనాపాలనా చూసేవాళ్లు లేక పిల్లలు అలమటిస్తుంటారు. అక్కడ స్టేట్ హోమ్స్‌లో పిల్లలకి తిండి, బట్టలకు లోటుండదు. కానీ వారిని ఆప్యాయంగా చూసేవాళ్లుండరు. ఆ పిల్లలు ప్రేమరాహిత్యంతో బాధపడుతుంటారు. అటువంటి పిల్లల్లో హింసా

కథ

ప్రవృత్తి కూడా వుంటుంది. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే చాలా సమస్యలకు మూలకారణం ప్రేమరాహిత్యం" అన్నది శ్రీవల్లి.

డాక్టర్ రవిచంద్ర తల్లి డాక్టర్‌గా పనిచేసి రిటైరైంది. రాజేశ్వరికి అత్తగారి ఆలోచన సంతోషం కలిగించింది.

"అలాగే చేద్దాం అమ్మా!" అన్నాడు రవిచంద్ర.

"నేను హైదరాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు డాక్టర్ ఫాతిమా నా క్లోజ్ ఫ్రెండ్. ఆమె బ్యాచిలర్. జీవితమంతా సేవలకే వినియోగిస్తుంది. డాక్టర్‌గా హాస్పిటల్లో పనిచేస్తూనే, అనాథాశ్రమం మెయింటైన్ చేస్తుంది. కొందరు తల్లులు బిడ్డల్ని కని హాస్పిటల్లో వదిలేసి పోతుంటారు. అటువంటి అనాథ పిల్లల్ని అక్కున చేర్చుకుంటుంది. ఆడపిల్లలకి ఏ మతానికి చెందని పేర్లు పుష్ప, జయ, విజయ, సంఘవి...ఇలా పెడుతుంది. మగపిల్లలకు వినోద్, విక్రమ్, చైతన్య...అని పేరు పెట్టి పెంచుతుంది. నేను ఫాతిమాకు ఫోన్ చేస్తాను. మీరు వెళ్లి ఒక మగ పిల్లవాడిని తెచ్చిపెంచుకోండి" అన్నది శ్రీవల్లి.

ఇద్దరూ మద్రాస్ జనరల్ హాస్పిటల్లో డాక్టర్స్‌గా పనిచేస్తున్నారు. వారం రోజులు సెలవు పెట్టి హైద్రాబాద్ వెళ్లడానికి ప్రోగ్రామ్ ఫిక్స్ చేసుకున్నారు.

ఇక రేపు హైదరాబాద్ వెళ్తారనగా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఇద్దర్నీ పిలిచి చెప్పాడు.

"సారీ డాక్టర్, మీ లీవ్ కేన్సిల్ అయింది. మీకు తెలిసిందే. కేరళలోని వయనాడ్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి వరదల్లో ఊళ్లకు ఊళ్లు కొట్టుకుపోయాయి. వందల సంఖ్యలో జనం చనిపోయారు. రెస్క్యూ హోమ్స్‌లో గాయాలపాలైన వారు, జ్వరాలతో బాధపడుతున్నవారు వేలల్లో ఉన్నారు. గ్రూప్ ఆఫ్ డాక్టర్స్‌ని పంపమని కేరళ గవర్నమెంట్ మన తమిళనాడు గవర్నమెంట్‌ని రిక్వెస్ట్ చేసింది. మెడికల్ ఎమర్జెన్సీ డాక్టర్స్ లీవులన్నీ కేన్సిల్ అయ్యాయి. మీరు కూడా వయనాడ్ వెళ్లాలి మన డాక్టర్స్ బృందంతో."

"ఓకే సార్, హ్యూమానిటేరియన్ గ్రౌండ్స్‌లో మేమూ వెళ్లి రెస్క్యూ హోమ్స్‌లో పేషెంట్లకు ట్రీట్‌మెంట్ ఇస్తాము" అని ఒప్పుకున్నారు రవిచంద్ర, రాజేశ్వరి.

మర్నాడే డాక్టర్స్ బృందంతో కలిసి వయనాడ్ వెళ్లారు రవిచంద్ర, రాజేశ్వరి.

– – –

వయనాడ్ వెళ్లిన రవిచంద్ర, రాజేశ్వరి రెస్క్యూహోమ్స్‌లో పేషెంట్లకు ట్రీట్ చేస్తూ దాదాపు నెలరోజులు ఉన్నారు. ఎందరో భార్యలను పోగొట్టుకున్న భర్తలు, భర్తలను పోగొట్టుకున్న భార్యలు, తల్లిదండ్రులను పోగొట్టుకుని అనాథలయిన పిల్లల్ని చూసి చలించిపోయారు. ప్రకృతి సృష్టించిన వయనాడ్ బీభత్సం మాటల్లో వర్ణించలేని విలయతాండవం.

వయనాడ్‌లో డ్యూటీ ముగిసిన తర్వాత బయల్దేరుతూ తల్లికి కాల్ చేశాడు రవిచంద్ర.

"అమ్మా! మేము ఈరోజు బయల్దేరుతున్నాం. రేపు ఇంటికి వస్తున్నాం. నీకు ఒక సర్‌ప్రైజ్ గిఫ్ట్ తెస్తున్నాం" అన్నాడు.

"నాకు గిఫ్ట్ తెస్తున్నారా? ఏంట్రా అది" అడిగింది శ్రీవల్లి.

"సర్‌ప్రైజ్..." అని నవ్వాడు రవిచంద్ర.

"ఓ.కే రా. ఆ గిఫ్ట్ కోసం ఎదురు చూస్తుంటాను" అన్నది శ్రీవల్లి నవ్వుతూ.

మర్నాడు ఉదయం ఇంటిముందు కారు ఆగగానే ఎదురొచ్చింది శ్రీవల్లి కొడుకు, కోడలు తనకు తెచ్చిన గిఫ్ట్‌ను చూడాలనే ఆతృతతో.

రాజేశ్వరి చేతుల్లో ముద్దులు మూటకడుతున్న నెలల పాప. గులాబీ రంగు గౌనులో, పెద్ద పెద్ద కళ్లతో శ్రీవల్లి వైపు చూస్తూ, బోసి నోటితో చిరునవ్వులు చిందిస్తోంది.

"అమ్మా! ఈ పాప తల్లిదండ్రులు వయనాడ్ వరదల్లో చనిపోయారు. అదృష్టవశాత్తు ఉయ్యాలలో ఎత్తుగా పడుకుని ఉండడం వలన బతికింది. ఇలా చాలామంది పిల్లలు తల్లిదండ్రుల్ని పోగొట్టుకుని అనాథలయ్యారు. మాకు ఈ పాప నచ్చింది. దీనికి జయ అని పేరు పెట్టాం" అన్నాడు రవిచంద్ర.

"మన దివంగత సీఎం జయలలిత పేరు పెట్టావన్నమాట" అన్నది శ్రీవల్లి.

"ఔననుకో. జయ పేరుకి అర్థం వుంది. తనను తాను జయించిన వారు జయ, ఇతరుల్ని జయించినప్పుడు విజయ" అన్నాడు రవిచంద్ర.

బాగుందిరా! మంచి పనిచేశారు. మీరింకా ఒక మగపిల్లవాడిని తెచ్చుకోవాల్సింది" అన్నది శ్రీవల్లి.

తాము ఆడపిల్లని తెచ్చుకోవడానికి కారణం చెప్పింది రాజేశ్వరి.

"అత్తా! స్టేట్ హోమ్స్‌లో మగపిల్లలు ఎట్లాగో బతుకుతారు. ఆడపిల్లల పరిస్థితే దుర్భరంగా ఉంటుంది. కంచె చేను మేసినట్లు ప్రేమగా పెంచవలసిన హోమ్స్‌లోని స్టాఫ్ కొందరు దిక్కులేని పసిమొగ్గలైన ఆడపిల్లల్ని చిదిమేస్తుంటారు. అత్యాచారాలు చేసి అమానుషంగా ప్రవర్తిస్తుంటారు. ఆడపిల్లలకు భద్రత లేదు. నేను అందర్నీ కాపాడలేను. కనీసం ఒక ఆడపిల్లనైనా రక్షించి మంచి భవిష్యత్తును ఇవ్వాలనుకున్నాను. అందుకే ఆడపిల్లను తెచ్చుకున్నాం."

"రాజేశ్వరీ నువ్వు సరిగానే ఆలోచించావు. మంచి నిర్ణయం తీసుకున్నావు" అంటూ కోడల్ని అభినందించింది శ్రీవల్లి.

* * *

టచ్ ఫోన్ తికమకలు

- వాడపల్లి పూర్ణకామేశ్వరి, 80560 24790

అమెరికా నుండి రానున్న మనవడి కోసం వంటా వార్పులతో కుస్తీ పడుతున్నారు తాతాబామ్మలు.

"గోంగూర్లోకి కమ్మటి మీగడ పెరుగేస్తే, వేడి చేయకుండా ఉంటుంది" పరంధామయ్య సలహా ఇస్తుండగానే ఫోను మోగింది.

"హలో... హలో!! ఏమీ వినిపించట్లేదే" తెల్లమొహం వేస్తూ అన్నాడు. ఇంకా చేసినవారు ఉన్నట్టే తెలుస్తోంది.

"హలో....." ఈసారి ఏకంగా వీధి చివరి వరకూ వినిపించేలా మరింత గట్టిగా అరిచాడు. సహజంగా అతి నెమ్మదిగా మాట్లాడే పరంధామయ్య గట్టిగా గొంతుచించుకు అరిస్తే కానీ ఆవతలి వారికి వినిపించదన్న నమ్మకంతో గావుకేక పెడుతున్నాడు.

"అందుకే చెప్పాను, బటన్లు నొక్కుకునే ఈ డొక్కుఫోను వదిలేసి అందరూ వాడుకుంటున్న ఆ టచ్ ఫోను కొనండి అని! నా మాట వింటేనా!?" అవకాశం దొరికినప్పుడల్లా దెప్పుతూ విసిరే అస్త్రాన్ని విసురుతూ కాఫీ గ్లాసుని ఠప్పుమని బల్లమీద పెట్టింది పార్వతమ్మ.

అంతలోనే ఆరా తీసింది "ఇంతకీ విమానాశ్రయంలో దిగాడా? లేదా?"

"ఆ... దిగాడు. అయినా నీ పేరాశే కానీ కుర్రకారు వాడే ఫోను మనకెందుకూ? అందులోవన్నీ మనకేమైనా తెలుస్తాయా? పెడతాయా చెప్పు? ఆ మాత్రం మాట్లాడుకోవడానికి మనకీ ఫోనుంది నిక్షేపంగా!" పార్వతికి నచ్చదని తెలిసినా అదే తర్కాన్ని మళ్ళీ చెప్పే ప్రయత్నం చేసాడు.

భర్త చెప్పే లాజిక్కుతో ఒక్కనాటికీ ఒప్పుకోకపోయినా, ఆయన్నొప్పించి స్మార్టు ఫోను కొనిపించడం మాత్రం తన తరం కాలేదు. అంచేత అక్కసుతో అప్పుడప్పుడూ ఆ ఫోనాభిరామాయణాన్ని వల్లిస్తూ, చెప్పుళ్ళస్త్రాలతో కస్సుబుస్సు మంటూ సరిపెట్టుకుంటోంది.

– – –

"ఆవపెట్టి పనసపొట్టు కూర చేస్తే బామ్మ చెయ్యాలి! కమ్మటి మీగడ పెరుగూ, గోంగూర తిని ఎన్నాళ్ళైందో?" సుష్టుగా భోంచేసి బామ్మ భోజనాన్ని మెచ్చుకుంటూ అన్నాడు సుమంత్. సావకాశంగా కబుర్లు చెపుతూ పెట్టెలోంచి తాతాబామ్మలకు తెచ్చిన వస్తువులను తీసాడు.

"తాతగారూ ఇది మీకు!" అంటూ టీ షర్టులు, మాత్రలు వేసుకునేందుకు చిన్నచిన్న

కథ

అరలున్న డబ్బా, మోకాలు నొప్పికి మందూ తీసి ఇచ్చేసరికి పరంధామయ్య పొంగిపోయి మొహం చాటంతైంది.

"బామ్మా, ఇది నీకు!" బామ్మ చేతికిస్తూ అన్నాడు సుమంత్. మెరుపు కాగితంతో చుట్టి ఉండడంతో అదేంటో అంతుచిక్కలేదు పార్వతమ్మకు.

"తెరిచి చూడు బామ్మా, తినబోతూ రుచెందుకూ?"

ఎన్నాళ్ళగానో ఎదురు చూస్తున్న స్మార్ట్ ఫోను చూసి పార్వతమ్మ కళ్ళు వెయ్యి దీపపు కాంతులతో మెరిసాయి.

కుర్రకారంతా ఎడాపెడా వాడేస్తున్న టచ్ ఫోనుపై మనసున్నా బటను ఫోనుతో సరిపెట్టుకోక తప్పలేదిన్నాళ్ళూ. భర్త వైపు గర్వంగా చూసింది.

"మనవడి దగ్గర్నుంచి ఫోను సాధించింది కనుక నన్ను దెప్పుళ్ళతో సాధించడం తగ్గుతుంది" మనసులోనే అనుకున్నాడు పరంధామయ్య.

"రోజస్తమానూ తోచట్లేదు, బొమ్మలు కనిపించే ఫోనుంటే బావుణ్ణనుకున్నావుగా బామ్మా. అందుకే ఇది! ఆ పాత ఫోను మాట్లాడుకోవడానికి వాడండి. ఇందులో కొత్త సిమ్ వేసి వాట్సాపు అవి పెట్టి ఇస్తాను. యూట్యూబులో ప్రవచనాలు వినొచ్చు, వీడియోలు చూడొచ్చు. అలాగే వాట్సాపులో కావలసిన వాళ్ళందరి తోనూ మాట్లాడు కోవచ్చు!" మెరుపుతోపాటు బామ్మ కళ్ళల్లో చెమ్మనీ చూస్తున్న సుమంత్ అన్నాడు.

– – –

"బామ్మా, తాతయ్య తరపు చుట్టాల సమూహంలోనూ, మీ తరపువాళ్ళున్న సమూహంలోనూ నిన్ను చేర్చాను. ఇదిగో ఇలా చూసుకోవాలి. మెసేజి వ్రాయడం రాకపోతే ఇలా ఈ మైకుబొమ్మను నొక్కుతూ నీ మాటని రికార్డు చేసి వాయిస్ మెసేజీగా పెట్టొచ్చు" ఒక్కొక్కటీ వివరిస్తూ స్మార్ట్ ఫోను సరాగాలకు రంగం సిద్ధం చేసాడు సుమంత్.

ఏళ్ళ కల ఒక్కసారిగా సాకారమవ్వడంతో పార్వతమ్మలో కొత్త ఉత్సాహం ఉరకలు వేసింది.

"బామ్మా ఇది టచ్ ఫోన్! ఆ ఫోనులా గట్టిగా నొక్కనవసరం లేదు. ఇలా నాజుగ్గా వేలితో తడిమితేనే చాలు!" టచ్ ఫోను హొయలను చెప్పాడు.

"పాతకాలపు మెట్రిక్కే చదివినా, నాటి ప్రధాని ఇందిరాగాంధీగారికి సెక్రెట్రీ స్థానంలో ఉండతగ్గ తెలివితేట లున్నాయమ్మా నీకు!! పల్లెటూళ్ళో ఉండిపోవడం వల్ల కానీ, లేకపోతే ఈ పాటికి...!" అస్తమానూ అబ్బాయనే మాటల్ని గుర్తు చేసుకుంది. రంగంలోకి దిగింది.

"నా తెలివికి పదునుపెట్టే అవసరం ఇప్పుడొచ్చింది!" చిరుగర్వంతో నిద్రాహారాలు మాని మరీ టచ్ ఫోనులో తలమునకలయ్యింది.

– – –

'ఇది విన్నావుటే. మనమంతా ఈ ఉమ్మడి సమూహంలో సఖ్యంగా లేమూ? ఆ టక్కులాడుంది చూసావూ, అదే పెద్దొదిన! తోటికోడళ్ళందరినీ పోగుచేసి మరో సమూహాన్ని తయారుచేసిందిట. దానికి ఆవిడగారే పెత్తనదారీట. అది అడ్మినుట! ఇదిగో ఇక్కడ్నుంచీ అంతా మూకుమ్మడిగా వెళ్ళిపోయారు" చీరెత్తి చిందులు తొక్కుతున్న మంగతాయారు మాటధాటితో ఉదయం తెల్లవారింది.

"అదేవిటి మంగా, మొన్ననేగా సుబ్బిగాడింట్లో పెళ్ళిలో కొత్తగా కొనుక్కున్న కాసుల పేరుని చూపిస్తూ నీతో ఎంచక్కా మాట్లాడింది! ఇంతలో ఏమొచ్చింది?" సంక్షోభం వచ్చినప్పుడు సమూహాల్లో నిశ్శబ్దాన్ని పాటిస్తారని తెలియక కొత్తగా నేర్చిన వాయిస్ మెసేజ్ విద్యతో మంగతాయారన్న మాటకు బదులిచ్చింది పార్వతమ్మ. పెద్దొదిన కూర్చిన కొత్త సమూహంలోకి చల్లగా చేరింది ఆ వాయిస్ మెసేజ్. కురుక్షేత్రం రాజుకుంది.

అంతే వెంటనే ఆ సమూహంలోకి చేర్చేసారని, తను అన్న మాట రెండుచోట్లకూ చేరిందని తెలియలేదు. వరదల్లా వచ్చేస్తున్న ప్రశ్నలకు ఆశ్చర్యానుమానాలకి ఏం చెప్పాలో పాల్పోలేదు పార్వతమ్మకు.

"ఏదో కొత్తగా వచ్చిన టచ్ ఫోనుతో అందరితోనూ టచ్‌లో ఉందామనుకుంటే, ఇదెక్కడి గొడవా!?" అనుకుంది.

"వదినగారూ, మీరు ఈ వైపో... ఆ వైపో తేల్చాలండీ! గోపిలా రెండు సమూహాల్లోనూ ఉంటే కుదరదు సుమండీ!" పెద్దొదిన కూర్చి, నేడే తనను చేర్చిన ఈ కోడళ్ళ సమూహంలోంచి పెద్ద హెచ్చరిక వచ్చింది! గోపి ఏంటి చెప్మా అనుకుంది. గోడమీద పిల్లి అని అర్థమవ్వడానికి కాసేపు పట్టింది.

"అమ్మో! సరదాగా అందరూ మాట్లాడుకుంటారేమో ననుకుంటే సమూహాల్లో ఇంతలేసి సమస్యలా? ఇప్పుడేంచేయాలో! అసలెన్ని సమూహాల్లో ఉన్నానో కూడా తెలియదే! ఇప్పుడు వీటిలోంచి బయటకు రావడం ఎలాగో చెప్మా! ఎరక్కపోయొచ్చి ఇరుక్కోవడమంటే ఇదే కాబోలు" అనుకుంటోంది పార్వతమ్మ.

కత్తివాటుకి నెత్తుటి చుక్కలేనట్టుగా తయారైన భార్య ముఖారవిందాన్ని చూస్తూ "ఏమైయ్యింది?" అడిగాడు పరంధామయ్య. ఆయన కదిలిస్తే కానీ ఇంకా పొయ్యి కూడా వెలిగించలేదన్న సంగతి జ్ఞాపకం రాలేదు పార్వతమ్మకు.

"వాట్సాపు వ్యాపకంలో పడి ఆత్మారాముడి సంగతే మరిచాను! ఆయనకు నీసరమొచ్చి అన్నమో రామచంద్ర అనేలోపు వంట పూర్తి చేసెయ్యాలి" అనుకుంటూ హడావుడి పడింది. నాలుగు మెతుకులు ఉడకేసి భోజన ప్రహసనం అయ్యిందనిపించింది ఆవేల్టకి.

ఊరుకున్నంత ఉత్తమం, బోడిగుండంత సుఖం లేదన్నట్టు ఆ పూటకు ఫోనుజోలికి వెళ్ళలేదు.

తాగుబోతు వాడి కాళ్ళు సారాకొట్టుకే దారితీసినట్టు,

స్మార్టుఫోను వాడుతున్న ప్రతీ ఒక్కరూ కళ్ళు తెరుస్తూనే దాన్ని చేతికందుకోవడమే అనవాయితీ కనుక ఆ పట్టు ఒక్క రోజుతో తీరుపోయింది. స్మార్టుఫోను వాడుతూ కళ్ళు తెరిచేసరికి వాట్సాపోఖ్యానంతోనే దినచర్య ప్రారంభించాలన్న సిద్ధాంతాన్ని అవలంబిస్తూ మళ్ళీ రంగంలోకి దిగింది. పార్వతమ్మ.

"ఈ స్మార్ట్ ఫోను చేతికొచ్చినప్పటి నుండి మరో ధ్యాస లేకుండా పోయిందే! చంటి పిల్లాడికి డైపర్ తొడిగిన దగ్గర్నుండి, తడిసిందేమోనని అస్తమానూ చూసే తల్లి వ్యవహారంలా ఉంది నా పని!" మెసేజీలకోసం చూస్తూ మనసులో అనుకుందే కానీ మగనితో అనే ధైర్యం చాల్లేదు.

"హమ్మో!! రెండు వందల మెసేజీలే!" గుండె జారినంత పనైంది. వెంటనే మంగతాయారుకు ఫోను చేసింది.

"ఇప్పుడే పెద్దొదినతో మాట్లాడానక్కా, రేపు తన పుట్టినరోజు పండుగ, భోజనానికి రమ్మని ఒకటే గొడవ" అంది. తాయారు మాటలకు కళ్ళు తిరిగినంత పనైయ్యింది పార్వతమ్మకు.

"మరి ఈ రెండు వందల మెసెజీల్లో యుద్ధం ఏంటీ" బతుకు జీవుడా అని ఫోను మూసేసింది. టింగుమన్న మెసేజీ శబ్దంతో మళ్ళీ తీయక తప్పలేదు.

– – –

"పారూ, ఫేస్బుక్కులోనూ, ఇన్స్టాలోనూ నీ కోసం వెతికి వెతికి అలసిపోయాననుకో! మీ ఆడపడుచు పుణ్యమా అని ఇప్పటికి దొరికింది. ఆవిడ నా ముఖపుస్తకం నేస్తం. మన హైస్కూల్ సమూహంలో నిన్ను చేరుస్తున్నాను!" అంటూ పద్మావతి మెసేజి.

"ఈ పద్మావతి ఎప్పుడూ మూతి ముడుచుకుని ఎవ్వరితోనూ మాట్లాడేది కాదే! ఇప్పుడింత హుషారుగా ఉందేంటి చెప్మా! పోలిక మారలేదు కాబట్టి జుట్టు నెరిసినా గుర్తు పట్టగలిగానుకానీ, ఇప్పుడెంత సోగ్గా ఉందో!" అనుకుంది పార్వతమ్మ. ఈ సాంకేతికతతో పోటీ పడలేక ఇంకా తానే వెనకబడిపోయానని కించిత్తు బాధ మాత్రం తప్పట్లేదు పార్వతమ్మకు.

"టచ్ ఫోను పుణ్యమా అనీ, రోజులో ఇరవైనాలుగు గంటలూ చాలట్లేదు. కానీ, నేర్చుకోవలసినవి చాలానే ఉన్నాయి. రోజుకో కొత్త సమూహం పుట్టడం, ఎవరి దగ్గర్నుండి ఏమొచ్చిందో తెలియక తికమకపడడం, ఎవరేమంటున్నా బోధపడకపోవడంతో కాలం గడిచిపోతోంది. నిత్య శుభోదయాలతో ఫోను బుర్ర నిండిపోతోంది. అవి తొలగించడానికి రోజుకు మరో గంట! జీతభత్యాలు లేని ఈ ఉద్యోగంతో చలిజ్వరం వచ్చినంత పనవుతోంది!"

"అలా పట్టనట్టు ఉండకపోతే మీరూ కాస్త చూసి నేర్చుకోవచ్చుగా!" విరుచుకు పడింది పార్వతమ్మ.

"మునుపైతే పదోగంటకల్లా ఎంగిలిపడి కాసేపు విశ్రాంతి తీసుకునేవాణ్ణి. తెల్లవారుతూనే ఈ వెర్రి పెట్టెతో మొదలెట్టి దాన్ని పాముతూ వంటింట్లోకెళ్ళేసరికి పదోగంట కొడుతోంది! ఆ తరువాత కడుపులో ఎలుకల పరుగులు!! క్షణం తీరుబడి లేదు, దమ్మిడీ ఆదాయం లేదంటే ఇదేను" అనుకున్నాడు భార్యావిధేయుడై లెంప లేసుకుంటూ సెల్లాభ్యాసానికి సిద్ధపడ్డాడు. వీర సైనికుడిలా తొలి పరీక్షలో నెగ్గాడు కూడా. మందుమాకూ తెచ్చుకోవడానికో, ఆసుపత్రికి వెళ్ళాలంటే మునుపైతే ఎవరి మీదో ఆధారపడి ఆటోను పురమాయించుకోవలసి వచ్చేది. ఇప్పుడు వోలా, ఊబరులో ఆటోని పిలిపించుకోవడాన్ని నేర్చేసి నెగ్గిన పరీక్ష అది!!

"ఏమో అనుకున్నాను కానీ, స్మార్టుఫోను వాడడం అంత సులువేం కాదు. పదో తరగతి బోర్డు పరీక్షలకు చదివిన దానికంటే కఠినంగానే ఉంది! కోరి కష్టాలు కొని తెచ్చుకోవడమంటే ఇదే కాబోలు" పైకంటే పతిదేవునితో చీవాట్లు తినవలసి వస్తుందని ఆ మాటను మనసులోనే నొక్కేసుకున్నా తనకంటే ఓ అడుగు ముందే అన్నీ నేర్చుకుంటున్న భర్తను పొగిడేసుకుంది.

"మీ చాదస్తం కానీ, ఉరికే కంగారు పడిపోక ఇదిగో ఈ వాట్సాపు గురించి కూడా కాస్త తెలుసుకోండి. ఆటో బుకింగు నేర్చుకున్నవారికి ఇదో లెక్కా?" అంటూ ఎగతోసింది.

"మీ బడి తాలూకు సమూహాల్లో రోజు బోలెడు చర్చలు జరుగుతున్నాయి పారూ" ఫోనుని మీటుతూ అన్నాడు పరంధామయ్య.

"అదేనండి లబ్దప్రతిష్ఠుల సమూహమేమో, రాజకీయాల నుండి రామాయణం వరకూ అన్నీ చర్చిస్తారనుకోండి! అందులో పాల్గొంటే మనకు బోలెడు విషయాలు తెలియడమే కాక, పన్లోపని ఈ ఫోను వాడుక కూడా అటవాటైపోతుందనుకోండి. మీకైతే అది మరీ సులువు!" ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు వీరతిలకం దిద్ది సైనికుణ్ణి యుద్ధభూమి లోకి పంపుతున్న వీరపత్నిలా పరంధామయ్యను ముందుకు తోసింది పార్వతమ్మ.

స్మార్ట్ ఫోను సరిగమలు అలా కొన్నాళ్ళు సాఫీగానే సాగాయి.

– – –

"పార్వతమ్మగారూ, చట్ట విరోధకమైన చర్చలలో పాల్గొని మత విద్వేషాలను రేకెత్తిస్తూ సమాజాన్ని తప్పుతోవ పట్టిస్తున్నారని మీపై అభియోగం. చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయి" పోలీసు దుస్తుల్లో యమభటుడిలా కనిపిస్తున్న వ్యక్తి అన్నాడు. ఆ మాటకు మూర్ఛొచ్చినంత పనైంది పార్వతమ్మకు.

"అదేంటండి, మేమేం చేసాము?" మళయాళం సినిమాను చూస్తున్నట్టుగా ఉన్నా గట్టిగానే నిలదీసాడు పరంధామయ్య.

"పెంటపాడు ప్రాథమిక పాఠశాల సమూహం పేరిట ఉన్న సమూహానికి మీరూ అడ్మిన్‌గా వ్యవహరిస్తున్నారు. అవునా? ప్రభుత్వ విరోధ చర్చలు ఈ సమూహంలో జరుగుతున్నాయి. అడ్మిన్‌గా మీరు దానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది" తేల్చాడు బుర్రమీసాల పోలీసు. స్టేషనుకి వచ్చి లిఖిత పూర్వకంగా సంజాయిషీని చెప్పుకోని పక్షంలో మీపై చర్య తీసుకోవలసి

వస్తుంది.

"అమ్మో, అమ్మో! నేనసలు ఏ ఉద్యోగమూ వెలగపెట్టలేదు! ఆయన రిటైరయ్యి పదిహేనేళ్ళు దాటింది. మాకే పదవులూ లేవండీ బాబూ! మొన్నే మా స్నేహితురాలు చేరుస్తానంటూ ఆ సమూహంలో చేర్చింది. అంతకు మించి మాకేం తెలియదు!" వాపోయింది పార్వతమ్మ.

"పేరుకు ఉన్నామన్న మాటే కానీ అక్కడేం మాట్లాడుకుంటారో మాకేం తెలుసు? టచ్ ఫోను గురించే తికమకగా ఉంటే, ఇక ప్రభుత్వ వ్యతిరేక చర్చలు మేమెక్కడ మాట్లాడగలమూ!" తెలివితేటలన్నీ రంగరించి చెప్పింది.

"ఫోనుంది కదా అని కనిపించిన సమూహంలో చేరితే వచ్చే చిక్కు ఇది! మరోసారి ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవలసిన బాధ్యత మీదే. ఇందులో సంతకం పెట్టండి" హెచ్చరింపుతో వదిలేసాడు. బ్రతుకు జీవుడా అనుకుంటుండగానే ఫోను మోగింది.

"బామ్మా, మా స్నేహితుడితో నీకు ట్యాబ్ పంపిస్తున్నాను. టచ్ ఫోను అలవాటైన నీకు ఇది మరింత బాగుంటుంది. అన్నీ పెద్దగా కనిపిస్తాయి!" ఉత్సాహంగా చెప్పాడు సుమంత్.

"తికమక పెడుతున్న టచ్ ఫోనుతోనే చస్తుంటే, మళ్ళీ ఇంకోటా?" నోళ్ళు వెళ్ళబెట్టారు పరంధామయ్య, పార్వతమ్మలు.

* * *

విషాద బాల్యం

కవిత

జీవితం గుండె మీద తెల్లవాడి బూటు
గుండుకు గుండె ఎదురొడ్డి సాధించిన స్వేచ్ఛబాట.
పొద్దు పొడిస్తే ఊహల ఊయల
పొద్దుగ్రుంకితే నిరాశ నిస్పృహల
సర్దుకుపోయే బుద్ధులు
వెనక్కి లాగే హద్దులు
సంసార రథానికి అమ్మానాన్నలు
పూటకూలి బ్రతుకులు
ఆకలి కేకలు అర్ధాకలితో వదిలే మెతుకులు
అతకని చొక్కా చిరుగులు
కలల వెంట పరుగులు.
నాయకుల భీషణ భాషణాలు
శ్రోతల కలలకి రంగులరంగుల భూషణాలు.
అమాత్యుల పంచవర్ణ దర్శనాలు
చిరుగుల మధ్య అంగాంగాలని దాచుకునే ప్రయత్నాలు.
వత్సరానికొకసారి వచ్చు సంబరాలు
చిరు ప్రాణానికి పోయు తులసి తీర్థాలు
అవే భాషణలు జనాలని పట్టించుకోని ఊరింపులు.
అమాయక ప్రజల కేరింతలు.
మాత్యుల కుర్చీ మోతలు
అధిక ధరలు, పన్నుల వాతలు
అర్ధాకలి కేకలు
చిమ్మచీకటిలో కనిపించని వెలుగు రేఖలు
ఆత్మహత్యా సద ృశం బాలకార్మీకం
మూడు రంగుల జండా మధ్యలో ధర్మచక్రం
రానికలలకి నిద్రపుచ్చు వ్యూహచక్రం
చేత జండా
అమ్మకానికో అండ..

- వి యస్ శాస్త్రి ఆకెళ్ళ, 70958 58667

ఆశల గడియారం

కవిత

వేకువ ఝామున లేపి..
సహజ వెలుతురు కోసం
ఎదురుచూడనీయక
కృత్రిమ వెలుగులలో
దారిని చూపిస్తూ.,
పరుగుల ప్రయాణానికి
శ్రీకారం చుడుతూ..
జీవన ప్రయాణానికి మాత్రం
ప్రయాసలు పెడుతుంది..
ఈ ఆశల గడియారం..
దీని నిండా క్షణాలు
నిండిపోయాయనంటే
అది పొరపాటే...
దాని నిండా ఆశలు నిండి
ఉన్నాయి..
అవి అరుదుగానే క్షణాలను
చూపిస్తాయి..
కానీ, అరుదైన క్షణాలను మాత్రం
జీవితానికి మిగల్చవు.

- బుగత యమున, 96522 49903

అభీష్ట సిద్ధికి.. నైతిక ధైర్యం.. తప్పనిసరి

- అట్టాడ హేమసుందర్, 63042 36289

824 కోట్ల ప్రపంచ జనాభాలో, 144 కోట్ల జన సంపత్తితో మనదేశానిది అగ్రస్థానం. 6500 భాషల్లో 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని కీర్తింపబడ్డ తేటతెలుగును మాట్లాడే ఆంధ్రులం మనం. దాదాపు 4200 మతాలున్నా మానవులంతా ఒక్కటేనన్న అభిమతమున్న హిందువులం. సంస్కృతి, సాంప్రదాయాలకు వారసులం. అమర వీరుల సమరయోధుల త్యాగాలతో స్వాతంత్ర ఫలాలను అనుభవిస్తున్నాం. 95 దేశాల పతాకాల నడుమ 'కాషాయం, తెలుపు, ఆకుపచ్చరంగు'లతో రెపరెపలాడే 'తిరంగ జెండా' మన దేశ ఔన్నత్యానికి చిహ్నం. అశోకుని ధర్మచక్రం మన ఆత్మ గౌరవానికి, సేవానిరతికి సాక్ష్యం. 'మేరా భారత్ మహాన్' అంటూ నినదిస్తూ అందరినీ కలుపుకుంటూ 'సర్వేజనా సుఖినోభవంతు' అన్న విశాల దృక్పథంతో మనం ముందుకు సాగు తున్నాం. భరత భూమి ఓ పెద్ద వ్యవసాయ క్షేత్రం వ్యవసాయమే మనకు ప్రధానం. అదే మన జీవన విధానం. అన్నదాతలు సృష్టించారు హరిత విప్లవం. మన మహిళా మణులు ప్రవహింప జేస్తున్నారు క్షీర సాగరం. తత్ఫలితంగా పాడీ పంటా రెండింటా మన దేశానిది ప్రథమ, ద్వితీయ స్థానాలు. అటవీ భూ విస్తీర్ణంలో మూడవ స్థానం. అది మన పర్యావరణ హితానికి సూచకం. సైనిక సంపత్తిలో మన దేశానిది నాల్గవ స్థానం. సిపాయి సోదరుల పోరాట పటిమ, త్యాగశీలత అనన్య సామాన్యం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ, వ్యవసాయ, పారిశ్రామిక, సేవరంగాల్లో గణనీయమైన ప్రగతిని కనపరస్తూ ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకొనే దిశగా వడివడిగా అడుగులేస్తూ శత వసంతాల స్వతంత్ర ఉత్సవాలు జరుపుకొనేందుకు సన్నద్ధమవు తున్నాం..



ఇది నాణేనికి ఒక పార్శ్వమయితే... ఇంకోవైపు చూస్తే కుల, మత, ప్రాంత, భాషా విభేదాలు. అవినీతి, అన్నింటా కల్తీ, అడుగడుగునా మోసం, దగా, విచక్షణా రహితంగా మత్తు పదార్థాల వినియోగం, డ్రగ్ మాఫియా, సైబర్ క్రైమ్స్, మితిమీరిన సోషల్ మీడియా నెగటివ్ ప్రభావం, హద్దులు మీరుతున్నారంటూ చర్చకు దారి తీస్తున్న మగువల వస్త్ర ధారణ, క్షణికావేశానికిలోనై అభం శుభం తెలియని చిన్నారులను నిర్దాక్షిణ్యంగా మట్టుబెడుతున్న సంఘటనలు, ఆత్మహత్యలకు తెగిస్తున్న యువత, జీవిత భాగస్వామిని చిత్రవధలకు గురిచేస్తూ అంతంచేయడానికి కూడా వెనుకాడని ఆలుమగలు, వావివరసలు, వయోభేదం పట్టించు కోకుండా మృగప్రవృత్తితో రెచ్చిపోతున్న పురుష పుంగవులు, యువతీ యువకుల్లో క్రమశిక్షణా రాహిత్యమైన జీవనశైలి, లోపించిన నిర్ణయాత్మకశక్తి, ఆందోళన, అసంతృప్తి. వెలితి, 'అమ్మా సారీ' అంటూ ఆత్మహత్యలకు తెగబడుతున్న విద్యార్థులు... చెప్పుకుంటూ పోతే ఇలా ఎన్నో ఉన్నాయి. ఇటువంటి వాటిని అధిగమించడానికి సకరాత్మక దృక్పథంతో ఎంతోమంది ప్రముఖులు తమ బోధనలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తున్నారు.

అటువంటి వారిలో జాతిని మేల్కొలిపిన గొప్ప మాస్టర్ స్పిరిట్, యూత్ ఐకాన్‌గా గుర్తింపబడిన స్వామి వివేకానంద ప్రముఖులు. వీరి జన్మదినం ప్రతీ యేటా జనవరి 12న నిర్వహించు కుంటున్నాం. ఈ సందర్భంగా వీరిని గుర్తు చేసు కొని వారి బోధనలు, వాటితో స్ఫూర్తి నొందిన వారి తీరు, సమాజంలో సకారాత్మక దృక్పథంతో మార్పుకు ఆశించే వారికి ఉద్దేశించి చేస్తున్న ప్రయత్నమిది. వివేకానందుని దృష్టిలో భారతదేశం కేవలం ప్రపంచంలో ఒక భూభాగం మాత్రమే కాదు. జీవవంతమైన దేవత భారతమాత ఆరాధ్య దైవం. ఈదేశం త్యాగం, సేవ, జ్ఞాన సంపదకు నిలయం. దేశానికీ, ప్రతి ఆత్మకు తన అంతిమ గమ్యాన్ని చేరుకోవడానికి అవసరమైన జ్ఞానాన్ని ఇచ్చే పుణ్యభూమి. కావున ప్రజలు కర్మ యోగులుగా మారి, తమ విధులు నిష్కామంగా

నిర్వహించాలని ఆకాంక్షించారు. మూడు కోట్ల దేవతల కోసం వెతకడం మాని, కళ్ళ ముందున్న పేదవారిని, ఆకలితో అలమటిస్తున్నవారిని దేవునిగా భావించి సేవించా లన్నారు. నిరక్షరాస్యులు, పీడిత తాడిత వర్గాలు ఆయన దృష్టిలో నిజమైన భారతమాత రూపాలు. ఆత్మవిశ్వాసం, నిర్భయత్వం కలిగిన యువత దేశానికీ వెన్నెముక అని విశ్వసించారు. యువత దేశానికి భవిష్యత్ మాత్రమే కాదు. వర్తమానంలో 'చేంజ్ఏజెంట్స్' అని, వీరు నాయకత్వం, ఆవిష్కరణ, సమాజసేవలో ముందుండాలని ఆకాంక్షించారు.

1897లో విదేశాల నుండి తిరిగి వచ్చినపుడు 'ఈ మట్టి నాకు పవిత్రం. ఇక్కడి గాలి పుణ్యం' భారత దేశం పతనం చెందితే ప్రపంచంలో ఆధ్యాత్మికత అంతమవుతుంది. ఇది మానవాళికి వినాశకరం అంటూ హెచ్చరించారు. విశ్వ గురువుగా భారత్, ప్రపంచానికి ఆధ్యాత్మిక నాయకత్వం వహించే దేశంగా, పాశ్చాత్యదేశాల భౌతిక విజ్ఞానానికి, భారతదేశ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని జోడించి ప్రపంచశాంతికి దిక్సూచి కావాలని ఆకాక్షించారు. భారతదేశ పునర్నిర్మాణం కేవలం యువత వల్లే సాధ్యమని నమ్మారు. 'అనంత మైన శక్తి వారి లోనే ఉంది' అని నమ్మి అసాధ్యాలు సుసాధ్యం చేసే తెలివి తేటలు, నైతిక బలంతో పాటు ఉక్కులాంటి కండరాలు, ఇనుములాంటి నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత అవసరముందన్నారు. 'మేల్కొనండి, నిలబడండి, లక్ష్యం వైపు సాగండి మీలోని శక్తిని గుర్తించండి. విజయం మీ వెంటే అంటిపెట్టుకుని ఉంటుంది. మీ కలలే రేపటి సమాజానికి మార్గదర్శకాలు' అంటూ యువత తమలోని అంతర్గతశక్తిని నమ్మి, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, రేపటి ప్రపంచాన్ని నిర్మించడంలో నేటి యువతే మూల స్తంభాలు కావాలని అభిలషించారు. పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక ఆవిష్కరణలు, సామాజిక న్యాయం కోసం యువత సన్నద్ధం కావాలి అంటూ పిలుపు నిచ్చారు.

1893 షికాగో ప్రసంగం చారిత్మాకమైనది. యూనివర్సల్ బ్రదర్ హుడ్‌ను చాటిచెప్పేలా 'సోదర సోదరీమణులారా' అని సంబోధించి యావత్ ప్రపంచం వసుధైక కుటుంబం అనే సనాతన భారతీయ భావనను విశ్వానికి పరిచయం చేశారు. అన్ని మతాల గమ్యం భగవంతుడే, పరమత సహనంతో పాటు ఆయా మతాల్లోని సత్యాలను అంగీకరించడం నేర్చుకోవాలి. ఆధ్యాత్మికను సైన్స్‌తో సమన్వయం చేయడం వల్ల సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుంది. బావిలో కప్పలు మాదిరిగా కాకుండా, సంకుచితత్వం విడనాడి మెలగాలి అంటూ మతసామరస్యాన్ని చాటిచెప్పారు. 'మన మాతృభూమికి వేదాంతం మెదడు, ఇస్లాం శరీరం' అంటూ ఒక లేఖలో వ్రాసారు. ఆధ్యాత్మికతో పాటు సామాజిక సమానత్వంను పాటించిన యేసుక్రీస్తును అధ్యాత్మిక దిగ్గజంగా, మహాయోగిగా అభివర్ణించారు. అమెరికాలోని అనేక క్రైస్తవసంఘాలు చికాగో సభ తరువాత, ఆయనను ఒక ప్రవక్తగా గౌరవించాయి. ఆయన ప్రసంగాలు బైబిల్‌లోని ప్రేమసందేశానికి కొత్తఅర్థం ఇచ్చినట్లు క్రైస్తవులు భావించారు. సిక్కుల శౌర్యం, ధైర్యం, సేవాదృక్పథం భారతదేశానికీ ఆదర్శమని, గురు గోవింద్‌సింగ్ త్యాగనిరతిని తన ప్రసంగాల్లో ఉటంకించేవారు. సిక్కులు తమ మత సిద్ధాంతమైన మానవసేవకు మద్దతుగా పలికిన గొప్ప యోగిగా వీరిని చూస్తారు. మతాల మధ్య ఉండాల్సింది పోరాటం కాదు సమన్వయము అంటూ సన్మార్గంలో తమ మతం లోనే ఉంటూ, ఇతర మతాల్లోని మంచిని స్వీకరిస్తూ మరింతగా ఎదగాలని ఉద్బోధించారు. 'బలమే జీవనం.. బలహీనతే మరణం' 'మన కష్ట సుఖాలకు, మనమేం బాధ్యులం, మన భవిష్యత్‌ను మనమేం నిర్మించుకోవాలి' అంటూ సాధారణ పౌరులకు ఉద్బోధించారు. 'జీవ సేవయే శివ సేవ. సమాజ శ్రేయస్సుకు స్వచంద సేవకులుగా మారాలని, వేదాంతం అంటే అడవులకు వెళ్లి తపస్సు చేయడం కాదు. ఉన్నచోటే నిష్కామంగా తన పని తాను సక్రమంగా చేయడమే' అంటూ సామాన్యులకు ఉద్బోధించారు. ఒక సామాన్య ఉద్యోగి, కార్మికుడు, గృహిణి తమ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించడం కూడా అధ్యాత్మికతయే అంటూ, తనకు తాను తక్కువ అంచనా వేసుకోవద్దు వద్దు, అనంతమైన శక్తి నీలో దాగి ఉందని గ్రహించాలన్నారు. సత్యం కోసం దేన్నయినా త్యాగం చేయొచ్చు. దేని కోసమో సత్యాన్ని త్యాగం చేయకూడదు. 'ఏదయితే శారీరకంగా, మానసికంగా బలహీన పరుస్తుందో, దాన్ని విషం గా భావించి వదిలేయాలి' 'గమ్యం చేరే వరకూ విశ్రమించ వద్దు. మెదడుకు పదును పెట్టి మారుతున్న కాలానికి అనుగుణంగా నిరంతరం నైపుణ్యత పెంపొంది చుకోవాలి' అంటూ హితవు పలికారు. మ్యాన్ మేకింగ్ ఎడ్యుకేషన్ మెదడులో విజ్ఞానంతో పాటు శీలాన్ని నిర్మించేదిగా విద్య ఉండాలి. ఆత్మనిర్భరత, స్వయం సంవృద్ధి సాధించాలి. ఇతర దేశాలపై ఆధార పడకుండా మన కాళ్ళపై మనం నిలబడగలగాలి. 'పేదవానికి విద్య అందక పోతే విద్యే పేదవాని వద్దకు వెళ్ళాలి' 'అట్టడుగు వర్గాల ప్రజలకు విద్య, ఆహరం, గౌరవం దక్కినప్పుడే నిజమైన భారత దేశం ఉద్భవిస్తుంది' ఉపాధ్యాయులు విద్యను బోధించే గురువులుగానే కాకుండా ఒక ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్‌గా వ్యవహారించాలి. విద్యార్థిలో అంతర్లీనంగా నున్న పరిపూర్ణతను వెలికితీయడం కర్తవ్యంగా భావించాలి. శారీరక, మానసిక, అధ్యాతిక వికాసం కలిగించేలా విద్యార్థను తీర్చిదిద్దాలని అభిలషించారు.

యోగా అంటే కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు. శరీరం, మనస్సు, ఆత్మలను ఏకం చేసే ఒక సంపూర్ణ విజ్ఞానం. వీరు నాలుగు రకాల యోగ మార్గాలు ప్రపంచానికి పరిచయం చేశారు. కర్మ యోగా- నిస్వార్థంగా పనులు చేయడం ద్వారా మోక్షం పొందడం. ఇది క్రియాశీలకంగా ఉండేవారూ ఆచరించ దగ్గది. భక్తి యోగా- దేవునిపై అచంచలమైన ప్రేమ భక్తి కల్గి యుండి తద్వారా పరమాత్మను చేరుకోవడం. జ్ఞాన యోగా- వివేచన, ధ్యానం ద్వారా సత్యాన్ని తెల్సుకోవడం. హేతుబద్ధంగా ఆలోచించేవారికిది అనువైన నదిది. రాజ యోగా- మనస్సును ఏకాగ్రత్తను నియంత్రించడం ద్వారా అంతర్గత శక్తులను మేల్కొలపడం. యోగా ఒక సార్వత్రిక సాధన. మానసిక ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంచే సాధనం. యోగా వృద్ధులు శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే ఆధ్యాత్మిక పరిణితిని సాధించే మార్గంగా బోధించారు. 'నీలో దైవం ఉన్నారు. నీ అంతరాత్మతో దర్శించు' అనే వీరి బోధన యోగా సాధనలో అత్యంత కీలకం. జీవిత చరమాంకంలో ధైర్యంగా, నిస్వార్థంగా ఉండడానికి, ఆత్మవిశ్వాసంతో, మనలోని ఆత్మశక్తితో, సేవాభావంతో, జీవితాంతం సంపాదించిన అనుభవాన్ని సమాజసేవకు ఉపయోగిస్తే గొప్ప సంతృప్తి మిగుల్చుతుంది. నిర్భయత్వంతో, వయసురీత్యా వచ్చే బలహీనతలకు భయపడకుండా, మానసిక బలం కల్గి ఉండాలి. నిస్వార్థత, ఫలితం ఆశించని ధర్మాచరణ వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. జీవితంలోని ప్రతీ దశలోను బాధ్యతలను సంతోషంగా నిర్వర్తించే కర్తవ్య పాలన వల్ల ఇన్నర్ పీస్ చేకూరి, భవిష్యత్ గురించి చింతన లేకుండా ప్రస్తుత క్షణంలో జీవించడం అలవడుతుంది. వృద్ధులు ఆధ్యాత్మిక పరిణితికి ఒక అవకాశంగా మలచుకోవాలన్న దిశానిర్దేశం వీరి బోధనల ద్వారా అవగత మవుతుంది.

'మహిళలు అభివృద్ధి చెందకుండా.. ఏ దేశం పురోగతి సాధించలేదు. వారు తమ సమస్యలు తామే పరిష్కరించుకొనే స్థాయికి ఎదగాలి. వారిని విద్యావంతులను చేయడం సమాజం చేయాల్సిన పని. సామాజిక బాధ్యతతో మహిళల ఉద్ధరణకు కంకణం కట్టాలి. ఆత్మ గౌరవంతో మహిళల సమస్యలు వారే పరిష్కరించుకోవాలి. పురుషులు అందుకు కేవలం సహకరిస్తే చాలు' అన్నారు. సిస్టర్ నివేదిత ద్వారా మహిళా విద్యాసాధికారతకు ఆయన పునాది వేశారు. నేటి స్వయంగా శక్తి సహాయక సంఘాలు, ఎన్ జీ ఓ లకు మార్గదర్శకంగా నిలిచారు. భారతదేశం గ్రామాల్లో నివసిస్తుంది. రైతులు దేశానికి వెన్నెముక. రైతుకు సామాజిక హోదా గౌరవం దక్కాలి. సరైన విద్య అందాలన్నది వీరి భోదనలోని సారాంశం. సాంకేతికత, సేవాభావం సమ్మిళితమై అల్గారితమ్స్ మాత్రమే కాకుండా సాంకేతికతను సామాజిక సమస్యల పరిష్కారానికి 'వ్యవహారిక వేదాంతం'ను బోధించారు. వీటిని పాటిస్తే యువత అన్నిరంగాల్లో శక్తివంతులుగా తీర్చి దిద్దబడతారు. మిమ్మల్ని మీరు నమ్మండి, ఆత్మవిశ్వాసంతో ఉండండి. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి ఏకాగ్రత, ఏకలక్ష్యంతో మంచి ఆలోచన చేయండి. ఆ ఆలోచనే మీ జీవితంగా మార్చుకోండి. ఈసూత్రం చంచలత్వం నుండి కాపాడి, లక్ష్యం వైపు నడిపిస్తుంది. శారీరక మానసిక దృఢత్వంతో పుస్తకజ్ఞానం, విషయ పరిజ్ఞానంతో పాటు క్యారెక్టర్ బిల్డింగ్, నడవడిక ముఖ్యం. నైతిక విలువలతో కూడిన జీవితం, దీర్ఘ కాలిక విజయాన్ని అందిస్తుంది.

మానవ సేవయే మాధవ సేవ. స్వార్థం విడ నాడి సమాజం కోసం పనిచేయడంలో మానసిక ప్రశాంతత లభిస్తుంది.

సమాజంలో సకారాత్మక దృక్పథం ఏర్పడి సమస్యలు తగ్గుతాయి. నాయకత్వ లక్షణాలు పెంపొంది ఎదురు దెబ్బలను తట్టుకొనే ధైర్యం వస్తుంది. భయపడి పారిపోవద్దు. ఎదురు తిరిగి పోరాడండి. వైఫల్యాలను ఎదుర్కొనేలా రాజీ పడే తత్వం విడనాడి, ప్రశ్నించేతత్వం అలవడితే సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించ వీలవుతుంది. కుల, మత, వర్గ విభేదాలకు అతీతంగా వ్యవహరిస్తూ శాంతిని నెలకొల్పడానికి దోహదపడండి. జ్ఞాన సమూపార్జనకు, మేధో వికాసానికి ఏకాగ్రతే మూలం. ఆత్మ విశ్వాసంఅతిముఖ్యమైన వ్యక్తిత్వ వికాస సాధనం. 'నీపైనీకు నమ్మకం లేకుంటే దేవుణ్ణి నమ్మినా ఫలితముండదు' అ భీః.. అంటే నిర్భయత్వం నీ శ్వాసలో ఉండాలి. ప్రతి వైఫల్యం ఓ గుణపాఠంగా భావించి మానసిక స్థైర్యం అలవర్చు కోవాలి. ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో. పనిని దైవంగా భావించి, నిబద్ధత, అంకితభావం అలవర్చు కోవాలి. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి స్ట్రెస్ మానేజ్మెంట్‌కు ప్రాణయామ రాజయోగ అభ్యాసన జీవితంలో ఒక భాగం కావాలి. మెదడుకు పదును పెట్టి మారుతున్న కాలానికి అనుగుణంగా నిరంతరం నైపుణ్యత పెంపొందించుకోవాలి. స్వయంశక్తితో తన కాళ్ళపై తాను నిలబడ గలగాలి. వీరి భోదనలు సన్మార్గంలో నడిచే వారికే కాదు, దారి తప్పిన వారిని సరిదిద్దడానికి కూడా శక్తివంతమైన ఆయుధాలుగా పని చేస్తాయి. దేశభక్తిని ఆరాధనగా భావించారు. ఏ దేశం పట్ల నీవు కృతజ్ఞత కల్గి ఉండవో, ఆ దేశానికి ద్రోహం చేయడమే అవుతుంది. ఇది ఆత్మహత్యతో సమానం. విధ్వంసం ద్వారా ఏదీ సాధించలేము. నిర్మాణశక్తి మాత్రమే శాశ్వతం అన్న వీరి హెచ్చరిక సంఘ విద్రోహకశక్తులలో మార్పు కలగడానికి, మానవత్వ సందేశాలుగా ఉపయోగ పడతాయి. వంచన ద్వారా పొందే విజయం కంటే నిజాయితీతో కూడిన ఓటమి మిన్న, అవినీతి సంపాదన మానసిక ప్రశాంతత ఇవ్వదు, అంతిమంగా వినాశనానికి దారితీస్తుందని అన్నారు. నీవు చేసే ప్రతితప్పుకు ఫలితం అనుభవించక తప్పదని. ఇతరుల సొమ్మును ఆశించడం పాపమన్న వారి బోధనలు అవినీతి పరుల మనస్సాక్షిని తట్టి లేపుతాయి. ఇతరుల ప్రాణాలతో చలగాటం చేసే కల్తీ వ్యాపారాన్ని రాక్షస ప్రవృత్తిగా అభివర్ణించారు. లాభం కోసం తోటి మనిషికి విషం వడ్డించడం ఆధ్యాత్మికంగా అదః పాతాళానికి పడిపోవడమే. నీవు ఇతరులకు ఏమి ఇస్తావో అదే ప్రకృతి తిరిగి ఇస్తుంది. వ్యాపార ధర్మం విస్మరించవద్దు. శక్తిని దుర్వినియోగం

చేయవద్దు. ఇది రక్షణ కోసమే, భక్షణ కోసం కాదు అంటూ అసాంఘిక శక్తులకు పాల్పడే వారిని ఉద్దేశించి హితవు పలికారు.

దుష్టశక్తి తాత్కాలికం, సత్యం, ధర్మం మాత్రమే శాశ్వతం. అంతర్లీనంగా మనలో ఉన్న దైవత్వంను తట్టిలేపాలి అన్నారు. అలాగే నిరాశ వాదులపై వీరి ప్రభావం అత్యంత సానుకూలమైనది. నీవు బలహీనుడవని భావించడమే ప్రపంచంలో అతి పెద్ద పాపం. చైతన్య దీప్తి, అనంతమైనశక్తి నీలో ఉంది అంటూ సానుకూల దృక్పథం యొక్క విశిష్టత తెలియజెప్పారు. వీరి యొక్క వేదాంత కేసరి ప్రసంగాలు దివ్య ఔషధాలు. మనలోని దైవత్వం గుర్తించిన నాడు సమాజం రామరాజ్యం అవుతుందన్నారు. భగవద్గీత నైతిక విలువలను నేర్పుతుందని, ఈ గ్రంథ పఠన ఆవశ్యకతను తెలియ జెప్పారు. స్టార్టప్స్ వ్యాపారంలో నీతి నియమాలు పాటిస్తూ నమ్మకాన్ని చూరగోనేలా ఎథిక్స్ పాటిస్తూ రిస్క్ తీసుకొనే ధైర్యంతో ముందుకు సాగాలి. వృత్తి ప్రవృతిలో ఉన్నత శిఖరాలు అధిరోహనకు గొప్ప బలం సామాజిక భాధ్యత వహించడం. ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేస్తూ, సవాళ్లు ఎదుర్కొంటూ నిబద్దతతో విధులు నిర్వహించడంలో కేవలం ఉద్యోగం గా కాకుండా దేశసేవ, సమాజసేవ, ప్రజల సంక్షేమం కాంక్షించి ఆత్మవిశ్వాసం, మొక్కవోని దీక్ష, పట్టుదలతో రాజకీయ ఒతిళ్లకు ఎదుర్కొని, ప్రజా హితమైన సంస్కరణలు తీసుకురావడానికి అవసరమైన ధైర్యం, మానసిక బలం, పరిపాలనలో పారదర్శకత. అవినీతికి దూరంగా, నిజాయితీగా, యోగా, ధ్యానం, నడక దినచర్యలో భాగంగా ఉంటున్న ఎంతోమంది సివిల్, పోలీస్, సర్వంట్స్‌కు వీరి ఆదర్శాలే ప్రేరణ. డా. జయప్రకాష్ నారాయణ (ఐఏఎస్) వంటి వారు వ్యవస్థాగత మార్పులు తీసుకురావాలన్న ఆలోచనలకు వీరి భోదనలే ఊపిరి అంటూ పేర్కొన్న సందర్భాలున్నాయి. అలాగే వీవీ.లక్ష్మీ నారాయణ (ఐపిఎస్) సవాళ్ళను ఎదుర్కోవడంలో వీరి ఆత్మవిశ్వాస సందేశాలు ఏంతో ఉపయోగపడ్డాయని వెల్లడించారు. అధికారం కంటే సేవాదృక్పధం పైస్థాయిలో పని చేసే వారిలో ఎక్కవగా కనిపిస్తుంది. సీనియర్ అధికారుల్లో ఎంతోమంది వీరి బోధనల స్ఫూర్తితో, నైతిక బలంతో, కఠినమైన పరిస్థితుల్లో ఒత్తిడిని జయించి విధి నిర్వహణలో ట్రాన్సఫర్స్‌కు భయపడక, ప్రాధాన్యత లేని పోస్టులు నిర్వహించవలసి వచ్చినా లెక్క చేయక, ధర్మం వైపు నిలబడడాని రాజకీయ ఒత్తిడికి లొంగకుండా నిర్భయత్వంతో ముందుకు సాగుతూ ప్రజాస్వామ్య విలువలు కాపాడుతున్నారు. రాజ్యాంగంలోని లౌకికవాదం, సామాజిక న్యాయం వంటి అంశాలలో వివేకానందుని బోధనలే ముఖ్యం అంటూ జస్టిస్ ఎన్.వి.రమణ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల్లో న్యాయమూర్తులు వీరి సూక్తులు తరచూ ఊటన్కిస్తుంటారు.

అటల్ బిహారి వాజ్‌పాయి తన ప్రసంగాలు, కవితలు, రాజకీయ సిద్ధాంతాలలో వివేకానందుని మార్గదర్శకత్వాన్ని తరచూ ప్రస్థావించేవారు. స్వామి వివేకానంద ప్రపంచ వేదికపై భారతీయ సంస్కృతిని ఏ విధంగా గర్వంగా చాటిచెప్పారో, అదే తీరులో అంతర్జాతీయ వేదిక ఐక్య రాజ్యసమితిలో వీరు హిందీలో ప్రసంగించి భారతీయతను చాటిచెప్పారు. వీరి దేశభక్తి కవితల్లో, అభీః నిర్భయత్వం దేశభిమానం ప్రతిబింబిస్తాయి. వారి మాటలు వీరిని రాజనీతజ్ఞతతో కూడిన మానవతావాదిగా నిలిపాయి.

నెహ్రూ కుటుంబానికి రామకృష్ణ మిషన్‌తో సన్నిహిత సంబంధాలుండేవి. తన తల్లి కమలా నెహ్రూతో కలిసి ఇందిరా గాంధీ బేలూరు మఠానికి తరచూ వెళ్లేవారు. స్వామి రంగనానంద ఆశీస్సులు తీసుకొనేవారు. 'అభీః...ఎదురైనా క్లిష్ట పరిస్థితుల్లో భోదించిన ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించినట్లు' ఆమె పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఆయన ప్రసంగాలు, రచనల్లోని ప్రతి పేజీలోను ధైర్యాన్ని నింపే వివేకానందుని మాటలు భారత్‌కు ఆధునిక కాలంలోనూ ఏంతో అవసరం. దేశ పునర్నిర్మాణానికి ఆయన చూపిన మార్గం అత్యంత శ్రేష్ఠమైనది అంటూ 1970 ప్రాంతంలో ఒక సభలో ఆమె తన ప్రసంగంలో వెల్లడించారు. ప్రధానిగా ఉన్నపుడు ఆమె అనేక మార్లు బేలూరు మఠాన్ని సందర్శించి శ్రద్ధంజలి ఘటించారు.

యువకులను ఆకట్టుకొనే నటనా సామర్థ్యం, యువత వెన్నుదన్నుతో రాజకీయాల్లో రాణిస్తున్న పవన్ కళ్యాణ్ తండ్రి కూడా స్వయానా రామకృష్ణ భక్తుడు. 'అభీః.' అనగా నిర్భయత్వం, ఆత్మవిశ్వాసం, ప్రశ్నించేతత్వం అలవర్చుకోవడంతో పాటు, సామాజిక మార్పుకు చేసే పోరాటాల్లో వీరి బోధనలే ఆయుధాలుగా పవన్ కళ్యాణ్ మలచుకున్నారు. మూఢ నమ్మకాలను కాకుండా, తర్కబద్ధమైన, ఆచరణత్మాకమైన ఆధ్యాత్మికతను పవన్ కళ్యాణ్ ఇష్టపడతారు.

చికాగో వెళ్ళేముందు వివేకానంద రామేశ్వరంలో ప్రసంగిస్తూ భారత్ అగ్రగామిగా వెలగాలి, అది యువత చేతుల్లోనే ఉందన్నారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకున్న అబ్దుల్ కలాం 'వింగ్స్ ఆఫ్ ఫైర్, ఇగ్నేటెడ్ మైండ్స్' ద్వారా యువతలో స్ఫూర్తి రగిల్చారు. సృజన గల్గిన యువతే దేశ సంపదగా భావించి విజన్ 2020ను నిర్దేశించి కార్యరూపంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేసారు. రక్షణ, సాంకేతిక రంగాల్లో తమవంతు విజయాలు సాధించి చూపారు. శాస్త్రవేత్త అయినప్పటికీ ఆధ్యాత్మికతకు ప్రాధాన్యత నిచ్చారు.

భారత ప్రధాని 77 ఏళ్ళ నరేంద్రమోడీకి యోగా, ప్రాణాయామం దినచర్యలో ఓ భాగం. సాత్విక ఆహారం, ఉపవాస దీక్షలతో శరీరాన్ని తేలికగా, తక్కువ నిద్ర, ఎక్కువసేపు పనిచేస్తూ చురుకుగా ఉంటూ, మానసికంగా, శారీరకంగా దృడత్వంతో ఉంటారు. దూరదృష్టి, దృఢ సంకల్పం, స్పష్టమైన లక్ష్యం, ఒత్తిడిని జయించే సామర్థ్యం, కమ్యూనికేషన్‌లో నైపుణ్యం, ప్రజాసంబంధాల్లో పట్టు సునిశిత పరిశీలన, రాజీలేని పనితీరు, వ్యక్తిగత క్రమశిక్ష, ఆకర్షించే ఆహార్యం, రాటుదేలిన శిక్షణ, సంస్థాగత మద్దతుతో డౌన్ టు ఎర్త్ గానున్న ఐకానిక్ పర్సనాలిటీ వీరిది. తన వ్యక్తిత్వ పరిణితికి, పరిపాలనా వ్యవహారాల్లో విన్నూత్నమైన ఆలోచనలతో కూడిన దృక్పధం అలవడడానికి వివేకానందుని బోధనలే మూలమని భారత ప్రధాని నరేంద్ర మోడీ అనేక సందర్భాల్లో

పేర్కొన్నారు. వీరు బేలూరు మఠం తన సొంత ఇళ్లులా భావిస్తారు. ఆల్మోరా, రాజకోట్ మఠాల్లోనూ గడిపారు. స్వయం సంవృద్ధితో మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్‌గా తీర్చిదిద్దే ప్రక్రియలో 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్'లో వివేకానంద కోరుకున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం యువతలో ఉండాలని వీరు పిలుపు నిచ్చారు. సెర్వెంట్ లీడరషిప్‌కు, మానసిక నిశ్చలత, క్రమశిక్షణకు వీరి భోదనలు శిరోధార్యం అన్నారు బిగ్ బి అమితాబ్ బచ్చన్. 1998లో ఈ యంగ్ ఐకాన్ యొక్క విశిష్టత సర్వదమన్ బెనర్జీ సినిమా ద్వారా వ్యక్త పరచబడింది. మీరు భారత దేశాన్ని గురించి తెలుసు కోవాలంటే వివేకానంద గూర్చి చదవండి. ఆయనలో అంతా సానుకూలతే కనిపిస్తుంది. ప్రతికూలత అనేది అస్సలు ఉండదు అని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ తన అభిప్రాయం వ్యక్త పర్చగా.. వీరి రచనలు చదివిన తరువాత దేశం పట్ల ప్రేమ వెయ్యి రెట్లు పెరిగింది..అంటూ గాంధీజీ చెప్పారు. ఆధునిక భారత జాతీయ వాదానికి ఆధ్యాత్మిక పితామహుడుగా సుభాష్ చంద్రబోస్ అభివర్ణించారు. అద్భుతమైన వ్యక్తిత్వం కల్గిన ఆయన విజన్ వల్ల యువతకు మేలు కల్గుతుంది అంటారు సద్గురు జగ్గీ వాసుదేవ్. దేశ పౌరుషానికి, ఆత్మ గౌరవానికి నిలువుటద్దం అన్నారు డా. సర్వేపల్లి రాధా క్రిష్ణన్.

నరేంద్రుడు... స్వామి వివేకానందగా :

తన మాతృమూర్తి ప్రభావంతో రామాయణ, భారత గాధలు నరేంద్రునిపై బలమైన ముద్రవేసాయి. అసాధారణ తెలివి తేటలు గల ప్రజ్ఞాశాలిగా, ఆధ్యాత్మిక జిజ్ఞాసతో, ప్రశ్నించేతత్వం అలవర్చుకొని, ధ్యానంపై ఆసక్తిని పెంచుకున్నారు. తత్వ, సామాజిక శాస్త్రం, చరిత్ర, కళలు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. హెర్బర్ట్ స్పెన్సర్, జాన్ స్టూవార్డ్ మిల్ వంటి తత్వవేత్తల రచనలు చదివారు. శారీరక దృడత్వం పెంపొందించుకున్నారు. స్కాటిష్ చర్చికాలేజ్‌లో బిఏ పట్టా పొందారు. ఆయన జ్ఞాపకశక్తికి సంభ్రమాశ్చర్యాలకు గురైన ప్రొఫెసర్ విలియం హేష్టి వీరిని 'అద్భుత మేధావి'గా ప్రశంసించారు. భగవంతుని కోసం అన్వేషణలో భాగంగా బ్రహ్మసమాజంలో చేరారు. 1881లో దక్షిణేశ్వర్‌లో రామకృష్ణ పరమహంసను కలిసినపుడు. 'దేవున్ని మీరు చూసారా?' అన్న సందేహానికి 'దేవుణ్ణి చూసాను. నిన్ను చూస్తున్న దానికంటే స్పష్టంగా' అన్న సమాధానం వీరి అధ్యాత్మిక ప్రయాణంలో గొప్ప మలుపు. 1886లో తమ గురువు రామకృష్ణ పరమహంస మరణానంతరం సన్యాసం స్వీకరించి స్వామి వివేకానందగా మారారు. దేశ సంచారిగా సామాన్య ప్రజల కష్టాలు కళ్లారా చూసారు. కన్యాకుమారి వద్ద సముద్రం మధ్యలో గల శిలపై మూడు రోజుల పాటు ధ్యానం చేసి, దేశసేవ, మతప్రచారం తన జీవితాశయంగా నిర్దేశించికున్నారు. వివేకానందుని జీవితం, ఆధ్యాత్మికమార్గం వైపు పయనంలో శారదామాత పాత్ర అపారమైనది. మార్గదర్శిగా, మాతృమూర్తిగా ఆదర్శవంతమైన సంకల్ప బలాన్ని, సంపూర్ణ ఆశీర్వాదంతో ప్రేరణ నిచ్చారు. శారదా మాత పవిత్ర జీవనం, సేవా తత్పరత, విశ్వజనీన ప్రేమ, దివ్యఉపదేశాలు సమస్త మానవాళికి నిరంతరం స్ఫూర్తి దాయకాలుగా ఉన్నాయి. 'మనఃశాంతిగా ఉండాలంటే పరుల దోషాలను వేలెత్తి చూపే బదులు మనలో లోపాలు ఏమిటో చూసుకోవాలి. వాటిని సరి చేసుకోవాలి. తనలో ఉన్న దోషాలే ఇతరుల్లో కనిపిస్తాయి. ఇతరుల విషయంలో అనవసరమైన కుతూహలం కనపర్చకూడదు. పని ఎంత చిన్నదయినా గౌరవ భావంతో చెయ్యాలి. దేన్నీ తృణీకారభావంతో చూడకూడదు' అన్న ఉద్భోదనల ప్రభావం వీరిపై తీవ్రంగా ఉంది..

రామకృష్ణ పరమ హంస ఆశయాల సాధనకు 1897 మే 1 న రామకృష్ణ మిషన్ 'ఆత్మాన్ మొక్షార్థం జగద్ధ తాయచ' తన మోక్షం ప్రపంచ శ్రేయస్సు కోసం అన్న ప్రధానసూత్రం ప్రాతిపదికన బేలూరులో స్థాపించబడింది. ప్రపంచ వ్యాప్తంగా 250కి పైగా అధికారిక కేంద్రాలు ఉన్నాయి. విదేశాల్లో అమెరికా, రష్యా, జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా తదితర ప్రాంతాల్లో వేదాంత సొసైటీ పేరుతో శాఖలున్నాయి. వీటివల్ల వేలాదిగా త్యాగధనులైనవారు. రాజకీయ ప్రముఖులు, శాస్త్ర వేత్తలు, ఉన్నత ఉద్యోగ వర్గాలతో పాటు గ్రామీణుల్లో సామాన్యులు స్ఫూర్తిని పొందుతున్నారు. యువత 'వివేకానంద ఇన్స్టిట్యూట్ అఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్' ద్వారా సుశిక్షితులవుతున్నారు. విద్య, వైద్యం, రిలీఫ్ వర్క్స్, రూరల్ అప్ లిఫ్ట్మెంట్వంటి సేవలు అందించ బడుతున్నాయి. వ్యక్తిత్వం వికసింపజేసే అనేకమైన పుస్తకాలతో పాటు రామకృష్ణ ప్రభ అనే మాసపత్రిక ద్వారా చైతన్యం కల్గజేయబడుతున్నది. రామకృష్ణ మిషన్‌తో పాటు మానవ సేవే లక్ష్యంగా సేవలోనే దైవత్వం, దైవాన్ని ఆరాధించడానికి పేదలు, ఆర్తులకు సేవ చేయడమే మార్గం. అత్యంత నిరుపేదలకు చేసే సేవ నేరుగా దేవునికి చేరుతుంది అన్న నమ్మకంతో మదర్ థెరిసా నెలకొల్పిన 'మిషన్ అఫ్ చారిటీ' కూడా కోల్‌కతాలోనే ఉన్నాయి.

మానవతా వాదంతో విద్య, ఆత్మగౌరవం, వ్యక్తిత్వ వికాసం ద్వారా ప్రజలను మేల్కొలపాలని చూసారు వివేకానంద.

దయ గుణంతో రోగులు, అనాధలు, చనిపోయే స్థితిలో ఉన్నవారిని ప్రేమతో సేవ చేయడంపై దృష్టి నిలిపారు మదర్. ఒకరు యోగిగా సేవను ప్రభోదిస్తే.. మరొకరు సేవికగా ప్రేమను పంచారు. కేవలం 39 ఏళ్ళ 5 నెలల 24 రోజులు మాత్రమే జీవించినా నరేంద్రుడు స్వామి వివేకానందగా విశ్వ విజేతగా వెలుగొంది, ప్రపంచం గర్వించదగ్గ సాహిత్యం అందించారు. వారు వ్రాసిన పలు పుస్తకాలు, చేసిన ప్రసంగాలు, యోగా పద్ధతులు నేటి యువతకు దిక్సూచిలా దారి చూపిస్తున్నాయి. చికాగో ప్రసంగాలు, కొలంబో నుండి ఆల్మోరా వరకూ, దేశభక్తి మేల్కొలిపేలా చేసే ప్రసంగాలతో పాటు, నేను చూసిన నా గురుదేవులు రామకృష్ణ పరమహంస గురించిన జ్ఞాపకాలతో కూడుకున్నది. మన మాతృ భూమి అనేది దేశంపై ఆయనకున్న ప్రేమను చాటిచెప్పే రచన. కంప్లీట్ వర్క్స్ అఫ్ స్వామి వివేకానందా 9 సంపుటాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. * * *

హోసూరులోని ఆంధ్ర సాంస్కృతిక సమితిలో డిసెంబరు 27 తేదీన నిర్వహించిన సమావేశంలో కమిటీ అధ్యక్షులుగా ఎంపికైన చంద్రశేఖర్‌ను కార్యవర్గసభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు మనోహర్, నరేష్, కృష్ణారెడ్డి, నివృత తెలుగు పండితులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులోని పెన్షనర్‌హోమ్‌లో డిసెంబర్ 20 తేదీన పెన్షనర్స్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సాహితీ వేత్త, సంఘ సభ్యులు పలకలూరి శివరావును సంఘ అధ్యక్షులు కె.పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య ఘనంగా సత్కరించారు.

కవిత

పల్లె చిన్నబోయింది !

- మానూరు అప్పాజీ కృష్ణ, 96206 38119

పల్లెలోని ఆనందం
బ్రతుకుతెరువు కై
బస్తీ కొచ్చింది !
పల్లె చిన్నబోయింది
మన సంస్కృతి
వాడిపోయింది !

ధనుర్మాస వేళ
తెల్లవారుజామున
చలిపులిగా మింగుతుందని
ఒళ్ళంతా వణుకుల ఎలర్జీ
వంగితే నడుం నొప్పి
ఇక రంగవల్లికలంటే
తలకాయ నొప్పి !

గొబ్బిళ్ళు తట్టే చేతులేవి
కంప్యూటర్ పై
కదలాడే చేతులే అవి
పేడంటేనే అసహ్యం మరి
ఫర్ ఫ్యూమే మనవంటికి
పరమావధి మరి !
బొమ్మల కొలువులు లేనే లేవు
అవి ఎనాడో అటకెక్కాయి !
పల్లెపడుచుల ముస్తాబులే లేవు
అవి చుడీదార్లకే అంకితమయ్యాయి !

డూడూ బసవన్నల
సన్నాయిలు
మూతపడ్డాయ్ !
గంగిరెద్దులాటలు విసుగొస్తున్నాయ్!
హరిదాసుల సంకీర్తనలేనాడో
వైకుంఠానికి చేరిపోయాయి !
చూపులు మీడియాల వెంట
పరిగెడుతున్నాయి !

పల్లెల వైభోగం కనుమరుగైనా
రైతున్నకు తప్పలేదు !
పంట పండించక తప్పలేదు
బస్తీ దొరబాబుల ఆకలి
తీర్చక తప్పలేదు !

" రైతే రాజు " అను సూక్తి
వాడుకపదం కాకూడదు !
రైతు లేనిదే రాజ్యం లేదని
ఎలుగెత్తి చాటాలి !
ప్రతి సంక్రాంతి పండుగ
అలసిన రైతన్నల గుండెల్లో
సిరిసంపదలు నింపాలి !

పల్లెల్లో బస్తీల్లోనైనా
చెక్కు చెదిరిన
మన సంస్కృతి

సాంప్రదాయ గ్రంధానికి
మంచి అట్టవేసి
పూజనీయంగా
చేతనయనంతగా
మనందరం
సాంప్రదాయ విలువల్ని పాటిద్దాం !

బంగారు సంక్రాంతిలక్ష్మి ని
భక్తితో ఆహ్వానిద్దాం !

ఊరు - పేరు

- వాండ్రంగి కొండలరావు
94905 28730

తేతలి (పశ్చిమ గోదావరి జిల్లా)



తేతలి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలంలో తళతళలాడుతూ దర్శనమిస్తుంది. తేతలి తొలి పేరు తొతెలి. తొ అంటే తొలి... తె అంటే తెలుగు... లి అంటే లిపి అని గ్రహించాలి. ఇలా తొతెలి అయింది. క్రమంగా జనవ్యవహారంలో తొతెలి తేతలిగా మారింది.తొలి తెలుగు లిపికి శ్రీకారం చుట్టిన పల్లె ఇది. ఆదికవి, శబ్దశాసనుడు నన్నయభట్టు ఇక్కడి రాజరాజేశ్వరి స్వామి ఆలయంలో ఆంధ్ర మహాభారత రచనను ప్రారంభించాడు. 11వ శతాబ్దంలో రాజమహేంద్రవరాన్ని పరిపాలించిన రాజరాజ నరేంద్రుడు ఇక్కడ పార్వతీ సహిత రాజేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాడు. ఆయన కోరిక మేరకే నన్నయ ఆంధ్ర మహాభారత రచనకు ఈ ఆలయంలో శ్రీకారం చుట్టాడు. బ్రహ్మ సూత్రం ఉన్న అతి గొప్ప ఆలయంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయాన్ని నడింపల్లి ట్రస్టు వారు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా దశమి నుంచి అమావాస్య వరకు భారీ ఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. ఇక ఇక్కడి సీతారామస్వామి ఆలయం కూడా నిత్యం భక్తజనంతో కళకళలాడుతుంటుంది. ఈ పల్లె కొబ్బరి తోటలతో, హరిత కాంతులతో విలసిల్లుతోంది.

డి.హిరేహాల్ (అనంతపురం జిల్లా)

డి.హిరేహాల్ అనంతపురం జిల్లాలోని ఓ మండల కేంద్రం. కర్నాటక సరిహద్దుల్లో ఈ గ్రామం ఉండడంతో కన్నడ భాషా సంస్కృతికి అద్దం పడుతోంది. ఈ ఊరికి ఆ పేరు ఎలా

వచ్చిందంటే....... డి.హిరేహాల్ పూర్తి పేరు దండిన హిరేహాల్. దండిన అంటే దండు (సైనికులు/గుంపు), హిరే అంటే పెద్ద,.. హాల్(హల్లి) అంటే యేరు లేదా వంక అని అర్థం. ఇలా ఆ ఊరికి ఈ ప్రత్యేకతలతో ఆ పేరు వచ్చింది. విజయనగర సామ్రాజ్యాధీశుల (పెనుగొండ) వద్ద పనిచేసే దండు(సైనికులు), అలాగే సామ్రాజ్యాధీశుల పక్షాన రైతుల వద్ద శిస్తులు వసూలు చేసే పాలెగాళ్లు తమ క్షేత్ర పర్యటనల్లో భాగంగా ఈ ఊరిలో విశ్రాంతి తీసుకొనేవారని స్థానిక సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు, చరిత్ర ప్రేమికుడు కోనే బాలరాజు పేర్కొన్నారు. ఆ రోజుల్లో ఇది సైనిక శిక్షణ కేంద్రంగా ఉండేది. 1911లోనే ఇక్కడ కన్నడ ప్రాథమిక పాఠశాల ఏర్పాటైంది. ఆ తరువాత మరో మూడు కన్నడ ప్రాథమిక పాఠశాలలున్నాయి. తెలుగు మాధ్యమంలో ఓ ప్రాథమిక పాఠశాల ఉంది. 1958లో ప్రారంభించిన ఉన్నత పాఠశాలలో కన్నడ, తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాలు ఉన్నాయి. ఈ గ్రామంలో 90 శాతం మంది ప్రజలు కన్నడ భాషలోనే మాట్లాడతారు. వాల్మీకి (బోయ) కుటుంబీకులు ఇంట్లో తెలుగు భాషను మాట్లాడతారు. ఇక్కడి నీలకంఠేశ్వరస్వామి, మార్కండేయ, బసవన్న ఆలయాలు అతి ప్రాచీనమైనవి. గ్రామదేవత దేవమ్మ గుడి కూడా ప్రసిద్ధి చెందిందే. గ్రామ జనాభా 10వేలు.

ఆత్మవిశ్వాసం - విద్యార్థి విజయానికి వెలుగురేఖ

- నారంశెట్టి ఉమామహేశ్వరరావు
94907 99203

ప్రియమైన పిల్లల్లారా ఈనెల వ్యాసాన్ని ఒక కథతో ప్రారంభిద్దామా?...

ఒక పాఠశాలలో పరీక్షా ఫలితాలను ప్రకటిస్తూ ఉత్తీర్ణులైన విద్యార్థుల పేర్లను చదివి వినిపించారు ఉపాధ్యాయుడు. ఒక విద్యార్థి లేచి నిలబడి 'నా పేరు చదవలేదేమి?" అనడిగాడు.

'నువ్వు ఉత్తీర్ణుడు కాలేదు. అందుకే నీ పేరు చెప్పలేదు' అని బదులిచ్చారు ఉపాధ్యాయుడు. అందుకు కారణం లేకపోలేదు. ఆ సంవత్సరంలో ఎక్కువ రోజులు మలేరియాతో బాధపడ్డాడా బాలుడు. పాఠశాలకు సరిగా హాజరు కాలేదు. అందువల్లనే అతడు ఉత్తీర్ణుడు కాకపోయి ఉండవచ్చని ఉపాధ్యాయుడు భావించారు.

ఆ బాలుడు అందుకు ఒప్పుకోకుండా 'అలా జరగడానికి వీల్లేదు. నేను ఉత్తీర్ణుడవుతానని నమ్మకం నాకుంది' అన్నాడు ఆత్మవిశ్వాసంతో.

'నువ్వనుకున్నట్టు జరగలేదీసారి. నేను చెబుతున్నాను కదా. మరేమీ మాట్లాడకుండా కూర్చో. మాట్లాడావంటే జరిమానా వేస్తాను' అని చెప్పారు ఉపాధ్యాయుడు.

'నేను ఉత్తీర్ణుడిని కానన్న సందేహమే వద్దు గురువుగారు' అని ఘంటాపథంగా చెప్పాడా బాలుడు ఏ మాత్రం తగ్గకుండా.

దాంతో 'నీకు ఐదు రూపాయలు జరిమానా విధిస్తున్నాను' అని చెప్పారు ఉపాధ్యాయుడు.

అయినా ఆ విద్యార్థి పట్టు వదల్లేదు. పరీక్ష తప్పడానికి అవకాశమే లేదని మరింత గట్టిగా వాదించాడు. కోపం వచ్చిన ఉపాధ్యాయుడు జరిమానా పెంచుతూ పోయారు. అలా బాలుడికి విధించిన జరిమానా యాభై రూపాయలు చేరింది. అయినా బాలుడు తగ్గలేదు.

ఇదిలా జరుగుతుండగానే పాఠశాల లేఖకుడు పరిగెత్తుకుంటూ వచ్చి ఆ బాలునికి వచ్చిన మార్కుల జాబితాను ఉపాధ్యాయుడి చేతికిచ్చాడు. ఆ బాలుడికి తరగతిలో అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చాయి. ఉపాధ్యాయుడి ఆశ్చర్యానికి అంతులేక పోయింది. ఆ బాలుడి తెలివిని, ధైర్యాన్ని, అతనిపై అతనికున్న విశ్వాసాన్ని అభినందించారు. అచంచల ఆత్మవిశ్వాసం, సత్యనిష్ఠ ఉన్న ఆ బాలుడే బాబూరాజేంద్రప్రసాద్. ఆయనే స్వతంత్ర భారత దేశానికి ప్రథమ రాష్ట్రపతి అయ్యారు.

పిల్లలూ పైకథ చదివితే బాబూరాజేంద్రప్రసాద్‌లో బాల్యం నుంచీ ఉన్న ఆత్మవిశ్వాసం యొక్క స్థాయి తెలిసింది కదా. అందరు పిల్లలూ అలాగే ఆత్మవిశ్వాసం నింపుకోవాలి మరి. అందుకే ఈ నెల మనం "ఆత్మ విశ్వాసం పెంచుకోవాలి" అనే అంశం గురించి వివరంగా తెలుసుకుందాం.

"Success is like a train which has several coaches like hard work, focus, luck, attitude and vision. But leading all those is the engine of self confidence" అన్నది ప్రసిద్ధి చెందిన ఆంగ్ల నానుడి. శ్రమించే తత్వం, దృక్పథం, అదృష్టం, ముందుచూపు అనేవి రైలు బోగీలు అయితే ఆత్మవిశ్వాసం మాత్రం వాటిని నడిపించే రైలుఇంజనులాంటిది అని భావం. అంటే మానవ జీవితమనే రైలు నడవాలంటే ఆత్మవిశ్వాసం ఎంత అవసరమో తెలిసింది కదా.

మానవ జీవితానికి వెలుగును ప్రధానం చేసే దీపశిఖ ఆత్మ విశ్వాసం. జీవన యానంలో బాల్యం అపురూపమైనది. అందులో విద్యార్థి జీవితం అతి విలువైనది. విద్యార్థి జీవితంలోనే ఆశలు చిగురిస్తాయి. కలలు వికసిస్తాయి. అవి నిజరూపం దాల్చాలంటే అవసరమైన ముడిసరుకు మాత్రం ఆత్మవిశ్వాసం. ప్రతిభ, అవకాశాలున్నా సరే తమపై తమకు నమ్మకం లేకపోతే విద్యార్థి జీవితం కోరుతున్నంత గొప్పగా రాణించదు. అందుకే విద్యార్థి జీవితానికి ఆత్మవిశ్వాసం ప్రాణాధారమని చెప్పవచ్చు. కాబట్టి ప్రతి విద్యార్థి తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి.

"సగం విజయం ఆత్మవిశ్వాసంలోనే ఉంటుంది" అనేది పెద్దల మాట. ఒక వ్యక్తి తన శక్తి సామర్థ్యాల మీద కలిగి ఉన్న నమ్మకాన్ని ఆత్మవిశ్వాసం అంటారు. మనిషి విజయానికి మూలమూ, బలమూ ఆత్మవిశ్వాసమే. ఎవరి మీద వారికి నమ్మకం లేకపోతే ఎంత కృషి చేసినా సరైన ఫలితం లభించదు. ఏ పరిస్థితుల్లోనైనా "నేను చేయగలను" అనే విశ్వాసం ఉన్నప్పుడు జీవితానికి అర్థం ఉంటుంది.

ఆత్మవిశ్వాసం అంటే అహంకారం కాదు, అతిశయోక్తి అసలే కాదు. అది లోలోపలి సామర్థ్యాన్ని అర్థం చేసుకుని, నిరంతరం మెరుగుపడాలనే సంకల్పం. "నేను పరిపూర్ణుడిననే" భావం కాదు. "నేను ప్రయత్నిస్తే సాధించగలను" అనే దృఢవిశ్వాసం. ఈ విశ్వాసమే విద్యార్థిలో ధైర్యాన్ని నింపుతుంది. భయాన్ని తొలగిస్తుంది.

"చదువు చదువ బతుకు చక్కబడును కదా
విద్య లేనివాడు వింత పశువే

విలువ లేని విద్య విషతుల్యమే కదా!

మంచి మాటలెపుడు మరువ వద్దు"... అని పద్యకవి విద్య గొప్పతనాన్ని చక్కగా వివరించారు. విద్య నేర్చుకున్న వారి జీవితం బాగుంటుంది. విలువలతో కూడిన విద్యకు సమాజంలో గొప్ప స్థానం ఉంది. అందుకే పిల్లలను మేటి వ్యక్తులుగా తయారు చేయడానికి తల్లిదండ్రులు ప్రయత్నిస్తుంటారు. వారిని గొప్పగా చదివించి, ఎంతో ఉన్నత స్థానంలో నిలబెట్టాలని ప్రయత్నిస్తుంటారు. కన్నవారి ఆశలు, అత్యాశల కారణంగా విద్యార్థుల మీద ఒత్తిడి పడుతోంది. పరీక్షల్లో ఫస్ట్ ర్యాంకు తెచ్చుకోమని పిల్లల్ని వేధిస్తుంటారు కొందరు. లేకపోతే జీవితం వృధా అని బెదిరిస్తుంటారు. ఈ పోటీ ప్రపంచంలో గెలవాలంటే ఫలానా వారిలా తయారవ్వాలని పక్కవారిని చూపిస్తూ పోలుస్తుంటారు. వారితో సమానంగా, లేదంటే ఎక్కువగా ప్రతిభ చూపాలని ఉరుకులు పరుగులు తీయిస్తుంటారు. కన్నవారి ఆశలు నెరవేర్చాలన్న ఒత్తిడి పిల్లలపై ఎంతో పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఆత్మవిశ్వాసం లేని విద్యార్థులు చిన్న వైఫల్యాలకే కుంగి పోతున్నారు. ఆత్మవిశ్వాసం ఉన్న వారైతే ప్రతి సవాలుని ఒక అవకాశంగా తీసుకుని ఎదుగుతున్నారు. ప్రతి అనుభవం వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే సాధనమవుతుంది.



అప్పుడప్పుడు అపజయాలు కూడ విద్యార్థులకు ఎదురవుతాయి పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం లేదా విఫలం కావడం, ఆశించినంత గొప్ప ఫలితం రాకపోవడం వంటివి తాత్కాలికంగా బాధ కలిగించవచ్చు. అవన్నీ చిన్న స్పీడ్ బ్రేకర్ లాంటివే. అపజయం ఎవరికీ శత్రువు కాదు. జీవితంలో అపజయం కలగడమంటే ముగిసిపోవడం కాదు. అది ఒక మార్గదర్శి. మనల్ని మనం తీర్చిదిద్దుకుని ఎదిగేందుకు నిచ్చెనలా ఉపయోగపడుతుంది. అందుకే అపజయాన్ని అంగీకరించి, దానినుంచి పాఠం నేర్చుకోవాలి. అప్పుడే ఆత్మవిశ్వాసం బలపడుతుంది. క్రింద పడిన బంతి వేగంగా పైకి లేచినట్టు, విద్యార్థి కూడ మళ్లీ లేచి నిలబడే సంకల్పం అలవరచుకున్నప్పుడే విజయం సిద్ధిస్తుంది.

ఆత్మవిశ్వాసం ఒక్క రోజులో ఏర్పడేది కాదు. క్రమశిక్షణ, సాధన, సహనాల ఫలితంగా కొన్నాళ్లకు లేదా కొన్నేళ్ళకు ఏర్పడుతుంది. రోజువారి చదువు, చిన్న లక్ష్యాల సాధన, తమ పురోగతిని తామే గమనించుకోవడం వంటి చర్యల ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవచ్చు. పాఠశాల లేదా పబ్లిక్ వేదికపై మాట్లాడటం, చర్చల్లో పాల్గొనటం, తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరచటం వంటివి పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే మార్గాలు.

చదువులో, ఆటల్లో, ఇతర పోటీల్లో పాల్గొన్నప్పుడు ప్రారంభంలో భయం కలుగుతుంది. 'నేను చేయలేనేమో' అని భావిస్తే మాత్రం వెనుకబడి పోతారు. వారి ప్రయత్నం అర్ధంతరంగా మిగిలిపోతుంది. అదే కనుక ఆత్మవిశ్వాసంతో ఆలోచించి "నేను కృషి చేస్తే తప్పకుండా సాధించగలను" అని ప్రయత్నిస్తే విజయాన్ని పొందడం సులువవుతుంది.

విద్యార్థులకు వారి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు మార్గదర్శకులు కావాలి. వారిలోని లోపాలను ఎత్తిచూపకుండా, వారు చేస్తున్న ప్రయత్నాలను అభినందించాలి. వీలైతే ప్రశంసించాలి. అలాంటి ప్రోత్సాహం పిల్లల మనసుల్లో ధైర్యం నింపుతుంది. "నీవు చేయగలవు" అనే ప్రోత్సాహం విద్యార్థి జీవితంలో కొత్తమలుపు తీసుకురాగలదు. ఆత్మవిశ్వాసం ఉన్న విద్యార్థులు చదువుల్లోనే కాదు, అన్ని రంగాల్లో వెలుగొందుతారు. వారి ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి, నిర్ణయాలు దృఢంగా ఉంటాయి. భవిష్యత్తుపై భయం స్థానంలో ఆశ ఉంటుంది. తమ గమ్యాన్ని చేరుకునే శక్తి తమలోనే ఉందన్న విశ్వాసమే వారిని ముందుకు నడిపిస్తుంది.

ఆత్మవిశ్వాసం ఉన్న విద్యార్థులు తమ భవిష్యత్తును తామే నిర్మించుకుంటారు. వారి అడుగులు ధైర్యంగా ఉంటాయి. ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి. జీవిత ప్రయాణంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కొనే శక్తి వారిలో ఉంటుంది. విద్యార్థి దశ నుండే ఈ గుణాన్ని అలవరుచుకోవడం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ధైర్యంగా ఎదుర్కోగలుగుతారు. విజయం సాధించడానికి కేవలం తెలివి సరిపోవచ్చు. దానిని ఉపయోగించడానికి ధైర్యం ఉండాలి. మహానుభావులు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు మొదలైన వారు తమ జీవితంలో ఎన్నో తప్పిదాలు చేసినప్పటికీ, ఆత్మవిశ్వాసాన్ని విడిచి పెట్టలేదు. అదే వారిని గొప్పవారిగా చేసింది.

రోజువారీ జీవితంలో కూడా చిన్న చిన్న విషయాల్లో ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. కష్టమైన పనిని చేసినప్పుడు, పెద్దల ముందు మాట్లాడినప్పుడు, కొత్త విషయాన్ని నేర్చుకునేటప్పుడు మనసులో "నేనూ చేయగలను" అనే ఆత్మవిశ్వాసం ఉంచుకోవాలి. అప్పుడు జీవితం విజయమార్గంలో ముందుకు సాగుతుంది.

ఆత్మవిశ్వాసం ఉన్న వారెప్పుడూ ఉత్సాహంగా, సంతోషంగా ఉంటారు. వారిలో తడబాటు కనిపించదు. ధైర్యం పెరుగుతుంది. కాబట్టి పిల్లలు తమ మనసులో ఎప్పుడూ "నేను చేయగలను. నేను విజయం సాధిస్తాను" అని అనుకోవాలి.

"వెలుగు రాకముందే వేగ నిదురలెమ్ము

ప్రొద్దు బొడవ నిదురబోవరాదు

సోమరితనమేల శుచి శుభ్రముల యందు

తెలిసి నడచుకొమ్ము తెలుగు బిడ్డ!" ... అని పద్యకవి చెప్పినట్టు కొన్ని మంచి అలవాట్లు పాటిస్తే పిల్లలు ఆత్మవిశ్వాసాన్ని నెమ్మదిగా పెంచుకోవచ్చు. ఆత్మవిశ్వాసం అనేది కేవలం మాటల్లో ఉండేది కాదని, అది మన మంచి అలవాట్ల ద్వారా పెరుగుతుందని ముందుగా గ్రహించాలి.

ఏదైనా ఒక పని తలపెడితే మొదటి ప్రయత్నంలోనే వదిలేయకుండా పదే పదే చేయడం వల్ల ఆ పనిపై భయం పోయి, నైపుణ్యం పెరుగుతుంది. ఉదాహరణకు గణితం కష్టమని వదిలేయకుండా నిరంతరం సాధన చేస్తే దానిపై పట్టు వస్తుంది అద్భుతమైన ప్రావీణ్యం కలుగుతుంది.

మనకు ఏం కావాలో తెలిసినప్పుడు, ఆ దిశగా అడుగులు వేయడం సులభం అవుతుంది. చిన్న చిన్న లక్ష్యాలను ఏర్పరుచుకుని ప్రయత్నం సాధిస్తే భవిష్యత్తులో పెద్ద లక్ష్యాలను చేరుకోవడం సులువవుతుంది. అందువల్ల వారి మీద వారికి నమ్మకం పెరుగుతుంది.

"సానబెట్టిన వజ్రంబు లీను కాంతి

పొలము చక్కగ దున్నిన ఫలము నిచ్చు

అటులె అజ్ఞానియైనను నవనిపైని

విద్య నేర్చినయేని వివేకియగును"... అని పద్యకవి చెప్పినట్టు తమని తాము గొప్పగా సానబెట్టుకుంటూ రాణించినవారు, తమలో ఆత్మవిశ్వాసం నింపుకుని వజ్రంలా కాంతులు విరజిమ్మిన వారు చాలామంది ఉన్నారు. చరిత్రలో గొప్ప విజేతలందరూ ఒకప్పుడు సామాన్యులే. వారిని అసామాన్యులుగా మార్చింది వారిలోని ఆత్మవిశ్వాసమే.

ఎలక్ట్రిక్ బల్బును కనిపెట్టే క్రమంలో థామస్ అల్వా ఎడిసన్ చాలాసార్లు విఫలమయ్యారు. ఎంతోమంది విమర్శించినా "నేను ఓడిపోలేదు. బల్బు వెలగదని తెలిపే వెయ్యి మార్గాలను కనుగొన్నాను" అని తనపై నమ్మకంతో ప్రయత్నించారు. చివరకు విజయం సాధించారు. ఆయన ప్రయత్నం వల్ల ప్రపంచంలో విద్యుత్ వెలుగులు కనబడుతున్నాయి.

అబ్రహం లింకన్ కూడ జీవితంలో ఎన్నోసార్లు ఎదురుదెబ్బలు తిన్నారు. వ్యాపారాల్లో, ఎన్నికల్లో ఓడిపోయారు. కానీ ఆయనకున్న ఆత్మవిశ్వాసంతో దృఢంగా నిలబడి, అమెరికాకు అధ్యక్షుడయ్యారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కూడ చిన్నతనంలో ఎన్నో అవమానాలు, వివక్ష ఎదుర్కొన్నప్పటికీ ఉన్నత విద్య అభ్యసించడం ద్వారా తనను తాను నిరూపించుకోగలననే ఆత్మవిశ్వాసం పెంచుకున్నారు. పరిస్థితులతో పోరాడి భారత రాజ్యాంగ నిర్మాతగా ఎదిగారు.

విద్యార్థులకు ఆత్మవిశ్వాసం ఉండడం చాలా అవసరం. తరగతి గదిలో సందేహాలు అడగడానికి, భయపడకుండా ఉండటానికి సహాయపడేది ఆత్మవిశ్వాసం. క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో ధైర్యంగా పాల్గొనడానికి ఆత్మవిశ్వాసం కావాలి. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా రాయడానికి ఆత్మవిశ్వాసం సహాయపడుతుంది. చెడు స్నేహాలకు దూరంగా ఉండి "కాదు/వద్దు" అని చెప్పే ధైర్యం పొందడానికి ఆత్మవిశ్వాసం అవసరం.

ఆత్మవిశ్వాసం పెంపొందించే మార్గాలు :

- ప్రతిరోజు ఎవరికి వారు "నేను ఇది చేయగలను" (I can do it) అని చెప్పుకోవాలి..
- తమ లోపలి బలహీనతలను తెలుసుకుని, వాటిని బలాలుగా మార్చుకోవడానికి ప్రయత్నించాలి.

- మంచి పుస్తకాలు చదవడం, స్ఫూర్తినిచ్చే వ్యక్తుల కథలు వినడం అలవాటు చేసుకోవాలి.
- శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలి. వ్యాయామం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

ఆత్మవిశ్వాసం మెండుగా ఉన్నట్టయితే ఎలాంటి విజయాలనైనా సొంతం చేసుకోగలరని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా తట్టుకోగలరని మన పురాణ కథలు నిరూపించాయి. రామాయణంలో హనుమంతుడు ఆత్మవిశ్వాసానికి అద్భుతమైన ప్రతీక. సముద్రం మీద లంకకి ఎగురుతూ వెళ్లడానికి ముందు తనలో ఉన్న శక్తిని మరచిపోయాడు. జాంబవంతుడు గుర్తుచేసి ఆయనలో నమ్మకం నింపిన వెంటనే "నేను చేయగలను" అన్న విశ్వాసంతో ఆ మహా కార్యాన్ని సులువుగా సాధించాడు. అంతర్గత శక్తిని గుర్తించగలిగితే అడ్డంకులను అధిగమించవచ్చని హనుమంతుని కథ చెబుతుంది.

మహాభారతంలో పాండవులు దాయాదుల వల్ల ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. వనవాసం, అజ్ఞాతవాసం చేసారు. అవమానాలు పొందారు. అన్ని కష్టాల మధ్య కూడా వారు ధర్మపరంగా నిలబడ్డారే తప్ప ధైర్యాన్ని వదల్లేదు. చివరికి ధర్మయుద్ధంలో విజయం సాధించగలిగారంటే వారి అచంచలమైన విశ్వాసం వల్లేనని గ్రహించాలి.

భక్త ప్రహ్లాదుడు చిన్న వయస్సులోనే అత్యంత ఆత్మ విశ్వాసాన్ని చూపించాడు. తన తండ్రి హిరణ్యకశిపుడు వ్యతిరేకించినా

భగవంతునిపై ఉన్న అచంచల నమ్మకాన్ని విడిచిపెట్టలేదు. అతని విశ్వాసమే చివరికి నరసింహ అవతారంగా విష్ణువు అవతరించేలా మహిమ చూపించింది. నిజమైన విశ్వాసం మనలను రక్షిస్తుందని ప్రహ్లాదుడి కథ చెబుతోంది.

కేవలం పురాణ పురుషులే కాకుండా చారిత్రక పురుషులు కూడ ఆత్మవిశ్వాసంతో అవమానాలను ఎదుర్కొని తమ ప్రతిభను చాటుకున్నారు. అలాంటి వారిలో చాణక్యుడు ముందు వరసలో నిలుస్తాడు. తనను అవమానించిన నందరాజులను అంతమొందించడానికి ప్రణాళిక వేసి, చంద్రగుప్తుడిని చేరదీసి విద్యలు నేర్పించి ప్రయోజకుడిని చేసాడు. ఆయన ద్వారా మౌర్యసామ్రాజ్యాన్ని స్థాపించాడు. కౌటిల్యుని అర్థశాస్త్రంగా ప్రాముఖ్యత సంతరించుకున్న ప్రామాణిక గ్రంథం రచించింది చాణక్యుడే.

భారత స్వాతంత్ర్య సమరంలో రాణీ ఝాన్సీ లక్ష్మీబాయి ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. "నేనొక్కదాన్నే ఉన్నా సరే నా దేశాన్ని వదలను. స్వాతంత్ర్యం కోసం పోరాడతాను" అన్న విశ్వాసంతో ఆమె శత్రువుల మధ్య వీరోచితంగా పోరాడింది. ఆమె ధైర్యం నేటికీ స్త్రీ శక్తికి ప్రతికగా నిలుస్తోంది.

ఆధ్యాత్మిక మార్గంలో తమ ఆత్మవిశ్వాసంతో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద. ఆర్థిక ఇబ్బందులు, అవమానాలు ఎదురైనా తనలో ఉన్న విశ్వాసాన్ని వదల్లేదు. "తమపై నమ్మకం ఉంచుకోవాలి" అనే ఆయన మాట ఇప్పటికీ కోట్ల మందికి ఉత్సాహాన్నిస్తుంది.

కంటితో చూడలేని, చెవులతో వినలేని హెలెన్ కెల్లర్ ఆత్మవిశ్వాసంతో ప్రపంచానికి కొత్త దిశ చూపించారు. ఆమె గురువు అన్నేసుల్లీవాన్ సహాయంతో మాట్లాడడం, చదవడం నేర్చుకుని, పట్టభద్రురాలైన తొలి ద్వివైకల్య వ్యక్తిగా చరిత్ర సృష్టించారు.

"ధైర్యం అంటే భయం లేని మనిషి కావడం కాదు. భయాన్ని అధిగమించడం" అని చెప్పి దక్షిణాఫ్రికా నాయకుడు నెల్సన్ మండేలా 27 సంవత్సరాలు జైలులో ఉన్నా, తన సిద్ధాంతంపై నమ్మకం కోల్పోలేదు. ఆయన విశ్వాసమే దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది.

పాఠశాలలో చిన్నప్పుడు "ఆలస్యం చేసే విద్యార్థి" అని హేళనగా పిలువబడి ఉపాధ్యాయులచే నిరుత్సాహపరచబడిన ఐన్‌స్టీన్ తనలోని ఆలోచనాశక్తిపై నమ్మకం వదలలేదు. ప్రపంచ మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు చేసారు. తన సూత్రాలను ప్రదర్శించి శాస్త్ర జగత్తునే మలుపు తిప్పిన శాస్త్రవేత్త అయ్యారు.

పోలండ్‌కి చెందిన మారీక్యూరీ స్త్రీలకు అంగీకారం లేని కాలంలో భౌతిక రసాయన శాస్త్రాల్లో రెండు నోబెల్ బహుమతులు గెలుచుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే వరుస పెరుగుతూనే ఉంటుంది. అయినా మరో ఇద్దరి గురించి మాత్రం తప్పక చెప్పుకుందాం.

"నిలిచి నీళ్లు త్రాగ నీరుగారు బ్రతుకు
పరుగులెత్తవోయి పాలు త్రాగ
పరుగు నుండె పుట్టె నరుని నాగరికత
వాస్తవమ్ము నార్ల వారి మాట"... అని పద్య కవి చెప్పినట్టు ఉన్నచోటే ఉండిపోకుండా స్వయం కృషి, శ్రమించే తత్వంతో ఉన్నత స్థాయికి ఎదిగిన ఒక ప్రముఖుడి జీవిత చరిత్రలో ఆత్మవిశ్వాసం పోషించిన పాత్ర గురించి తెలుసుకుందాం.

అతను పుట్టింది ఆస్ట్రియాలో. డబ్బు లేని వారికి బీదరికం, డబ్బున్న ప్రజలకు తాగుడు తప్ప ఎటువంటి అవకాశాలు లేవక్కడ. ఆ పరిస్థితుల్లో అతనికి నటుడవ్వాలని కోరిక కలిగింది. ఆ విషయం చెప్పినప్పుడు పెద్దలంతా 'ఏ భాషలో' అంటూ నవ్వారు. కానీ అతడు వెనక్కి తగ్గలేదు. తనకు తానుగా ఆలోచించుకున్నాడు. అతని వద్ద ఉన్నది దృఢమైన శరీరం మాత్రమే. అంతకుమించిన ఆత్మవిశ్వాసం ఉంది. అందుకే తన శరీరాన్ని మరింత సుందరంగా మార్చుకోవడం కోసం రోజూ 10గంటలు వ్యాయామం చేసేవాడు. ప్రపంచ చరిత్రలో అతి చిన్న వయసులో మిస్టర్ యూనివర్స్ అయ్యాడు. అక్కడ నుండి అమెరికా వెళ్ళాడు. ఏడు ఒలంపిక్ పతకాలు సాధించాడు. ఆ తర్వాత నుండి సినిమా వేషాలు అతనికి రావడం మొదలయ్యాయి. అతికొద్ది సమయంలోనే బిలియనీర్ అయ్యాడు. ఆపై కాలిఫోర్నియాకు గవర్నర్ అయ్యాడు. అతనే ఆర్నాల్డ్ స్క్వార్జెనెగర్. అతడు నటించిన సినిమాలు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందాయి ఎందరో అభిమానుల్ని సంపాదించుకున్నాయి. అతడిలోని ఆత్మవిశ్వాసమే అంతటి ఉన్నత స్థాయిని అతనికి అందించింది.

"ఎండ వెనుకె వాన నిండు హర్షమునిచ్చు
రేయి వెనుకె పగలు హాయి నిచ్చు
బాధ వెనుకె సుఖము బహుళమై చెలగురా!
వాస్తవమ్ము నార్ల వారి మాట"... అని నార్ల వారన్నట్టు పట్టువదలని ప్రయత్నం, కొండంత ఆత్మ విశ్వాసంతో అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేసి, ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచిన ఒక రైతు కథ తెలుసుకుందాం.

బిహార్ రాజధాని పాట్నాకు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం గెహ్లార్. ఆ ఊళ్లో నివసించే రైతు పేరు దశరథ్ మంజీ. వాళ్ల గ్రామానికి పక్క గ్రామానికి మధ్య ఒక కొండ అడ్డంగా ఉండేది. ఆ ఊరి ప్రజలు తమకి కావాల్సిన నిత్యవసరాలు కొనుక్కోవాలన్నా అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం పొందాలన్నా కొండ చుట్టూ తిరిగి అవతలి గ్రామానికి వెళ్ళేవారు. అలా వెళ్లడానికి దూరం సుమారు 32 కిలోమీటర్లు అయితే అడ్డంగా ఉన్న కొండను తొలిస్తే 29 కిలోమీటర్లు తగ్గి, కేవలం మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. మూడు కిలోమీటర్ల కోసం అనవసరంగా 32 కిలోమీటర్లు కొండ చుట్టూ తిరుగుతూ వెళ్లేవారు ప్రజలు. వారికి శ్రమ దండుగ, కాలం వృథా అయ్యేది అయినా

ప్రజలంతా అలా బాధలు పడుతూనే వెళ్ళేవారు.

దశరథ్ మంజీకి కొండ అవతల పొలం ఉండేది. ఆ పొలాన్ని సేద్యం చేయడానికి అతడు వెళుతుండేవాడు. ఒకరోజు అతని భార్య ఫాగుణీదేవి భర్తకు అన్నం తీసుకొని కుండ నెత్తి మీద పెట్టుకొని కొండ మధ్యలో ఉన్న చిన్న దారిలో వెళుతుండగా రాళ్లు గుచ్చుకొని కిందపడింది. కుండ పగిలి అన్నం నేల మీద పడింది. అంతేకాదు ఆమెకి గాయాలయ్యాయి. ఆ గాయాలతో బాధపడుతూ ఆమె చనిపోయింది.

ఆమె మరణంతో చాలా బాధ పడ్డాడు దశరథ్ మంజీ. ఆ కొండను తొలిస్తే తప్ప గ్రామానికి మేలు జరగదని మనసులో నిర్ణయించుకున్నాడు. గ్రామస్తులతో 'నేను ఈ కొండను తొలుస్తాను, ఎవరైనా సహాయపడతారా' అని అడిగాడు. ఒక్కరూ ముందుకు రాలేదు. సరికదా నవ్వుకుని 'ఇతడు కొండను తొలిచే మొనగాడట' అని హేళన చేశారు. అతడు వారి మాటలు పట్టించుకోకుండా ఉలి, సుత్తి పట్టుకుని కార్యరంగంలోకి దిగాడు. అతడి గుండెల్లో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపుకున్నాడు. ఎవరి సాయం కోసం చూడకుండా తలవంచుకొని మౌనంగా, గంభీరంగా అడుగులు వేస్తూ కొండ దగ్గరికి వెళ్ళాడు. కొండకు నమస్కరించి తొలిచే పని మొదలు పెట్టాడు. రోజులు, నెలలు కాదు 22 సంవత్సరాల కాలం ఆ కొండను కొట్టాడు. మూడు కిలోమీటర్ల పొడవు 30 అడుగుల వెడల్పుతో చక్కటి దారి తయారు చేశాడు. అతడి కొండంత ఆత్మవిశ్వాసం ముందు అంత పెద్ద కొండ చిన్నబోయింది. అతని సంకల్పం ముందు తలవంచి దాసోహం అంది. అతడి కృషిని, ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను చూసి గ్రామ ప్రజలే కాదు ప్రపంచమే విస్తుపోయింది. దశరథ్ మంజీ తయారు చేసిన మార్గంలో వాహనాలు కూడా వెళుతున్నాయి. రోడ్డు వేశారు. అతను చేసిన మేలుకి కృతజ్ఞతగా గెహ్లార్ ప్రజలు ఆ గ్రామం పేరును 'దశరథ్‌నగర్' అని మార్చుకున్నారు. చిన్న సమస్యలకి నీరసించి పోయే వారికి ఆత్మవిశ్వాసంతో కొండను తొలిచిన ఆదర్శనీయుడు అయ్యాడు దశరథ్ మంజీ.

కాబట్టి పూర్తిగా మంచిదే అని నమ్మిన పనిని ఇతరులు విమర్శించినా, ఎగతాళి చేసినా సంకోచించకుండా చేయాలి. వెనుకడుగు వేయకూడదు. ఏకాగ్రతతో పని పూర్తి చేసుకుంటూ వెళ్ళినప్పుడు "నవ్విన నాప చేనే పండుతుందని" అన్నట్టు అవహేళన చేసిన వాళ్లే గొప్పగా చెప్పుకుంటారు. విమానం కనిపెట్టేముందు రైట్ సోదరులు, అమెరికా అధ్యకుడు అవ్వాలని ఉందని బాల్యంలో అన్నప్పుడు బిల్ క్లింటన్ కూడ ఇవే పరిస్థితులను చిరునవ్వుతో ఎదుర్కొన్నారు. ఆ తర్వాత సాధించి చూపారు. ఆత్మవిశ్వాసంలో ఆచరణ సాధ్యమైన ప్రణాళికలు వేసుకుని ఫలితం సాధించవచ్చని నిరూపించారు.

విద్యార్థులు తమపై నమ్మకం పెంచుకొని కష్టపడితే ఈ ప్రపంచంలో సాధించలేనిది లేదు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా "నీపై నీకు నమ్మకం లేనప్పుడు నువ్వు దేవుడిని నమ్మినా ప్రయోజనం లేదు. కాబట్టి ఎవరిని వారు నమ్మాలి. విజేతలుగా నిలవాలి. వారిలోని శక్తిని మేల్కొలిపే విశ్వాసం కలిగి ఉండాలి."

జీవిత సముద్రంలో తుఫాన్లు తప్పవు. కానీ ఆత్మ విశ్వాసం అనే నావ మనలను తీరం చేరుస్తుందనే విషయమెప్పుడూ గుర్తుంచుకోవాలి. అవసరమైతే సాహసించేందుకు సిద్ధపడాలి. ప్రతిభను పెంచుకోవాలి. రోజు ఒకే పద్ధతిలో చేసే ప్రయత్నాలు ఒకే రకమైన ఫలితాలను ఇస్తాయి. కాబట్టి కాస్తంత బద్ధకాన్ని పక్కన పెట్టి కొత్త పద్ధతుల్లో కృషి చేయాలి. విజయం సొంతం అవుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సాహసం చేసి 71 రోజులు సముద్రంలో ప్రయాణించాడు కొలంబస్. నిత్యజీవితంలో ఇంత పెద్ద సాహసం చెయ్యాల్సిన అవసరమే లేదు. కొన్ని మంచి పద్ధతులు అలవాటు చేసుకుని క్రమశిక్షణ ప్రకారం ప్రయత్నిస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయి.

జీవితంలో జరిగే సంఘటనలు అనుభవంలోకి తీసుకొనే వైఖరిని బట్టి ఆత్మవిశ్వాసంలో హెచ్చుతగ్గులు కనిపిస్తాయి. సానుకూల వైఖరి అనేది మన ఆలోచనల తీరులో మార్పు తెచ్చి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఏ వ్యక్తికైనా అప్పుడప్పుడు ఆందోళనలు, సందేహాలు, ఒత్తిళ్లు ఏర్పడుతుంటాయి. అయితే అవి ఎక్కువ కాలం అధికారం చలాయించకుండా తొందరగా తిరస్కరించగలిగేలా చేయాల్సింది మాత్రం ఆత్మవిశ్వాసమే. కాబట్టి ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ఎదగాలి. జీవించాలి. గొప్ప విజయాలను సొంతం చేసుకోవాలి

* * *

సంక్రాంతి రాలేకపోతున్నాం

శ్రీని వాసు అద్దంకితో రవీంద్ర ఎన్ ఆత్రేయస

మీరేం భయపడకండి అత్తయ్య గారూ, బాగా ముందుగానే బయలు దేరాం, ట్రాఫిక్ జామ్ తో ఒక్కో టోల్ గేట్ లో భోగి, సంక్రాంతి, కనుమ చేసేసుకున్నాం... మీ అమ్మాయి, పిల్లలతో తిరిగి హైదరాబాద్ వెళ్లిపోతున్నా... మీ ఆరోగ్యం జాగ్రత్త!



జ్ఞాపకాల దొంతర

- శిరంశెట్టి కాంతారావు,
98498 90322

ఈమధ్య నేనో రోజు ఉదయమే బయలుదేరి చింతూరులో వుండే మిత్రులు సుభాని, వెంకటేష్ గార్ల దగ్గరికెళ్ళాను. వారిద్దరూ చింతూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో వుండే ఆదివాసీల కోసం తమ స్వచ్ఛంద సంస్థల ద్వారా విడి విడి గాను, సంయుక్తంగానూ కూడా పనిచేస్తుంటారు. పరస్పర పరామర్శలు అయిన తరువాత మేమంతా కలిసి నాలుగు చక్రాల వాహనమెక్కాము. అది వెంటనే యమ్.సి.డి. క్యాంప్ దిశగా పరుగందుకుంది.

కొంతసేపటికి వాహనం చిక్కటి అడవి దారి గుండా వెళుతుంటే వనాల మీదుగా కనబడుతున్న నీలాకాశం మహాద్భుతంగా కనబడు తుంది. చల్లగాలి కన్నతల్లి జోల పాటలా స్పర్శిస్తుంటే మనసు పురాస్మృతుల్లోకి వెళ్ళిపోసాగింది.

గంటన్నర రెండు గంటల ప్రయాణం తరువాత ఫోర్బే పక్క నుండి హైడల్ ప్రాజెక్ట్ కాలువకట్ట మీదుగా ముందుకు వెళితే, కుడిచేతి పక్క దిగువన నిశ్శబ్ద సోయగంతో కనువిందు చేస్తూ యమ్.సి.డి. క్యాంప్ ఓ ఋష్యాశ్రమంలా వుంది.

నేనట్లా మైమరచి చూస్తుండగానే మా వాహనం వెళ్ళి గ్రామం మధ్యలో ఆగింది. అనుకున్న ప్రకారం అప్పటికే రంపచోడవరం నుండి ఉద్యానవన శాఖకు సంబందించిన శాస్త్రవేత్తల బృందం ఒకటి అక్కడున్న ఆదివాసీలతో 'జీలుగు కళ్ళు నుండి బెల్లం తయారు చేయించే ప్రయోగాలలో భాగంగా అక్కడికి రావడం జరిగింది.

ఆశాస్త్రవేత్తలతో పరస్పర పరిచయాలైన తరువాత సుభాని గారు అక్కడి గిరిజన పిల్లలకోసం తీసుక్కొచ్చిన చలి కోట్లను పంచి పెట్టడమేకాదు. తనే ఆ పిల్లల్ని దగ్గరికి తీసుకుని ఒక్కొక్కరికీ తొడగసాగాడు. ఉన్ని కోటు వంటి మీదికి చేరగానే వెచ్చగా అన్పించడంతో పిల్లల కళ్ళల్లో సంతోషపు మతాబులు పూస్తుండడంతో తను కూడా ఆ పిల్లల్లో ఓ పిల్లవాడిగా మారిపోయాడు. ఆనందంతో పులకించిపోతున్న సుభానీ గారిని చూస్తుంటే..! మనిషి ఎక్కడ పుట్టి, ఎక్కడ? ఏవిధంగా పెరిగాడు? అన్నదికాదు ప్రశ్న. ఆ మనిషి ఎదుటివారి ఆనందం కోసం ఏమిచేశాడు? ఏవిధంగా చేశాడు? అన్నది మాత్రమే సరి అయిన సమాధానం అవుతుంది. అటువంటి సమాధానానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచినవాడు మాత్రమే నిజమైన మనీషిగా కన్పిస్తాడు కదా? అనుకున్నాను.

ఇంతలో నా దగ్గరికొచ్చిన వెంకటేష్ "నాన్నా! అలా ఊళ్ళో కెళ్ళొద్దామా?" అన్నాడు.

అప్పటిదాకా తనా మాట ఎప్పుడంటాడాని ఎదురుచూస్తున్న నేను, వెంటనే అతణ్ణి అనుసరించాను. ఆ గుంపంతా ఇంగ్లీష్ అక్షరం T ఆకృతిలో వుంది. మేము ముందుగా T పైన వుండే అడ్డగీతకు ఎడమ వైపు నుండి కుడి దిశగా వెళ్లాము. ఊరంతా రాళ్ళ బోడు మీద లేపి వుంది. అక్కడ మొత్తం ఓ నాలుగు రేకులిండ్లు మాత్రమే వున్నాయి. ఇంటికో మేకల కొట్టం కన్పిస్తుంది. సరీగ్గా మాకు ఎదురుగా వున్న ఓ రేకులింటి మీద, ఓ పాత చేటలో ఏవో ఎండబెట్టి కన్పిస్తుండడంతో "అవేంటో చూద్దాం" అనుకుంటూ ఆసక్తితో అక్కడికి నడిచాము.

మమ్ముల్ని చూడగానే అప్పటిదాకా పిల్లవాడికి పాలు కుడుపుతున్న ఆ ఇంటి ఇల్లాలు చప్పున వెనక్కి తిరిగి, పిల్లవాడి ముఖం మీద చీర కొంగు కప్పేసింది. పిల్లవాడికి పాలు కుడుపుతున్న తల్లి రొమ్మును కూడా వక్రదృష్టితో చూసే కాముకుల కళ్ళల్లో పడగూడదన్న అవగాహనతోనే "పాలు తాగే పిల్లల్ని ఇతరులు చూస్తే దిష్టి తగులుతుంది" అన్న ఒక్క మాటలో ఆ నాటి పెద్దలు ఎంత జాగ్రత్తను పొదిగారో ఆలోచిస్తే 'పెద్దల మాట చద్ది మూట' అన్న సామెతలోని సారమేమిటో ఆ క్షణంలో నాకర్థమయ్యింది.

"ఆ చేటలో ఏం ఎండబెట్టారు?" అంటూ మేము అడిగామో లేదో?! ఆ ఇంటి యజమాని వెంటనే రేకుల మీదున్న చేటను తీసుకొచ్చి మా ముందు పెట్టాడు. అవి రాం ములక్కాయల విత్తనాలు. అర్ధ శతాబ్ది తరువాత రాం ములక్కాయల విత్తనాలు నా కంట పడ్డాయన్న ఆనందంతో పాటు, ఈ గిరిజనులింకా వాటి రుచిని ఆస్వాదిస్తుండడంతోపాటు, ఆ పాత విత్తనాలను కూడా సాంప్రదాయ పద్ధతుల్లో కాపాడుకుంటూ రావడం నాకో

మహాద్భుతమే అనిపించింది. కొంతసేపు వాళ్ళతో అట్లా గడిపిన మేము, ఆక్కణ్ణుండి వెనుదిరిగి ఎదురుగా వున్న పెద్ద వీధిలోకి ప్రవేశించాము.



రెండు ఇండ్లు దాటామో లేదో! ఓ ఇంటి ముందు రాగుల కంకి ఆరబోసి వుంది. ఆ రాగులకు ఓ పక్క నున్న రోలు మీద ప్లాస్టిక్ బుట్టలో ఆరబోసిన అనపకాయలు కూడా కనిపించాయి.

ఈ మధ్యకాలంలో సుభానిగారి వాళ్ళతో అప్పుడప్పుడూ తులసిపాక మీదుగా వెళుతున్నప్పుడు ఆ ఊరి కూడలిలో రోడ్డుపక్కన వుండే పప్పుల దుకాణంలో అనుములు కనిపించగానే నా బాల్య కాలంలో కంది చేలల్లో అంతరపంటగా వేసే పచ్చి అనపకాయల్ని కోసుకొచ్చి ఇస్తే, అమ్మ ఉడకబెట్టి పెట్టే జ్ఞాపకాల గుచ్ఛం మనోనేత్రం ముందు జండాలా రెపరెపలాడ సాగింది.

ఆ ఇంటి ఇల్లాలితో మాట్లాడినప్పుడు 'ఇప్పటికీ కూడా మేము ఏ పంట వేయాలనుకున్నా మా తాతల తండ్రుల కాన్నుంచి కాపాడుకుంట వస్తున్న పాత ఇత్తనాలనే మేమూ తయారు చేసుకుంట వాడుకుంటున్నాం" అంటూ వివరించడంతో మాకు ఏనుగును ఎక్కినంత సంతోషంగా అన్పించింది.

* * *



బ్రతుకు పయనం

కవిత

మనకోసం మనం జీవించాలి అనేకంటే,
ఇతరుల కోసం జీవిద్దాం అనుకుంటే,
ఎనలేని ఆనందం , అనుబంధం
నడుస్తాయి తోడుగా మనవెంటే !

జీవితం నేర్పుతుంది బ్రతుకు బాట
కష్టాలు , కడగళ్లు వస్తాయి , దానివెంట
ఆచితూచి వేయాలి అడుగులు నీ వెంట
సృష్టించాలి సంపదలు అనువుగానట !

స్వార్థంతో ముడివడనిదే సంపాదనం
నిజాయితీతో ఆర్జించిందే ఐశ్వర్యం
ధర్మంగా మదుపు చేసిందే విభవం

ఉన్నదాంతో పొందే తృప్తిలోనే ఆనందం
అత్యాశతో సంపాదనం, అనుశోకం

వైభవంగా బ్రతకటం అంటే,
విత్తంపై దృష్టి కాదు...
డాంబికంగా జీవించటం కానే కాదు..
విలువలతో బ్రతుకు బాట సాగించాలి
జీవితంలో కుంగుబాట్లు ఎదురైనా
విలువను కాపాడుకోవాలి..

మానవత్వం నిండుగా వుండాలి
పరుల బాధలు తనవిగా భావించాలి
కష్టాలలో తోడు నీడగా నిలవాలి

కలకాలం ఆత్మీయతలు కురిపించాలి
నిస్వార్థపు ఆలోచనలతో మది నిండాలి
మమతల సుగంధాలు చిలకరించాలి

అర్థం చేసుకునే మనసు
సర్దుకుపోయే మనస్తత్వం
చేయూతనిచ్చే ఔదార్యం
ఓదార్పునిచ్చే హృదయం..
మన బ్రతుకు బాటలో
తోడుండే ఆణిముత్యాలు !
జీవన గమనానికి పూలబాటలు !!

- కరణం హనుమంతరావు
63000 43818

శ్రీ మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ సౌజన్యంతో 'కవి వాక్యం - కథాత్మకం' శీర్షికతో నెల నెలా నిర్వహిస్తున్న కథల పోటీలో బహుమతి పొందిన ఉత్తమ కథ

'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు మచ్చుకైనాలేడు
చూడు మానవత్వం వున్నవాడు - అందెశ్రీ

మసకబారుతున్న మానవత్వం

- డాక్టర్ నగరం వినోద్‌కుమార్
94409 24291

కథ

సర్వీస్ ఆటోలో ఒక మూలగా ఒదిగి కూర్చొని వున్నాడు కేశవయ్య. వయస్సు డెబ్బయి దాటి ఉంటుంది. నున్నటి బట్టతల, గాంధీగారి కళ్ళజోడు, బక్కపీల శరీరం, తెల్లటి ధోవతి, చొక్కా. అవసరం లేక పోయినా అలవాటుగా మారిన వంకీ చేతికర్ర. స్కూలు మాస్టారుగా, హెడ్ మాస్టర్‌గా ఉద్యోగం చేసి పదవీ విరమణ అయ్యి పది సంవత్సరాలు పూర్తయినా "సంస్కారవంతులకు చూడగానే చేతులెత్తి నమస్కరించాలి" అనిపించే హుందాతనం ఉట్టిపడే రూపం ఆయనది. కాకపోతే నేటి సమాజంలో అటువంటి సంస్కారవంతులే కరువైపోతున్నారు.

"ఓ..పెద్దాయనా, రొంత పక్కకు జరిగి సర్దుకొని కూర్చో. ఎక్కేవాళ్ళకు చోటు ఇవ్వవా? ఎన్నిసార్లు చెప్పాలి నీకు?" ఆయన వయస్సుకు, రూపానికి ఏమాత్రం విలువ ఇవ్వకుండా అప్పటికి నాలుగోసారి కసురుకున్నాడు మనుషులను టికెట్ లెక్కన చూసే ఆ ఆటో డ్రైవర్. అప్పటికే పదిమందికి పైగా ప్రయాణికులతో కిక్కిరిసి ఉంది ఆ ఆటో. ఇంకా వీలైనంత మందిని ఎక్కించాలని వాడి తాపత్రయం. కిక్కిరిసిన పాసెంజర్స్‌తో పద్మవ్యూహంలో అభిమన్యుడిలా అడ్డుగా వచ్చిన టూవీలర్స్‌ని బండ బూతులు తిడుతూ దూసుకు పోతున్నాడు. చెవికి, భుజానికి మధ్య సెల్‌ఫోన్ అంటించుకొని అడ్డదిడ్డంగా ఇద్దర్ని, ముగ్గుర్ని ఎక్కించుకొని వెళ్తున్న టూవీలర్స్ ఏమాత్రం తగ్గకుండా అంత కన్నా తీవ్రమైన బూతులు తిడుతూ దూసుకుపోతున్నారు. వయస్సు, సామాజిక స్థాయితో సంబంధం లేకుండా, అందరూ ఒకరికి ఒకరు తీసిపోనట్లు ప్రవర్తిస్తున్నారు..



అతి కష్టం మీద ఆటో బస్టాండ్ చేరింది. కుక్కిన బస్తా నుండి విడివడిన దూది పింజల్లా అందులో ఉన్న ప్యాసింజర్లు పక్కవారిని ఏమాత్రం పట్టించు కోకుండా, ఒక్కసారిగా ఒకర్ని ఒకరు తోసుకుంటూ కిందికి దూకినంత పనిచేసారు. చివరగా దిగిన కేశవయ్య మెల్లగా కళ్ళజోడు సవరించుకొని పక్కన ఆగిన బస్సులలో తాను ఎక్కవలసిన బస్సు కోసం చుట్టూ చూసాడు. ఇటువంటి సందడికి సాధ్యమైనంత దూరంగా వుండే కేశవయ్యకు అత్యవసరమైన కోర్టు పనిమీద పక్కన వున్న సిటీకి

వెళ్లవలసి వచ్చింది. అందుకే ఈ ప్రయాణం.

వచ్చిన ప్రతి బస్సు చుట్టూ జనం ఈగల్లా ముసురుకుంటున్నారు. అందరిలో ఒకటే లక్ష్యం. ప్రతి దానికి నేను ముందు, పక్కవాడు తన శత్రువు అన్న భావం జనాల్లో ఈ మధ్య ఎక్కువౌతున్న ఈ విపరీత ధోరణి చూస్తూ విసిగిపోయిన కేశవయ్య చిన్నగా నిట్టూర్చాడు. జనంలో మనం... జనం కోసం మనం... అంటూ సమాజ హితం గురించి ఆలోచించిన తరం నుండి వచ్చిన ఆయన నేటి సమాజంలో అంటువ్యాధిలా ప్రబలుతున్న ఈ మానసిక జాడ్యాన్ని ఏమాత్రం భరించ లేకపోతున్నాడు. ఈమధ్య తరచూ న్యూస్ పేపర్స్‌లో వస్తున్న "తొక్కిసలాటలో పదుల సంఖ్యలో మరణాలు..." అన్న వార్తలు ఆయన మనసును మరింతగా కలచి వేస్తున్నాయి. ఆయనకు తెలిసినంత వరకు తొక్కిసలాట అన్నది పశువుల్లో మాత్రమే జరుగుతుంది. మరి విచక్షణ జ్ఞానం ఉన్న మనిషి పశువులకన్నా హీనంగా గుంపులు, గుంపులుగా పడి సాటి మనిషిని తొక్కి చంపడం అన్నది ఎంత దారుణమైన విషయం!! దీనికి మూల కారణం మనిషిలో ప్రబలుతున్న స్వార్థం... నశిస్తున్న మానవత్వం.

వెనుక నుండి ఎవరో నెట్టేసరికి ఒక్కసారిగా ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చి తాను ఎక్కవలసిన బస్సును సమీపించాడు కేశవయ్య. కళ్లముందు సీట్ల కోసం మరో తోపులాట. ఒకర్నొకరు నెట్టుకుంటూ, కుమ్ముకుంటూ, తిట్టుకుంటూ... కేవలం గంటలు ప్రయాణం చేసి దిగిపోయ్యే బస్సులో సీట్లు కావాలన్న స్వార్థం... పక్కవాడిని శత్రువులా చూసే స్వార్థం... మానవత్వాన్ని మింగేస్తున్న స్వార్థం... తనకు బస్సులో సీటు దొరుకుతుంది అన్న నమ్మకం ఏమాత్రం లేదు కాబట్టి నిదానంగా బస్సు ఎక్కి కిక్కిరిసిన బస్సులో ఒక మూల నించున్నాడు కేశవయ్య. వృద్ధులకూ, వికలాంగులకు, మహిళలకు సీటు ఇవ్వాలి అన్న సంస్కారం అక్కడ ఎవ్వరిలోనూ కనిపించడం లేదు. కాసేపటి తర్వాత నిండు గర్భిణీలా కదిలింది బస్సు. సీట్లలో సర్దుకున్న జనం పక్కవాడితో సంబంధం లేకుండా ఎవరికి వారు తమ సెల్‌ఫోనులతో బిజీ ఐపోయారు. ఎండ తీవ్రత ఎక్కువౌతోంది. కేశవయ్యకు నీరసంగా ఉంది. బస్సు కమ్మీని గట్టిగా పట్టుకొని నించున్నాడు. జనం మీద మీదికి తోసుకు వచ్చేస్తున్నారు.

ఇంతలో ఒక పెద్ద కుదుపు. బస్సు సడెన్‌గా ఆగింది. రోడ్డుకు ఎడం వైపు అప్పుడే జరిగిన ఒక పెద్ద ఆక్సిడెంట్, సహాయం కోసం పెద్దగా అరుపులు వినిపిస్తున్నాయి. బస్సులోని జనాల్లో ఒక్కటే ఆత్రుత. ఎవరికీ వారు సెల్‌ఫోన్స్‌తో బయటికి ఉరుకుతున్నారు. కిటికీ పక్కన వున్న జనం కిటికీ బయటకు పూర్తిగా వంగి ఆ భయానక దృశ్యాన్ని తమ ఫోన్స్‌లో చిత్రీకరిస్తున్నారు. అప్పుడే జరిగిన ఆ దుర్ఘటన బాగా చిత్రీకరించి ఎంత తొందరగా వీలైతె అంత తొందరగా సామాజిక మాధ్యమాల్లో షేర్ చెయ్యాలన్న ఒక్కటే ఆత్రుత అందరిలో. ఎంతమంది గాయపడ్డారు? తాము ఏ విధంగా తక్షణ సహాయం అందించగలం, కనీసం అంబులెన్సుని పిలుద్దామా... అని ఒక్కరు కూడా ఆలోచించడం లేదు.

"వీడియోస్ చాలా బాగా వచ్చాయిరా. ఇద్దరు స్పాట్ డెడ్. డ్రైవర్ సీట్‌లో ఇరుక్కు పోయాడు. బ్రతకడం కష్టం. అందరికన్నా ముందు ఇన్‌స్టాలో నేనే షేర్ చేశాను. లక్ష వ్యూస్ పక్కా" జీన్స్ ప్యాంటు, టి షర్ట్ వేసుకున్న కాలేజీ కుర్రవాడు మొహం చేటంత చేసుకొని పక్కవాడితో చెపుతున్నాడు.

"ఎప్పుడు నువ్వేనా రా..? అందుకే ఈసారి నేను యు ట్యూబ్‌లో షేర్ చేస్తాను రా. నీతో పోటీ పడలేను రా బాబు" నవ్వుతూ చెపుతున్నాడు పక్కవాడు.

ఇవన్నీ చూస్తుంటే కేశవయ్యకు కడుపులో ఎవరో చెయ్యి పెట్టి కెలుకుతున్న భావన. మనుషుల ప్రాణాలంటే వీళ్లకు ఇంత తేలికా? ఎటుపోతోంది ఈ సభ్యసమాజం? "మాయమైపోతున్నాడమ్మా మనిషన్న వాడు... మచ్చుకైనా లేడు చూడు మానవత్వం వున్నవాడు" అన్న అందెశ్రీ పలుకులు చెవిలో మారుమ్రోగుతుండగా కన్నీటితో మసకబారుతున్న ఆయన చూపులకు "మనుషుల్లో మానవత్వం ఇంకా పూర్తిగా చనిపోలేదు..." అని చెప్పడానికే అన్నట్లు సహాయం చేయడానికి పరుగు పరుగున వస్తూన్న పల్లె ప్రజల గుంపు లీలగా కనిపిస్తోంది.

– – –

శ్రీమక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ సహకారంతో విశాఖ సంస్కృతి మాసపత్రిక నిర్వహిస్తున్న 'కవి వాక్యం కథాత్మకం' అనే శీర్షిక ఒక చక్కని సాహిత్య ప్రయోగం. 'కత్తి కన్నా కలానికి వాడి ఎక్కువ' అన్న సూక్తి జగద్విదితం. తుపాకీ తూటాల్లాంటి ఉద్యమ సూక్తులతో ఎందరో కవులు నాటి భారత యువతలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించారు. అట్టి యువత నేడు సరి అయిన మార్గనిర్దేశనం లేక దారి తప్పుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. నాటి మహనీయుల సూక్తులు నేటితరం మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకోవలసిన అవసరం ఎంతయినా ఉన్న నేటి సమాజంలో, ఇంత చక్కని సృజనాత్మకమైన కథలు పోటీని ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్న శ్రీమక్కెన రామ సుబ్బయ్య ఫౌండేషన్‌కి, విశాఖ సంస్కృతి యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదములు.

'మాయమైపోతున్నాడమ్మ మనిషన్నవాడు... మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు...' అన్న అందెశ్రీ కవి సూక్తికి సజీవ సాక్ష్యాలు మనకు అనునిత్యం కనిపిస్తున్నాయి. అటువంటి వాస్తవ సంఘటన ఆధారంగా రాసుకున్న ఈ చిన్న కథకు ఉత్తమ కథగా గుర్తింపు రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. రచయితగా నా ప్రయాణం ప్రారంభం అయ్యింది విశాఖ సంస్కృతి మాసపత్రిక ద్వారానే అని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను.

– డాక్టర్ నగరం వినోద్‌కుమార్, రచయిత

శ్రీ బండికళ్ళు ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

మాతోనే మీరూ!

- నందిరాజు పద్మలతా జయరాం, 9492921383

ఇంకా తెల్లవారలేదు.

రెమ్మ రెమ్మన పూత నిండిన ఉసిరికొమ్మల్లోనుంచి చొరబడదామని చూస్తున్న సూరీడ్ని అగాగి కమ్ముకుంటున్నాయి నల్లమబ్బులు. అధిక శ్రావణం వెళ్లిపోయి ఇవాల్టికి మూడో రోజు. మొన్నటి దాకా ఆఖర్న మిగిలిన ఆకుల్ని కూడా వదిలించుకుని, తొలి చినుకులకి పులకరించి మొలకలెత్తిన చివురుటాకులు కాసింత చిరుగాలి స్పృశించగానే తమకంగా కదులుతున్నాయి. వసంతం వెళ్ళిపోయినా తనివి తీరని కోయిలమ్మొకటి కుహూ రాగాల కచేరీ మొదలెట్టేసింది. వేసవి దాటినా అక్కడక్కడా విరిసిన మల్లె పరిమళం, మొహమాటంగా కొమ్మలచాటున దాక్కున్నా తావిని దాచలేని ఆకు సంపెంగ. అందమైన తొలిపొద్దు వేళ మొదటి మంగళవారం మంగళగౌరి వ్రతాలు నోచుకోబోయే నవ వధువులు నిద్ర కళ్ళు నలుపుకొంటూ లేస్తున్నారు.



“లేమ్మా పావనీ...! చాలా పనులున్నాయి. వ్రతం చేసుకొని, వాయనాలు ఇచ్చేసరికి ఏ వేళవుతుందో ఏమిటో!” కూతుర్ని మరోసారి హెచ్చరించి, గుమ్మంలో ముగ్గు తీర్చడానికి ఆరుబయటికి దారితీసింది లీలావతి.

“ఏమిటో ఈ పిచ్చి పారిజాతం, తెల్లారేసరికి పరుపు పరిచినట్లే పూలు రాలుస్తుంది. ఏరుకెళ్ళేవాళ్ళు ఏరుకుంటూనే ఉంటారు. కురిసిన పూలు కురిసినట్లే ఉంటాయి.” “గుబాళింపు ఆ మూల దాకా వస్తోంది సుమా! మీ ఇంటికే కాదు, ఈ వీధికి అందం మీ పారిజాతం” అన్నవాళ్ళు అంటూనే ఉంటారు. “ఈ పూలని చీపురుతో చిమ్మనూ లేను. అలా అని ఏరనూ లేను. ఎందుకే నీకింత విరగబాటు? కాసిని పూచీ ఊరుకోలేవూ?” ముద్దుగా పారిజాతపు చెట్టుని కోప్పడుతూ, బాధపడుతూ పూలని చిమ్మి ఓ మూలకి పెట్టి కళ్ళాపి చల్లి, ముగ్గు తీర్చి, నడిమధ్యలో బంతిపూల రెక్కలు, పసుపు కుంకుమలు చల్లి ఇంట్లోకి వచ్చి చూసేసరికి, ఇంకా నిద్రపోతూనే ఉంది పావని.

“ఓసి దెయ్యమా, ఇంకా నిద్రపోతున్నావా? మంగళ గౌరిని నోచేది నువ్వా, నేనా? మొద్దల్లే ఏమిటీ నిద్ర? అక్కడ మీ అత్తారింట్లోనూ ఇలాగే చేస్తున్నావా? ఏడవుతోంది” కూతురి వీపు మీద ఒక్కటిచ్చింది లీలావతి.

“అబ్బా...చంపకమ్మా! మా అత్తగారే నయం. నీలాగా రంకెలేయదు. అసలావిడ నన్ను నిద్ర లేపనే లేపదు. ఎప్పుడు లేచినా ఎంచక్కా కాఫీ అందిస్తుంది. ఆ నోమేదో నువ్వే నోచుకుని నా మీద అక్షంతలెయ్యమ్మా ప్లీజ్. నిద్దరొస్తోంది” అంటూ దుప్పటి కప్పేసుకుంటున్న పావనిని బలవంతాన లేపే నిత్యకృత్యాలలో పడింది లీలావతి.

ఒకప్పుడు నగరానికి దూరంగా విసిరేసినట్లున్న కాలనీ అది. ప్రస్తుతం నగరపు గాలి సోకి ప్రశాంతమైన అక్కడి వాతావరణం కూడా కలుషితమౌతోంది. మూడున్నర దశాబ్దాల క్రితం లీలావతి, తల్పశాయి దంపతులిద్దరూ పైసా పైసా దాచి కట్టుకున్న చిన్న ఇల్లు కాలక్రమంలో వాళ్ళ సంసారంలాగే పెరిగి మరో అంతస్తును పేర్చుకుంది.

నాలుగొందల గజాల స్థలంలో మామిడి, సపోటా, ఉసిరి, కొబ్బరి, జామ లాంటి పెద్ద చెట్లతో పాటు జాజులు, మల్లెలు, సంపెంగలు, గన్నేరు, నంది వర్ధనం, గరుడవర్ధనం లాంటి పూల చెట్లు, వాటిలో ఆవాసమున్న పిట్టలు, ఉడుతలు మాత్రమే కాక తీయని పాలసపోటాలని రాత్రుళ్లొచ్చి ఫలహారం చేసే గబ్బిలాలు కూడా ఆ ఇంటి సభ్యులే. తల్పశాయిగారి స్వభావం వల్లనో, ఆయన దయగల దృష్టి వల్లనో పక్షులు, జంతువులూ ఆయనకి బాగా మచ్చికవుతాయి. ఆయన్ని నమ్ముతాయి. వసారాలో ఏర్పాటు చేసిన అట్టపెట్టెల గూళ్ళల్లో డజన్ల కొద్దీ పిచ్చుకలు, గోరింకలు కాపురాలు చేస్తూంటాయి. కుక్కపిల్లలూ, పిల్లిపిల్లలూ ఆహారం కోసం వారింటి గేటు ప్రక్కనున్న మూకుడు దగ్గరే తిరుగుతాయి. ఆయన అదృష్టం కొద్దీ మొక్కలంటే ప్రాణం పెట్టే లీలావతి ఆయన ఇల్లాలయింది. వాళ్ళ ముగ్గురు పిల్లల్లో పెద్దబ్బాయి, ఆ తర్వాత అమ్మాయి పెళ్ళిళ్ళయి దూరంగా ఉంటుండగా, చిన్నవాడు మనోహర్ తల్లిదండ్రులతో పాటే ఉంటున్నాడు. వారింటి ప్రక్కనున్న మరో రెండు నాలుగొందల గజాల జాగా ఇంకా ఇంటి నిర్మాణాలు జరగక పోవడం వలన పెరిగిన చెట్లతో అడవిలాగా ఉంటుంది. ఒకటా, రెండా? రేగి, వెలగ, శీతాఫలం లాంటి వాటితో పాటు వేప, సరుగుడు, గోరింట, మారేడులాంటి చెట్లతో చిత్తువొత్తుగా పెరిగి అదంతా ఓ చిట్టడవిలా తయారయింది. కాసింత నీడైనా దొరకని రకరకాల పక్షులకి అదో పునరావాస కేంద్రం. తల్పశాయిగారి ప్రమేయంతో ఆ స్థలాలకి ప్రహరీ కట్టించాడు వాటి యజమాని. అందులో గూళ్ళు కట్టుకోగల కాకులు, గిజిగాడు లాంటి పక్షులకి, గూళ్ళు కట్టుకోవడం తెలియని పక్షులకే కాక, తొండలు, ఉడతలు కూడా హాయిగా కాలక్షేపం చేస్తూ తల్పశాయిగారింటినే పర్ణశాలగా మార్చేశాయి.

– – –

మొదటి శ్రావణ మంగళవార పూజ సలక్షణంగా చేసుకుంది పావని. సాయంత్రం టీ టైంలో ముగ్గురు పిల్లలనీ చుట్టూ కూర్చోబెట్టుకుని సోఫాలో కూర్చున్నారు లీలావతి, తల్పశాయిలు.

"ఏంటి నాన్నా, ఏదో ముఖ్య విషయం అన్నారు. దేని గురించి? నేను, మనోహర్ ఇద్దరం సెలవు కూడా పెట్టామందుకే!" అడిగాడు పెద్దవాడు మోహన్. పావని, మనోహర్ కూడా ప్రశ్నార్థకంగా చూడసాగారు.

"అవసరముంది. ఓ కోటి రూపాయలు కావాలిరా... సర్దగలరా?!"

విచిత్రంగా అనిపించింది వాళ్లకి. ఇన్నేళ్లల్లో ఒక్కసారైనా తల్లితండ్రులు రూపాయి కూడా అడగలేదు. ఇవ్వడం తప్ప తీసుకునే అలవాటు, అవసరం రెండూ వాళ్లకి లేవు. కనుకనే, తండ్రి ప్రశ్న ఆశ్చర్యంగా అనిపించింది.

"చెప్పండి. ఎవరెవరు ఎంతెంత ఇవ్వగలరు? అప్పుగా కాదు. మేమున్నంత వరకూ అది తీర్చేంత స్థోమత నాకుండకపోవచ్చు. 'ఎందుకు' అని అడగకండి. నేను చెప్పలేను. 'ఇంత ఇవ్వగలం' అని మీరు చెప్తే, మిగిలిన డబ్బు నేను ఏదో రకంగా బయట ప్రయత్నిస్తాను."

ముగ్గురు పిల్లలూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు. తల్లి వంక ప్రశ్నార్థకంగా చూసారు. ఆవిడ ముఖంలోనూ తమలాంటి ప్రశ్నే కనిపిస్తోంది.

"నేను ఉద్యోగం చేస్తోంది ఈ రెండేళ్లనుంచేగా నాన్నా...! మహా అయితే పది లక్షలు సర్దగలనేమో!" చెప్పాడు మనోహర్.

"నేనూ అంతకన్నా ఇవ్వలేను నాన్నా! పిల్లలిద్దరి స్కూల్ ఖర్చులు, ఇంటి లోన్, కారు లోన్ కట్టగా మిగిలేది ఏదో బొటా బొటి..." మోహన్ మాట పూర్తవకుండానే, పావని అందుకుంది.

"నేను, మీ అల్లుడు వైష్ణవ్ ఓ పది దాకా సర్దగలం నాన్నా...! అయినా కారణం చెప్పకపోతే ఎలా చెప్పండి? స్వంత ఇల్లు కనుక అద్దె కట్టక్కర్లేదు. మీకు పెన్షన్ వస్తోంది. ఆరోగ్య భీమా ఉంది. అసలేమిటి సమస్య?"

"ప్చ్చ్....కాదు లే....! మీరిచ్చేది అస్సలు సరిపోదు. వదిలేయండి." కాస్త నిస్పృహ తల్పశాయి కంఠస్వరంలో.

"మరి, నన్నడగరేంటి?" లీలావతి ప్రశ్నకి పక్కున నవ్వారందరూ.

"అయ్యో అలా కోపంగా చూడకే అమ్మా! పోవులడబ్బాల్లో, దేవుడి హుండిలో, ఆల్మారాలో చీరల క్రింద దాచింది మొత్తం కలిసి ఓ కోటి దాకా ఉంటుందంటావా?" వేళాకోలమాడింది పావని. అందరితో పాటు మోహన్ భార్య కూడా నవ్వేసరికి నిజంగానే కోపమొచ్చి గిరుక్కుని లేచివెళ్ళిపోయింది లీలావతి.

ఎవరెంత అడిగినా కారణం చెప్పలేదు తల్పశాయి.

– – –

మూడునెలలు గడిచాయి.

"ఏమిటి నాన్నా? నేను విన్నది నిజమేనా?" ఇంట్లోకి వస్తూనే తండ్రిని ప్రశ్నించాడు మోహన్.

హై టెక్ సిటీ నుంచీ ప్రయాణం చేసి వచ్చిన అలసటకన్నా, తండ్రి చేసిన పని గురించిన ఆత్రమే ఎక్కువుందతనికి.

"ఏం విన్నావురా? ఏమిటా హడావుడి కూర్చో! మంచినీళ్లు తెస్తానాగు." చాలా రోజుల తర్వాత కొడుకు ప్రత్యక్షమవడం లీలావతికి ఆశ్చర్యమనిపించింది.

"దేని గురించి అన్నయ్యా?" అడిగాడు మనోహర్

"అది చెప్పాల్సింది నాన్న. చెప్పండి... గుంటూరులో ఇల్లు అమ్మారటగా? ఎందుకలా చేశారు?" మోహన్ అడిగాడు

"అవునా?" అన్నట్లు చూసాడు మనోహర్ ఆశ్చర్యంగా.

"అదొక్కటే కాదు, నా నగలు, లింగంపల్లిలో ఉన్న ప్లాట్ కూడా అమ్మేశారు" చెప్పింది లీలావతి.

"అరే! నిజమా నాన్నా...? ఇంట్లోనే ఉన్నా నాకు తెలీలేదే? ఎందుకలా చేశారు?" మనోహర్ ఆశ్చర్యపోయాడు.

"మీకు ఇంకో కొత్త విషయం కూడా చెప్తాన్రా! నా రిటైర్మెంట్ డబ్బు మొత్తం పైసా కూడా మిగల్చకుండా ఖర్చు పెట్టేశాను."

నింపాదిగా అన్నాడు తల్పశాయి.

ఖంగు తిన్నారు మోహన్, మనోహర్లిద్దరూ. తండ్రికేమైనా పిచ్చి పట్టిందా, ఏ గుర్రప్పందాల్లోనే, షేర్లల్లోనో పెట్టిశాడా. ఎవరికైనా అప్పిచ్చాడా? అసలేమీ అర్థం కావట్లేదు వాళ్లకి.

"మాకు చెప్పకుండా, ఇంత పెద్ద నిర్ణయాలు తీసుకోవచ్చా నాన్నా? కనీసం ఈ ఇల్లయినా ఉంచారా, అదీ అమ్మి పారేశారా?" చాలా కోపంగా ఉంది మోహన్‌కి.

"అన్నయ్యా.. ఊరుకో...! ఇవన్నీ నాన్న కష్టార్జితాలేగా! నిర్ణయం తీసుకోవచ్చు. కానీ, నాన్నా! కారణం చెప్పి ఉంటే బావుండేది." తండ్రి ప్రక్కనే కూర్చుని ఆయన చేతులు పట్టుకున్నాడు మనోహర్.

"అయినాయా ... ఇంకా ఉన్నాయా ప్రశ్నలు? ఒక్క నిమిషం ఆగండి" అంటూ లోపలికి వెళ్లి ప్లాస్టిక్ ఫోల్డర్‌లో పెట్టిన కాగితాలు మోహన్ చేతికిచ్చాడు తల్పశాయి.

అన్నదమ్ములిద్దరూ ఆత్రంగా చదివారు. తాత్కాలిక రసీదు, సేల్ డీడ్ జిరాక్స్ కాపీలు కూడా ఉన్నాయి అందులో.

"అమ్మా...! నీకూ తెలియదేమో కదా...? నాన్న మన ప్రక్కనున్న స్థలం కొన్నారు. నిన్ననే రిజిస్ట్రేషన్ అయింది." చెప్పాడు మోహన్.

"అమ్మో మూడు కోట్లు, అంత పెట్టి కొన్నారా? ఉన్నదంతా ఊడ్చిపారేస్తే , రేపటి నుంచి ఏం తిని బ్రతుకుతాం? రోగమో, రొష్టో వస్తే ఎలా? ఎంత పని చేశారండి?" ఏడుపొచ్చేసింది లీలావతికి.

"తప్పు చేశారు నాన్నా? గుంటూర్లో ఇల్లు నాకు, లింగుపల్లి ప్లాట్ తమ్ముడికి ఇస్తానన్నారు. మర్చిపోయారా? రేపు పావని వచ్చి అడిగితే ఏం చెప్తారు" బాధగా అన్నాడు మోహన్,

"ఎవరికి ఏం చెప్పాలో, అది చెప్పేశానులేరా! మీకు తెలిస్తే పడనివ్వరని తెలిసే జాగ్రత్తలు తీసుకున్నాను." ఆయన మాటలు అర్థం కాలేదెవ్వరికీ.

"చెప్పారా? ఎవరికి చెప్పారు? ఏం చెప్పారు?" ఆయోమయంగా ఉంది లీలావతికి.

"మీకు భయం లేదని మనతో జీవిస్తున్న జీవులకి చెప్పా!" అంటున్న తల్పశాయిని అడ్డుకున్న మనోహర్... "అంటే. నాన్నా...! ఆ స్థలాన్ని రియల్ ఎస్టేట్ వాళ్ళకిస్తే మనకో ఆరేడు ప్లాట్స్ వస్తాయని చేసుంటారు కదూ ఈ పని?" అడిగాడు.

"కాదు. ఆ పనెక్కడ చేస్తారోననే భయంతోనే కొన్నానురా దాన్ని."

"అదేంటి? మరేం చేస్తాం ఆ స్థలాన్ని?" అయోమయంగా అడిగాడు మోహన్,

"ఏమీ చేయను. ఒక్క చెట్టుని కూడా కూల్రదోయకుండా, ఒక్క పిట్టకి కూడా అన్యాయం జరగకుండా, వాటి గూళ్ళు చెదరకుండా అలాగే ఉంచుతాను. కొన్ని వందల పక్షులకి, ఉడుతలకి నీడని, గూడుని ఇచ్చి కాపాడే ఈ చిట్టడవిని కాపాడుకుంటాను. మనం బీపీ షుగర్లు లేకుండా ఉండడానికి కారణం ఈ పచ్చని ప్రకృతి, నులివెచ్చని సూర్యకాంతి. చెట్లనీ, పుట్టల్నీ, కుంటల్నీ, చెరువుల్నీ అన్నింటినీ మనిషి అక్రమిస్తోంటే పాపం ఈ జీవులెటుపోవాలి? ఏం? భూమి మనిషిది మాత్రమేనా? నేను చేసింది తప్పా లీలా?" అడిగాడు తల్పశాయి.

"తప్పేమీ కాదండి! కానీ, మన తర్వాతయినా ఆ స్థలం అమ్మకుండానో, భవనం కట్టకుండానో ఉంటారా మన పిల్లలు? ప్రాణుల్ని సృష్టించిన దేవుడే, వాటికి ఉపాధినీ, తిండిని కల్పిస్తాడు." లీలావతి ఇంకా ఏదో అనబోతూ ఉండగానే ఆమెను ఆపాడు తల్పశాయి.

"కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన" అన్నాడు గీతాకారుడు. నా తర్వాత ఏమవుతుందో అని ఆలోచిస్తూ ఇప్పటి నా బాధ్యతని వదిలించుకోలేనోయ లీలా.. సాగనీ ఇలా... నేనున్నాళ్ళూ."

"మీరేం మాట్లాడుకుంటున్నారో నాకైతే అర్థం కావట్లేదమ్మా! మనూ నీకేమైనా తెలుసా?" తమ్ముడిని అడిగాడు మోహన్.

"వాడికి తెలిసే అవకాశం లేదులేరా మోహన్. ఆరోజు..." దాదాపు మూడు నెలల క్రితం జరిగిన ఘటన కొడుకులకి చెప్పసాగింది లీలావతి.

"మన ఇంటి పక్క ఖాళీ స్థలం యజమాని కొడుకు శ్రీనివాస్ వచ్చాడు. అతడు డాక్టరట. తన తండ్రి చనిపోయాడని, ఆయన కొని ఉంచిన ఈ స్థలాలను అమ్మి, సిటీలో మరోచోటెక్కడో స్వంత హాస్పిటల్ తెరవాలన్న సంకల్పంతో ఉన్నానని, వీటిని కొని డెవలప్ చేసుకొనేందుకు మంచి రియల్ ఎస్టేట్ కంపెనీ సిద్ధంగా ఉందని చెప్పి, ముప్పయ్యేళ్ళ నుంచీ దీన్ని సంరక్షిస్తున్న మీకు కనుక కొనే ఉద్దేశ్యముంటే చెప్పమని" అడిగాడు. దాదాపు మూడు కోట్ల డబ్బు వెచ్చించే స్థోమత మనకెక్కడిది అని నేను తిరగ్గొట్టేశాను."

"తట్టుకోలేక పోయానురా...! క్రూరమృగాలు జనావాసాల్లోకి వస్తున్నాయని బాధపడు తున్నాం. నీటిలో నుంచీ మొసళ్ళు ఇళ్ళల్లోకొస్తున్నాయని భయపడుతున్నాం. అవి బ్రతికే అవకాశమే లేకుండా చేస్తున్న మన కన్నా క్రూరమృగాలెక్కడైనా ఉంటాయిట్రా? కళ్ళుమూసుకుంటే చాలు, ఆ పక్షులన్నీ నాచుట్టూ గింగిరాలు తిరుగుతూ ఏడుస్తున్నట్లు, వృక్షాలన్నీ ఒక్కటొక్కటిగా కూలుతూ నన్ను ప్రశ్నిస్తున్నట్లు అన్పించింది. ఒక్కపూటే తిని కూడా బ్రతికగల మేము ఈ ప్రాణుల కోసం ఈ మాత్రం చేయలేనా అనిపించింది? మాతోనే మీరూ అనుకున్నాను. కొనేశాను." తండ్రి గొంతులోని తడికి, పిల్లల కళ్ళు చెమర్చాయి. గుండెలు బరువెక్కాయి.

"మీరు మంచి పనే చేశారు నాన్నా...!" చెప్పాడు పెద్దకొడుకు మోహన్.

"ఎలాటి అనుమానం పెట్టుకోవద్దు నాన్నా! మేము కూడా ఆ స్థలాన్ని అలాగే ఉంచుతాం. మనస్ఫూర్తిగా చెప్తున్నా..!" మనోహర్ మాటలతో తానూ ఏకీభవిస్తున్నట్లు తలూపాడు మోహన్.

అవునన్నట్లుగా భర్త చేతిలో చేయి వేసింది లీలావతి.

"థ్యాంక్స్ రా...!" తృప్తిగా అన్నాడు తల్పశాయి. * * *

(శత వసంతానికి స్వాగతం-12)

ఏయూ డాక్టరేట్లలో కళింగాంధ్రులు వీరే!

- డా. జి. లీలావరప్రసాదరావు, 83095 19615

ఆంధ్ర విశ్వవిద్యాలయం..... ఆ పేరులోనే తెలుగు జాతి చరిత్ర ఇమిడి ఉంది. ఆ పిలుపులోనే తెలుగు వారి ఖ్యాతి వినిపిస్తోంది. తరతరాలకు తరగని విద్యా సుగంధంగా, అరవై కళలకు నిండైన భాండాగారంగా నిలుస్తున్న ఈ విద్యల గని, ఆంధ్రుల మేథో సామ్రాజ్యానికి విశిష్ట చదువుల కోట అని చెప్పవచ్చు. కృష్ణమ్మ చెంతన బెజవాడలో 1926 ఏప్రిల్ 26న ఏర్పడిని ఆంధ్రవిశ్వకళాపరిషత్, 1930 సెప్టెంబరు 5వ తేదీన సాగరతీరం చెంతన విశాఖకు చేరింది. దినదినాభివృద్ధి చెందుతూ తెలుగువారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసింది. బోధన, పరిశోధన, పరిపాలనలో మేటిగా, తనకు తనే సాటిగా నిలుస్తూ ఉన్నత విద్యా రంగాన ఇతర సంస్థలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఎందరో మేథావులను, పరిపాలనాదక్షులను, శాస్త్రవేత్తలను అందించిన ఏయూ, అంతే రీతిలో దేశఖ్యాతిని వివిధ రంగాల్లో ఖండాంతర వ్యాప్తి చేసిన ఎంతోమంది మహనీయులను గౌరవిస్తూ డాక్టరేట్లుతో ఏటా సత్కరిస్తుంటుంది. ప్రజాసేవతో పాటు శాస్త్ర, సాంకేతిక, కళా, విద్యా, సేవ, న్యాయ, సాహిత్య, క్రీడా తదితర రంగాలకు చెందిన ప్రముఖులను గౌరవ డాక్టరేట్లును ప్రదానం చేస్తుంటుంది. ఇప్పటి వరకూ జరిగిన స్నాతకోత్సవాల్లో సుమారు 350 మందిని ఈ విధంగా గౌరవించగా అందులో తెలుగువారు, ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందినవారు కూడా ఎంతో మంది ఉన్నారు. 1927లో జరిగిన తొలి స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా దేశం గర్వించదగిన విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణ హాజరుకాగా ముగ్గురు ప్రముఖులను గౌరవ డాక్టరేట్‌లతో సత్కరించింది. మద్రాస్ విశ్వవిద్యాలయం ఉపకులపతి, దివాన్ రాహూబహూదూర్ ఆర్.వెంకట రత్నం నాయుడు, విజయనగరం మహారాజా కళాశాల అప్పటి ప్రిన్సిపాల్ దివాన్ రాహూబహూదూర్ కె.రామానుజాచారిలకు డి.లిట్‌లను ప్రదానం చేయగా వేదం వెంకట శాస్త్రి నాయుడుకు కళాప్రపూర్ణతో గౌరవించింది.

మరోవైపు సర్ సి.వి. రామన్, విక్రం సారాభాయ్, మథరథెరీసా, థలైలామా, మోక్షగుండం విశ్వేశరయ్య, మాజీ రాష్ట్రపతులు వి.వి. గిరి, నీలం సంజీవరెడ్డి, జ్ఞాని జైల్‌సింగ్, అబ్దుల కలామ్, మాజీ ప్రధానులు మెరార్జీ దేశాయ్, ఇంధిరాగాంధీ, పీవీ నరసింహరావు, తెలుగు రాష్ట్రల మాజీ ముఖ్యమంత్రులు బెజవాడ గోపాలరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, బూర్గుల రామకృష్ణరావు, ఎన్టీ రామారావు, కె.రోశయ్య, సాహితీవేత్తలు దేవులపల్లి కృష్ణశాస్రి, విశ్వనాథ సత్యన్నారాయణ, గుర్రం జాషువా, సినీ ప్రముఖులు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు, కొంకరి జగ్గయ్య, దాసరి నారాయణరావు, ఘట్టమనేని కృష్ణ, ఎస్పీ బాలసుబ్రమహ్మణ్యం, మెగస్టార్ చిరంజీవి, జర్నలిస్టు ప్రముఖులు కాశీనాథుని నాగేశ్వరావు, నార్ల వెంకటేశ్వరరావు, కుష్వంతసింగ్, రామోజీరావు ఇలా ఎందరో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి గౌరవాన్ని అందుకొని తమ పేరు ముందు డాక్టర్ అని పిలుపుంచుకున్నవారే.

అదే కోవలోకి చేరారు ఎంతోమంది ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖులు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న ఆంధ్రవిశ్వవిద్యాలయం, దేశ వ్యాప్తంగా ఉన్న మేథావులు, చైతన్యకారులు, సామాజిక వేత్తలను గౌరవించినట్లే ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారిలో కొంతమందిని కూడా డాక్టరేట్లుతో గౌరవించింది. వారి గురించి, ఆయా రంగాలకు వారు సేవల గురించి ఒకసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

వీరిలో ప్రథమంగా విజయనగరం మహారాజా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ దివాన్ రాహూబహూదూర్ కె.రామానుజా చారిలకు డి.లిట్‌ను ఏయూ ప్రదానం చేసింది. అదేవిధంగా ఉత్తరాంధ్రకు చెందిన పలువురు ప్రముఖులకు కూడా డి.లిట్ డాక్టరేట్‌లతో ఏయూ గౌరవించింది. ఆర్ట్స్ మరియు సామాజిక రంగాలకు చెందిన వారిని ఈ డి.లిట్‌ను ప్రదానం చేస్తుంటారు. జైపూర్ మహారాజు విక్రం దేవ్ వర్మకు 1934లో, బొబ్బిలి

మహారాజు ఆర్.ఎస్.కె. రంగారావుకు 1937లో, మద్రాస్ ప్రెసిడెన్సీ తొలి ప్రభుత్వ కార్యదర్శి సర్ సొంటి వెంకట రామూర్తికి 1946లో, విద్యావేత్త లక్కరాజు సుబ్బారావుకు 1953లో, మాజీ రాష్ట్రపతి వరహా వెంకట గిరికు 1967లో, విజయనగర సంస్థాన వారసులు, మాజీ మంత్రి పివిజి రాజుకు 1972లో, ప్రముఖ ఎడిటర్, మొదటి ప్రెస్ కమిషన్ సభ్యులు మానికొండ చలపతి రావుకు 1974లో, భాషాశాస్త్రవేత్త ఆచార్య ఎస్.వి.జోగా రావుకు 1984లో, ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లిఖార్జున రావుకు 2009లో ఈ డిలిట్‌లను ఏయూ ప్రదానం చేసింది.

ఇక సంఘసేవ, సంగీతం, నాటకం, చిత్రకళ, శిల్పం, సాహిత్యం, ఓరియెంటల్ లాంగ్వేజు, ఫైన్ ఆర్ట్స్ రంగాల్లో విశేష ప్రతిభ కనపరిచిన వారికి కళాప్రపూర్ణతో సత్కరిస్తుంటారు. ఈ విధంగా ఏయూచే గౌరవించబడిన కొంతమంది ఉత్తరాంధ్రకు చెందిన విశిష్ట వ్యక్తుల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం... ఏయూ నుంచి కళాప్రపూర్ణ అందుకున్నవారిలో సంఘసంస్కర్త, సాహితీవేత్త, మహామహోపాధ్యాయ బిరుదాంకితులు తాతా సుబ్బరాయశాస్త్రిను ముందుగా చెప్పుకోవచ్చు. ఈ పండితునికి 1937లో కళాప్రపూర్ణ డాక్టరేట్‌తో ఏయూ గౌరవించింది. తర్వాత వ్యవహారిక భాషాద్యోమ నేత, ప్రముఖ సాహితీ వేత్త గిడుగు వెంకటరామూర్తిని 1938లో ఆంధ్రవిశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణతో గౌరవించింది. జైపూర్ మహారాజు విక్రం దేవ్ వర్మకు కూడా 1941లో కళాప్రపూర్ణ డాక్టరేట్‌ను ఏయూ ప్రదానం చేసింది. 1947లో ప్రముఖ సాహితీవేత్త వజ్జల చిన సీతా రామ శాస్త్రికు, మరియు తెలుగులో తొలి పిహెచ్‌డి గ్రహీత, సాహితీ వేత్త చిలుకూరి నారాయణరావుకు, 1948లో ప్రముఖ కవి త్రిపుర వెంకటసూర్య ప్రసాదరావు, 1950లో వయోలిన్ విద్వాంసుడు ద్వారం వెంకట స్వామినాయుడుకు, 1965లో ప్రముఖ రచయిత, సినీ నటులు గిడుగు సీతాపతికు, 1973లో ప్రముఖ రచయిత, అనువాదకులు పురిపండ అప్పలస్వామికు, 1975లో ప్రముఖ తెలుగు భాషా శాస్త్రవేత్త, కవి గంటి జోగి సోమయాజికు, 1978లో కర్ణాటక సంగీత విద్వాంసులు, వైద్యులు శ్రీపాద పినాకపాణికు, 1985లో ప్రముఖ సాహితీవేత్త, సినీ గేయ రచయిత ఆరుద్రకు, 1993లో ప్రముఖ రంగస్థల నటుడు, శ్రీకృష్ణపాత్రకు వన్నెతెచ్చిన పీసపాటి నరసింహామూర్తికు, 1997లో ప్రముఖ నేపథ్య గేయని పి.సుశీలకు, ప్రముఖ చిత్రకారుడు అంట్యాకుల పైడిరాజు కళాప్రపూర్ణ డాక్టరేట్‌లతో ఏయూ సత్కరించింది.

అదేవిధంగా ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, యూజీసీ మాజీ వైస్ ఛైర్మన్ ఆచార్య బి.రామచంద్రరావును 1969లో, ప్రముఖ ప్రసూతి వైద్యనిపుణురాలు హెచ్.ఎం.లాజరస్‌కు 1971లో డాక్టరేట్ ఆఫ్ సైన్స్‌తో ఏయూ సత్కరించింది. శాస్త్ర, సాంకేతిక, వైద్య రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ గౌరవ డాక్టరేట్ ఇస్తుంటారు. ప్రముఖ విశిష్ట రాజకీయ వేత్తలు, స్వాతంత్ర్య సమరయోధులు తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్నలు కూడా ఏయూ నుంచి డాక్టరేట్లు అందుకున్నారు. తెన్నేటికి 1978లో, గౌతులచ్చన్నకు 1997లో ఎల్.ఎల్.డి డాక్టరేట్లును ఏయూ అందజేసి రాజకీయ, ప్రజాసేవా రంగాన వారి సేవలను గౌరవించింది. ఇక న్యాయ రంగంలో 'డాక్టర్ ఆఫ్ లా' గౌరవాన్ని ప్రముఖ న్యాయకోవిధులు, రాజ్యాంగ సమీక్ష మాజీ సభ్యులు జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య ఏయూ నుంచి 1990లో అందుకున్నారు. ప్రముఖ ఆర్థికరంగ పరిశోధకులు, అధ్యాపకులు ఆచార్య గోగుల పార్థసారథికు 1990లో డాక్టర్ ఆఫ్ లెటర్స్‌తో ఏయూ సత్కరించింది.

కాగా, ఉత్తరాంధ్ర అల్లుడు అయిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సుంకరి వెంకట ఆదినారాయణకు కూడా ఏయూ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. డా.ఆదినారాయణకు ఇటీవలే కేంద్రప్రభుత్వం పద్మశ్రీ కూడా ప్రకటించింది.

ఇలా, పలువురు ప్రముఖులు ఏయూచే డాక్టరేట్‌లుగా గౌరవించబడి ప్రత్యక్షంగా, పరోక్షకంగా ఆ అవార్డుల ఖ్యాతిని పెంచడమే కాకుండా, ఆంధ్రవిశ్వవిద్యాలయం విశిష్టతను కూడా పెంచినవారు అయ్యారు. భవిష్యత్‌లో మరింతమంది ఈ నేల నుంచి డాక్టరేట్లు అందుకోవాలని, ఉత్తరాంధ్ర నేల ఖ్యాతిని పెంచాలని ఆశిద్దాం!!!

* * *



విశాఖ సంస్కృతి

వరల్డ్ తెలుగు కార్టూనిస్టుల పేజీ














ఏమండీ! మీకెన్నిసార్లు చెప్పాలి? ఫోన్ చూసేటప్పుడు కళ్లజోడు పెట్టుకోమని
నేను కళ్లజోడు పెట్టుకునే ఉన్నాను. నువ్వే కళ్లజోడు మర్చిపోయావు నా బల్ల మీద!

అయ్యో! మీ మతిమరుపు మండా! టిఫిన్ తిన్నాక బ్రష్ గుర్తొచ్చిందా?


ఐస్‌క్రీమ్ ఇంద.. బజార్లో మర్చిపోకుండా కొన్నాను. కాని కొన్నట్లు మర్చిపోయా!
Omkar.


మనం ఎపుడో బ్రేకప్ చెప్పుకున్నాంగా!!

మతిమరుపు అనేది దేవుడు మనకిచ్చిన వరం. ఏ విషయమైనా ఇట్టే మరిచి పోవచ్చు!!


మనం ఎక్కవలసిన ట్రైన్ ఎప్పటికీ రాదు
-DANA

కనుమరుగవుతున్న కళింగాంధ్ర జానపద కళ - జముకుల కథ

- బద్రి కూర్మారావు,
83090 77607

జానపదం : జనపదం అనగా పల్లె, పల్లెలో ఉండే ప్రజలు ఆడుకునే ఆటలు, పాడు కునే పాటలు జానపద కళలు, సాహిత్యం, సామెతలు, కథలుగా రూపుదిద్దుకున్నాయి. జానపద కళలు ప్రపంచమంతటా విస్తరించివున్నాయి. భారతదేశం వ్యవసాయక దేశం అగుటచే అనేక వృత్తులతోపాటు జానపదకళలు ఆవిర్భ వించాయి. అటు కశ్మీర్ నుండి ఇటు కన్యాకుమారి వరకు ఎన్నో జానపద కళలున్నాయి. రైతులు, శ్రామికులు తమ శ్రమను మర్చిపోవడానికి ఎన్నో పాటలు పాడుకున్నారు. ముఖ్యంగా స్త్రీలు ఎంతో జానపద సాహిత్యాన్ని సృష్టించారు.

సినిమాలు, టీవీలు లేనిరోజుల్లో జానపద కళాకారులు ప్రజలకు భారతం, రామాయణం, భాగవతం వంటి పౌరాణిక ఇతిహాసాలు వినిపించారు. ఈ కళలు విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించాయి. వీరు నిరక్షరాస్యులైనా వారసత్వంగా తమకు సంక్రమించిన మౌఖిక సాహిత్యాన్ని ప్రజలకు అందించి రంజింపజేశారు. సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఈ కళలు ఎంతగానో తోడ్పడ్డాయి.

సంస్కృత కవి కాళిదాసుతోపాటు అన్నమయ్య వరకు అందరూ జానపదాలుచే ప్రభావితం అయిన వారే. భారత రత్న బిస్మిల్లాఖాన్ (షెహనాయి) వంటి ప్రఖ్యాత భారత సంగీత కళాకారులు జానపద కళలచే ప్రభావితం అయినవారే. ఇటీవల భారతదేశాన్ని సందర్శించిన చైనా దేశపు ప్రథమ మహిళ పెంగ్‌లియాన్ మంచి జానపద గాయని. చత్తీస్‌గఢ్‌కు చెందిన తీజన్‌బాయి తన మాతృభాషలో పాండవుల కథ చెప్పి ప్రపంచ ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల నోబుల్ బహుమతి అమెరికాకు చెందిన జానపద గాయకుడు బాబ్‌డిలాన్‌కు ఇవ్వడం జానపదాలకు పట్టం కట్టడమే.

ప్రాచీన కావ్యాలలో : మహాభారతంలోని అనేక ఉపాఖ్యానాలకు ప్రజాగీతాలే మాతృకలని విమర్శకుల అభిప్రాయం. పాల్కురికి సోమనాథుని బసవపురాణం, నన్నెచోడుని కుమారసంభవం, శ్రీనాథుని క్రీడాభిరామంలో అనేక జానపద కళల ప్రస్తావన ఉంది.

బంకించంద్రచటర్జీ వ్రాసిన వందేమాతరం గీతానికి ఒక జాలరి పాడుకున్న పాటే ప్రేరణ అంటే ఎంతో ఆశ్చర్యం కలుగక మానదు. గరిమెళ్ల సత్యనారాయణ గారి మాకొద్దీ తెల్లదొరతనం, గురజాడ అప్పారావుగారి దేశంను ప్రేమించుమన్నా గీతాలకు జానపదాలే ప్రేరణ. సినిమాలలో ఎన్నో జానపద పాటలను బాణీలుగా ఉపయోగించుకున్నారు. వామపక్ష ఉద్యమాలకు, పాటలకు జానపదాలే ఆధారం. లక్షలాది కళాకారులకు ఉపాధి చూపింది ఈ రంగం. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజానాట్యమండలి ఆ కోవకు చెందినదే.

చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం : తెలుగు ప్రజలు నివసిస్తున్న ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలలోను, సరిహద్దు రాష్ట్రాలలో నివసిస్తున్న తెలుగు ప్రాంతాలలో తోలు బొమ్మలాట,

బుర్రకథ, గొల్లసుద్దులు, గంగిరెద్దులాట, తప్పెటగుళ్లు, చెక్క భజనలు, కోలాటం, ఒగ్గు కథ, డప్పు నృత్యం, దాసర్ల పాటలు, హరిదాసు పాటలు వంటి 150కు పైగా జానపదా కళారూపా లున్నాయి. ఇక జానపద సాహిత్యానికొస్తే పిల్లల పాటలు, స్త్రీల పాటలు, లాలిపాటలు, జోలపాటలు, పెళ్లిపాటలు, బతుకమ్మ పాటలు, గైరమ్మ పాటలు, భారతం, రామాయణం, పల్నాటి చరిత్ర, బొబ్బిలి యుద్ధం, కాటంరాజు కథలు వంటి ఎన్నో పాటలున్నాయి. ఒకప్పుడు దేదీప్యమానంగా వెలుగొందిన ఈ కళలు, సినిమాలు, టీవీ, కంప్యూటర్ వంటి ఆధునిక సాధనాల రాకతో చెల్లాచెదురయ్యాయి. అటువంటి జానపద కళారూపాలలో జముకుల కథ ఒకటి. నాలాంటి వారికి భారతం, రామాయణంతో పాటు ఇతిహాసాలనందించిన కళ ఇది.

జముకుల కథ : జముకుల కథ కళింగాంధ్ర ప్రాంతాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలలోను, సరిహద్దు ప్రాంతాలలోను విస్తరించివుంది. జముకు

అనే వాయిద్యాన్ని ఉపయోగించి ప్రదర్శించే కళ కాబట్టి దీనికి జముకుల కథ అని పేరు వచ్చింది. జముకుల వారిని తెలంగాణలో బైండ్లవారని, బవనీలని పిలుస్తారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలలో బైనీడువాంని, పంబలవారని, రాయలసీమలో బైండ్ల కథవారని, ఉత్తరాంధ్రలో బుడుకి పాటవారని, బుడబుక్కలపాట, బోనెలపాట వారని వ్యవహరిస్తారు.

ప్రాచీన కావ్యాలలో జముకు : కాకతీయుల కాలంలో బవనీయులు అంటే మాదిగ స్త్రీలు. వీరు ఎల్లమ్మ కథను వీరావేశంతో చెపుతుండేవారని, వారు ఉపయోగించే జవనిక జుకజుం...జుకజుం...జుకజుమ్మంటు వీనుల విందుగా సాగేదని శ్రీనాథుని క్రీడాభి రామంలో ఈ విధంగా ఉదహరింపబడింది.

వాద్య వైఖరి కడునెరవాది యనగా
ఏకవీర దేవి ఎదుట నిల్చి
పరశురాముని కథలెల్లప్రౌఢిపాడె
చారుతుర కీర్తి బవనల చక్రవర్తి
వేషధారణ గూర్చి :
దీర్ఘకాయము కల్గి ధైర్యవంతుడయ్య
పాదాల జీరాడు పంచెకట్టి
బుగ్గమీసంబుల పూర్వదృఢత్వంబు
తెల్లని తలపాగ తేజమలర
చేయనరక్షణ చేతి సింహ తలాటమ్ము
జమిడిక వామచంకను ధ్వనింప
కాళ్లను గజ్జలు ఘల్లుఘల్లును మ్రోగ

జముకు/జమిడిక వాయిద్యం : దీనిని కంచు, ఇత్తడి, కర్రతో తయారు చేస్తారు. ఇది కుంచం (సిలిండర్) ఆకారంలో ఉన్న డొక్కుకి ఒకపక్క జంతు చర్మంతో మూస్తారు. మధ్యభాగంలో చిన్న రంధ్రం చేసి బిగుతుగా ఉండే దారాన్ని (నరాన్ని) పోనిచ్చి చివరన ముడివేస్తారు. రెండవపక్క ఒక కర్రముక్కకు ఆ దారాన్ని కట్టి ఎడమ చేతితో బిగుతుగా లాగిపట్టుకుని కుడిచేతితో జముకు లోపల భాగం నుండి వ్రేళ్లతో మ్రోగించినట్లయితే మనోహరమైన శబ్దం వస్తుంది. పాటకు అనుగుణంగా జముకు వాయిస్తారు.

కళింగాంధ్ర ప్రత్యేకత : బుడబుక్కల పాటగా ప్రసిద్ధిగాంచిన ఈ కళారూపానికి కళింగాంధ్రలో రెండు రకాలైన జముకుల పాట వారున్నారు. ఒకటవ రకానికి చెందిన వారు వేషధారణ గావించి రాత్రిపూట గ్రామాలలో ప్రదర్శనలిస్తారు. రెండవ రకం వారు అమ్మతల్లుల పండుగలలోను, గ్రామజాతర్లలోను, గ్రామదేవతలైన మరిడమ్మ,నూకాలమ్మ, అశిరమ్మ, పైడితల్లెమ్మ కథలు గానం చేస్తారు. అందుకే జముకులోడు వచ్చే దాకా జాతర ఆగుతుందా? అనేది కళింగాంధ్ర సామెత. ఈ కళను మాల, మాదిగ కులాల వారే వారసత్వంగా ప్రదర్శిస్తారు.

రంగస్థల, వేషధారణ కథా ప్రదర్శన : మొదటి రకానికి చెందిన జముకుల పాటలో ముగ్గురు వ్యక్తులు పాల్గొంటారు. మధ్య పాటకుడు లేదా కథకుడు స్త్రీవేషం (భామా కలాపంలో సత్యభామ మాదిరిగా పెద్దవాల్జడ, కిరీటం, వడ్డాణం, దండకడియాలు) ధరించగా మిగతా ఇద్దరు వంతలుగా పంచెలు, తలపాగాలు ధరిస్తారు. ఒకరు వ్యాఖ్యానం చెప్పగా మరొకరు హాస్యం చెబుతారు. ఈ ఇద్దరు జముకులను చంకలకు తగిలించుకుని వంతపాడుతారు. రాత్రిపూట వీధి నడిబొడ్డు వీరి రంగస్థలం.

ఈ కథ ప్రారంభమై తెల్లవార్లూ నడుస్తుంది. స్త్రీ, పురుషులు, పిల్లలు, అందరూ భోజనాలు ముగించుకుని చేరుకోగా కథ ప్రారంభమవుతుంది. ప్రదర్శనారంగస్థలంలో ఒక దీపపు స్తంభాన్ని పాతుతారు. దీనినే గిరడ అని పిలుస్తారు. ఈ గిరడ చుట్టూ వలయాకారంగా తిరుగుతూ, పాడుతూ, ఆడుతూ కథకుడు గానం చేస్తాడు. ఇప్పుడు గిరడకు బదులు పెట్రోమాక్స్ లైట్లు ఉపయోగిస్తున్నారు.

'గిరడ' ముందు ప్రార్థన: ముందుగా కథకుడు గిరడకు ఎదురుగా నిలబడి ప్రార్థన చేసి అప్పటి వరకు కప్పుకున్న ముసుగును తొలగించి సంభాషణల ద్వారా ఏయే కథలు చెప్పగలరో వివరించి ప్రేక్షకులు చెప్పమన్న కథను చెబుతారు. వీరు పౌరాణిక కథలైన భారతం, రామాయణంలోని ఘట్టాలైన విరటాపర్వం, సీతా వనవాసం, సుభద్రా కళ్యాణం, కురుక్షేత్రం, లవకుశ, మహిరావణయుద్ధంలతో పాటు రెక్కల రంభ, అళియా దేవి కథ, రేణుకాఎల్లమ్మ కథ, పరశురాముని యుద్ధం, కాంబోజరాజ కథ, బాలనాగమ్మ, సారంగధర చరిత్ర, అపూర్వచింతామణి, జలగన్ని పార్వతి వంటి కథలు పాడుతారు.

కథ పూర్తయిన తరువాత ప్రేక్షకులు కోరిన అమ్మవారి పాట,

కమ్మవారి పణతి, గంగరాజుపాట, దువ్వందొరపాట, రెల్లిది-చిన్నది వంటి కొసరు పాటలుపాడి ప్రజల్ని రంజింపజేస్తారు. ఈ విధంగా నెలలకొద్దీ గ్రామాల్లో ఉండి వారిచ్చే కట్నకానుకలు, భత్యాలు స్వీకరించి దీవెనలు ఇచ్చి తమ స్వగ్రామాలకు చేరుకుంటారు.

ఇరవై బాణీలు, ఇరవై రాగాలు : జముకుల కథలో సుమారు ఇరవై బాణీల్లో పాటలు పాడుతారు. ప్రతిపాటకు బాణీమారుతూ ఉంటుంది. వంతదారులు కథలో వచ్చే పాత్రదారులుగా మారిపోతారు. వీరి రాగాలు, గ్రామీణ యాస, మాండలికాలతో కలిసి వుంటాయి.

ఉదా : భారతంలో పాత్రల పరిచయం.... (పాట)

ఇంద్రప్రస్తాపురం / ఏలీనావారేమి

రాజులకు రారాజు / రాజు దుర్యోధన

....

పాండురాజు కొమరులు / వాలు పంచపాండవులు

పేరుకు పెద్దోడు / ఆడు ధర్మరాజండి

బలరాం చెల్లెలా / బాలరో సుభద్రా

ద్వారకానగరంబు ఏలినా కృష్ణా...................

అంటూ పాత్రల పరిచయంతో కథాగానం ప్రారంభ మవుతుంది. అకాశ మార్గంలో రథమెళ్లేతీరు (వర్ణన)

గగన మార్గము లెల్లమ్మ / రథమెల్లూతున్నాది "రథం"

ఉల్లితోటలు దాటి / ఊళ్లన్ని దాటింది "ఊళ్లని"

పసుపుతోటలు దాటి / పట్నాలే దాటింది "పట్నాలే"

ఏ తీరుగున్నాదమ్మ / పాండవా అర్జునుడు

వర్షం పడే తీరు :

చిన్న చిన్న మేఘాలు

చిన్నన్న నువ్వురారా

పెద్ద పెద్ద మేఘాలు / పెద్దన్న నువ్వురా

వద్దాది కొండామీద / వద్దాదిరా వానజల్లు

యుద్ధభేరి మ్రోత :

యుద్ధం జరిగే ముందు హెచ్చరికగా యుద్ధం భేరీ ఎలా మ్రోగుతుందంటే ....

ధణల్ ధణల్ మని / యుద్ధభేరి

ధణల్మని మ్రోగినాది / ధణల్ ధణల్

చివరిలో "ధిమిత కుందరి తక తది గిణత" అంటూ ముక్తాయింపులు ఇస్తారు.

రామాయణంలో (అశోకవనంలో సీత) :

అన్నికరి దేవుడా / దేవుడా ఓరి

పాపిష్టి జన్మందు / దేవుడా ఓరి

ఏల యిచ్చినావు / దేవుడా ఓరి

ఆడబుట్టగ కంటె / దేవుడా ఓరి

అడవిలోన నేను / దేవుడా ఓరి

రుచ్చుమై పుట్టుంటే / దేవుడా ఓరి

గోలుమని సీతమ్మ / సీతమ్మ ఓలి అదిగోసపెడతాది సీతమ్మ

దీవెనలు పాట : వారి పాటకు పరవశులై ప్రజలు తమకు తోచినది విధంగా వరహాలిస్తే ఫలానా వారు సభలో పదివరాలు చదివించినారా! అంటూ పొగడుతూ....

ధనధాన్య సంపదలు కలిగే ఉండాలి

తాళవే బంగారు మేడులుండాలి

పాలుయిచ్చిన పాడి ఆవులుండాలి

ఎప్పటికి వారింట లక్ష్మి ఉండాలి

అష్టఐశ్వర్యములు కలిగి... యిష్టదేవుని భోగం కలిగి కోటికి వారిల్లు కొనసాగవలెనన్న ఓ ఈ ...అంటూ దీవిస్తారు.

కథకు మధ్యమధ్యలో రసవత్తరమైన పాటలైన అమ్మవారి పాటలు, మందులోడి పాట, దువ్వందొరపాట, రెల్లిది, చిన్నది వంటి పాటలు పడి, నవరసాలు ఒలికిస్తారు. మధ్య మధ్య హాస్యం ఉంటుంది.

దువ్వందొర పాట : దువ్వందొర నాటి శ్రీకాకుళం జిల్లాలో మంచి సాహసికుడైన దొంగ. ఇతడు (రాబిన్ హుడ్ లాంటివాడు) పోలీసులకు, ధనవంతులకు సవాల్ విసిరి మరీ దొంగతనాలు చేసేవాడు. వచ్చిన సొమ్ము పేదలకు, వికలాంగులకు, అవివాహితులకు పంచేవాడు. దువ్వందొర పాట.

పొద్దంత మంచోడురా / దువ్వం దొర

పొద్దుబోతే దొంగడురా / దువ్వం దొర

పెద్దోలను కొడతాడ / దువ్వం దొర

పేదోళ్లకు పంచుతాడు / దువ్వం దొర

అని పాడుతూ ఉంటే ప్రజలు మైమరిచిపోతారు.

సుబ్బారావు పాణిగ్రాహి జముకుల కథ :

జముకుల కథచే ప్రభావితుడైన విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి ఆ బాణీలను ప్రయోగించి శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమాన్ని ప్రజలకు చేరువ చేసాడు. తానే పాటలను వ్రాసి, తానే జముకు వాయించుకుంటూ వంతల సహాయంతో తెలుగు నేలనంత పర్యటించి వందలాది ప్రదర్శనలిచ్చాడు.

జయభారతి జననీ / నమోపతిత పావని అంటూ దేశభక్తి

రగిల్చాడు.

తెలుగుదేశం మనది తెలుగు వారం మనం / ముక్కోటి ఆంధ్రులం ఒక్కటై నిలవాలి... అంటూ తెలుగువారి గొప్పతనాన్ని వివరించాడు. దక్షిణ దేశాన / మన తెలుగుదేశాన/ పేరు శ్రీకాకుళం అంటూ శ్రీకాకుళం వెనుకబాటు తనాన్ని, కరువులను, వరదలను, గిరిజనుల కష్టాలను పాటతో ప్రజలకు చేరువ చేశాడు.

పీసా లక్ష్మణరావు వంటివారు కన్యక వంటి కథలను జముకుల పాటలు ద్వారా ప్రజలకు తెలియజేశారు. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, గరికపాటి రాజారావు, కర్నాటి లక్ష్మీనర్సయ్య వంటి వారు ప్రజానాట్యమండలి కళాకారులు జముకుల పాటలను ఆధునీకరించి ప్రజా సమస్యలను విడమర్చారు. మరెంతో మంది ఆధునిక జముకుల కథలు వ్రాసి పాడారు.

కనుమరుగవుతున్న కళ : నెలల కొలదీ రంజింపజేసి వందలాది మందికి కూడుపెట్టిన కళ నేడు ఆదరణ లేక విలవిలలాడుతోంది. కళింగాంధ్రలో సుమారు 50 బృందాలుండగా ప్రస్తుతం అనేక మంది తమ వృత్తిని కోల్పోయారు. మరికొంత మంది గ్రామాలలోను, రైళ్లలోను భిక్షాటన బాట పట్టారు. వేమగిరి సుందరరావు, లక్కిడాం సన్యాసమ్మ, బత్తుల విశ్వనాథం, గుంట కృష్ణమూర్తి, భూతాల జ్యోతి, మరడాన సోములు వంటి బృందాలు ప్రస్తుతం ఉన్నా రాత్రిపూట పాటలు లేక తమ ఉనికిని, ఉపాధిని కోల్పోయినారు. కళింగాంధ్రలో అక్కడక్కడ అమ్మవారు పండు గులలోను, జాతర్లలో మాత్రమే ఒకటి, అరా కన్పిస్తున్నారు.

మరికొన్ని కులాలలో విద్యాధికులైన వారెవరూ ఈకళను వారసత్వంగా స్వీకరించడం లేదు. ఇంతటి గొప్ప కళారూపాన్ని ఈ తరం వారికి పరిచయం చేసే భాగ్యం లేదు. ఆదరణ లేక అంతరించి పోతున్న ఇటువంటి కళను ప్రోత్సహించి, వీరి కథలను, పాటలను రికార్డుచేసి వారసులను తయారు చేయవలసిన బాధ్యత, కళను బ్రతికింప జేయవలసిన బాధ్యత మనందరిపై ఉంది. ఆదాయాన్నిచ్చే అమ్మవారు గుడులు, సాంస్కృతిక శాఖ, దేవాదాయ శాఖ, స్వచ్ఛందసంస్థలు ఈ కళను దత్తత తీసుకుని జీవం పోయాలి.

ప్రస్తుతం ఈ కళను బతికిస్తున్న బృందాలు : ఉత్తరాంధ్రలో సుమారు 30 బృందాల వరకు ఉండేవి. వీరిలో చాలామంది కీర్తిశేషులయ్యారు. ప్రస్తుతం రైలులో పాటలు పాడుతూ ప్రజలను ఆకర్షిస్తున్న శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం పాల్తేరుకు చెందిన బోనెల అసిరయ్య యూట్యూబ్ ద్వారా పరిచయం అయి సినిమాల్లోకి తన పాటను తీసుకువెళ్లారు. అమెరికా తానా సభలు, అండమాన్ దీవుల్లో తన పాట వినిపించి ప్రసిద్ధి చెందారు. కొత్తూరుకు చెందిన నులక సింహాచలం బృందం, వంగర మండలం బంగారువలసకు చెందిన ఎలగాడ సింహాచలం, మిరియాల జగన్ బృందం వేషధారణతో ఈ పాట వినిపిస్తున్నారు. విజయనగరానికి చెందిన లక్కిడాం సన్యాసమ్మ 83 ఏళ్ళ వయసులో తన పాటను వినిపించిఈ డొక్కె (జముకు) నా డొక్క నింపు తోందని గర్వంగా చెబుతోంది. నెల్లిమర్ల మండలం కొండవెలగాడకు చెందిన జీరుపాటి అప్పన్న, జీరుపాటి తాత బృందం ఉత్తరాంధ్రలోని గ్రామాల్లో అమ్మవార్లకు మనవి చెబుతూ జీవనం సాగిస్తున్నారు. గుర్ల మండలం బడారుపేటకు చెందిన సోములు, మక్కువ మండలం భైరిపురంకు చెందిన భూతాల జ్యోతి బృందం, జామి మండలం కుమరాంకు చెందిన ఎద్దు శ్రీరాములు, జలుమూరు మండలం తిమడా గ్రామానికి చెందిన రాయి శంకరరావు బృందం, సారవకోట మండలం బద్రి గ్రామానికి చెందిన బలగ కృష్ణ, పరసయ్య బృందం, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వేమంగి సుందరరావు జముకు పాటను బతికిస్తున్నారు.

* * *

మంచిమాట

మైత్రి (స్నేహం)

- ఆచార్య ప్రగడ రాజగణపతి
94407 71733

పాపాన్నివారయితి, యోజయతే హితాయ
గుహ్యం నిగూహతి, గుణాన్ ప్రకటీకరోతి
ఆపద్గతంచ న జహాతి, దదాతి కాలే
సన్మిత్ర లక్షణమిదం ప్రవదంతి సన్త:

మంచి స్నేహితుడు ఈ ఆరు లక్షణాలు కలిగి ఉంటాడు. మిత్రుడిని చెడు పనులు చేయకుండా ఆపి పాపం మూటగట్టుకోకుండా కాపాడుతాడు. అతని హితాన్ని కోరి మంచిగా ఉండేందుకు ప్రోత్సహిస్తాడు. స్నేహితుని మంచి గుణాలను బాహాటింగా ప్రకటించి మెచ్చుకుంటాడు. కష్టకాలంలో ఆపదలు వచ్చినపుడు మిత్రుడిని వదలి పెట్టకుండా అతనితో ఉంటాడు. అవసరం వచ్చినపుడు సహాయం చేసి రక్షిస్తాడు.

సర్వధా సుకరం మిత్రం దుష్కరం ప్రతిపాలనమ్

స్నేహం చేయడం చాలా సులభం. కానీ దానిని నిలబెట్టు కోవడం చాలా కష్టం. చిన్న చిన్న విషయాలకే మిత్రుల మధ్య మనస్పర్థలేర్పడి మైత్రి చెడిపోవచ్చు. స్నేహబంధం నిలబెట్టుకోవడం చాలా ముఖ్యం. మిత్రత్వాన్ని కాపాడుకోవడానికి జాగ్రత్త అవసరం.

మిత్రం ప్రీతి రసాయనమ్

మిత్రుడు అనేవాడు ప్రీతి (ప్రేమ) అనే రసాయినం వంటివాడు. కష్టాల్లో ఉన్నపుడు మిత్రుని పలకరింపు ఒక ఔషధం లా పనిచేస్తుంది.

మహాభారతంలో సుఫల స్నేహానికి ఉదాహరణ, అర్జునుడు, శ్రీకృష్ణుడి మధ్య మైత్రి. ధర్మబద్ధంగా, కష్టసుఖాల్లో కలిసి మెలసి స్నేహానికి ప్రతిరూపంగా జీవించిన వారే మనందరికీ మార్గదర్శకులు.

గ్రంథాలయమే నాకు దేవాలయం...

అక్షరమే నా దేవత

- ఆచార్య వెలమల సిమ్మన్న



ప్రముఖ భాషా శాస్త్రవేత్త, శతాధిక గ్రంథకర్త, నిరంతరం నిర్విరామ సాహితీ కృషీవలుడు, సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు, 'గ్రంథాలయమే నా దేవాలయం', 'అక్షరమే నా దేవత' అంటున్న ఉత్తమ అధ్యాపకులు, అవిశ్రాంత ఆచార్యులు వెలమల సిమ్మన్నగారు ఈనెల 18 తేదీన ప్రతిష్టాత్మకరమైన లోక్ నాయిక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారం అందుకుంటున్న శుభ తరుణంలో వారితో ఇంటర్వ్యూ ఈనెల విశాఖ సంస్కృతి పాఠకులకు ప్రత్యేకం.

జన్మభూమి - చదువు : శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలుకా లో విద్యలకు నిలయంగా పేరున్న 'తిమడాం' గ్రామంలో 1955 మార్చి 1వ తేదీన, పుణ్యదంపతులు వెలమల ఆరుద్రమ్మ, డాక్టర్ వెలమల కృష్ణమూర్తిలకు రెండవ సంతానంగా జన్మించాను. నా ప్రాథమిక విద్య, ఉన్నత విద్య మా ఊరిలోనే జరిగింది. కాపు పంతులు అని ముద్దుగా పిలుచుకునే అప్పలస్వామి మాస్టారు చదువులో కఠినంగా వ్యవహరించేవారు. ఆయన చేతిలో దెబ్బలు తినడం వల్ల మా గ్రామంలో ఎందరో విద్యార్థులు బాగుపడి పై చదువులకు పట్నం వెళ్లారు. అందులో నేను కూడా ఒకణ్ణి. ఇంటర్మీడియట్ నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదువుకున్నాను. ఇప్పుడది డిగ్రీ కాలేజీగా మారింది. ఇంటర్‌లో గంటి నరసింహశర్మ, కృష్ణంరాజు, వి.వి.రామారావు, జానకీరామ్, సి.వి.రత్నం, శ్రీరాములు గార్లు ఎంతో ఆసక్తికరంగా పాఠాలు బోధించారు. విజయనగరం మహారాజా కాలేజీలో బి.ఎ. చదివాను. విజయనగరంలో నేను చదువుకోకపోతే ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో నాకు ఎం.ఎ. (తెలుగు) సీటు వచ్చేది కాదు. స్నాతకోత్తర విద్య చదివిన ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లోనే ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారి పర్యవేక్షణలో పి.హెచ్.డి. (1980-1985) పూర్తి చేశాను.

తల్లిలేని లోటు : నేను 8వ తరగతి చదువుతున్నప్పుడు మా అమ్మ గారు కాలం చేశారు. మా మేనత్త సీతమ్మ గారు నన్ను పెంచి పోషించి పెద్ద చేసి అమ్మ లేని లోటును తీర్చారు. మా పిన్ని వెలమల తవిటమ్మ గారు నా బాగోగులు చూసుకుంటే, నా చదువు విషయంలో మరో మేనత్త శ్రీమతి పాగోటి వరహాలమ్మ, మామయ్య పాగోటి సూర్యనారాయణగార్లు నన్ను ఎంతో ప్రోత్సహించారు.

తెలుగు సాహిత్యంపై ఆసక్తి : తెలుగు సాహిత్యం వైపు నా దృష్టి మళ్ళడానికి ప్రధాన కారణం మా నాన్నగారు. ఆయన రామాయణ, భారత భాగవతాలతో పాటు అనేక పురాణాలు బాగా చదువుకున్నారు. ఆ గ్రంథాలన్నీ ఆయనకు కొట్టిన పిండి. ఆ పుస్తకాలలోని అంశాలను విశ్లేషణాత్మకంగా, వివరణాత్మకంగా, తులనాత్మకంగా అందరికీ చెప్పేవారు కూడా. వాటిని వినడానికి వచ్చేవారితో మా ఇంటి ముందున్న వరండా నిత్యమూ సాహిత్య గోష్టితో కళకళలాడుతూ ఉండేది. మా ఊరి

రామాలయంలో ప్రతీ శనివారం రాత్రి జరిగే భజనలకు నాన్నగారు తప్పనిసరిగా వెళ్లి మధురంగా రాగయుక్తంగా పాటలు పాడే వారు.

నేను కూడా ఆయనతో గుడికి వెళ్ళి కిక్కిరిసిన శ్రోతలతో పాటు కూర్చునేవాణ్ణి. అంతేకాదు నాన్నగారు గొప్ప హాస్యప్రియులు, నటులు కూడా. ఎన్నోసార్లు 'రామాంజనేయ యుద్ధం'లో ఆంజనేయుడు పాత్రను చక్కగా పోషించి పెద్దలచే ప్రశంసలు అందుకునేవారు.

సాహిత్యానికి పునాది : నేను డిగ్రీ విజయనగరంలో చదువుకోవడం వల్ల ఎందరో కవి పండితులతో, సాహితీవేత్తలతో, భాషాభిమానులతో పరిచయాలు కలిగాయి. డిగ్రీలోనే సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించాను. ప్రత్యేక అంశాలుగా చరిత్ర, తెలుగు, రాజనీతి శాస్త్రం తీసుకున్నాను. కాలేజీలో గురువులైన నారాయణస్వామి, సాయినాధశాస్త్రి, రమణయ్య గార్లు నాకు సాహిత్యంపై అభిలాషను పెంపొందించారు. ఈ ముగ్గురి మాస్టార్ల



ప్రభావం నాపై ఉంది. వీరు చదువే కాకుండా క్రమశిక్షణ, సంస్కారం కూడా నేర్పారు. ముఖ్యంగా తెలుగు విభాగాధిపతి అయిన నారాయణస్వామి గారు తమ విద్యార్థులందరినీ ఇంటికి తీసుకుని వెళ్లి ప్రత్యేకంగా పాఠ్యాంశాల్ని బోధించే వారు. గురజాడ అప్పారావు గారి గొప్పతనం గురించి, వారి రచనా వైశిష్ట్యం గురించి మా గురువులు ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. విజయనగరంలో ప్రతీరోజూ ఎక్కడో ఒకచోట సాహిత్య సభలు, సమావేశాలు జరుగుతూ ఉండేవి. నేను వెళుతుండేవాడిని. అవి కూడా నా సాహితీ జీవితానికి గట్టి పునాదులు ఏర్పరిచాయి. అక్కడి రచయితలతో ప్రత్యక్ష పరిచయం వల్ల నాలో సాహిత్యాభిరుచి ఇంకా పెరిగింది. నాలో సాహిత్యాభిలాష మరింత పెంపొందించడానికి ఎం.ఎ. తెలుగులో నా గురువులైన ఆచార్యులు యస్వీ. జోగారావు, కొర్లపాటి శ్రీరామమమూర్తి, చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి, కోలవెన్ను మలయవాసిని, లంకసాని చక్రధరరావు, వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి మున్నగు వారు ముఖ్యులు. పరిశోధకునిగా, అధ్యాపకునిగా, రచయితగా నాకు మంచి పేరు రావడానికి ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖలో చదివిన చదువే ప్రధాన కారణం. అది నా అదృష్టం.

పలు భాషలలో అభినివేశం : నేను సీనియర్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఇన్ సంస్కృతం (1981), డిప్లమో ఇన్ హిందీ (1983), డిప్లమో ఇన్ తమిళం (1984), డిప్లమో ఇన్ ఉర్దూ (1987), పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లమో లింగ్విస్టిక్స్ (1988), పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ట్రాన్సులేషన్ (1991), పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ఫంక్షన్ ఇంగ్లీష్ (1993) అనే ఏడు డిప్లమో కోర్సులను ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో చేశాను. ప్రతీరోజు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు క్లాసులు జరిగేవి. చాలా శ్రద్ధగా క్లాసులకు వెళ్ళి చదువుకుని అన్ని భాషలలో పట్టు సాధించాను.

ఉద్యోగ విజయాలు : నేను చదువుకున్న ఆంధ్ర విశ్వకళాపరిషత్ లోనే స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ తెలుగు విభాగంలో 1986 సంవత్సరం మే నెల 8వ తేదీన ఉద్యోగంలో చేరాను. 2017 మార్చిలో ఉద్యోగ విరమణ చేశాను. ప్రస్తుతం ఆంధ్ర విశ్వ కళాపరిషత్‌లోనే గౌరవ ఆచార్యులుగా తెలుగు శాఖలో పని చేస్తున్నాను. నా శ్రమకు, కృషికి ఫలితం లభించిందని ఆనందిస్తున్నాను.

రచనా వ్యాసంగం : నా మొదటి వ్యాసం 'సాహిత్యంలో చిత్రలేఖనం' 1981 ఆగస్టులో నవభారతిలో అచ్చయింది. అచ్చులో నా పేరుతో వచ్చిన వ్యాసాన్ని చూసుకొని ఆకాశంలోని నక్షత్రాలను అందుకున్నంత ఆనందించాను. నా తొలి పుస్తకం 'దర్శిని' 1994లో విడుదల అయ్యింది. ఇప్పటికి 110 గ్రంథాలు వ్రాసాను. వాటిలో 101 ముద్రితాలు, 09 అముద్రితాలు. వాటిల్లో తెలుగు భాషా చరిత్ర', తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, ఆధునిక భాషాశాస్త్రం, బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్యానం, యుగకర్త గురజాడ, ముత్యాలు సరాలు-మహాకవి మార్గం, గురజాడ కథలు - సంస్కరణ దృక్పథం, గురజాడ భాష, నవయుగ వైతాళికుడు కందుకూరి, భాషా తపస్వి గిడుగు, నూరేళ్ల కారా మాస్టారు, శబ్దబ్రహ్మ చిన్నయ సూరి తదితర గ్రంథాలు సివిల్ సర్వీస్. గ్రూప్-1, గ్రూప్-2, నెట్, స్లెట్ వంటి వివిధ పోటీ పరీక్షలకు వెళ్ళే విద్యార్థులకే కాక అన్ని విశ్వవిద్యాలయాల్లోని ఎం.ఎ. తెలుగు విద్యార్థులకు, ఆచార్యులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. 560కి పైగా నేను వ్రాసిన పరిశోధన పత్రాలు భారతి, తెలుగు వెలుగు, నవ భారతి, తెలుగు

విద్యార్థి, మిసిమి, సాహితీ స్రవంతి, ఆంధ్రప్రదేశ్, చినుకు, నడుస్తున్న చరిత్ర, ఉపాధ్యాయ మిత్ర, అమ్మనుడి, విశాఖ సంస్కృతి మొదలైన ప్రముఖ పత్రికల్లో ముద్రించబడ్డాయి. 260కి పైగా వివిధ సెమినార్లలో పాల్గొని విలువైన ఉత్తమమైన పరిశోధన వ్యాసాలను సమర్పించాను. 60కి పైగా రేడియో ప్రసంగాలు చేసి శ్రోతలను అలరించాను.

అవార్డులు - రివార్డులు : 250కి పైగా వివిధ ప్రసిద్ధ సాహితీ సంస్థలు, ఇతర ప్రముఖ విద్యాసంస్థలు నా సాహితీ కృషిని గుర్తించి ఘనంగా సన్మానించాయి. భాషా బ్రహ్మ, భాషా విభూషణ, సాహితీ బ్రహ్మ, సాహితీ సవ్యసాచి, సాహిత్య సేవారత్న, జ్ఞానజ్యోతి తదితర బిరుదులు అందుకున్నాను. వాటిలో 1985లో 'రఘుపతి వెంకటరత్నం నాయుడు బెస్ట్ ఎక్సలెన్స్ అవార్డు, 2005లో 'ఆంధ్రప్రదేశ్ సాహితీ సాంస్కృతిక సమాజ్ పురస్కారం', 2006లో అప్పటి ముఖ్యమంత్రి డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా 'భాషా విశిష్ట పురస్కారం' 2007లో శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి 'ధర్మనిధి' పురస్కారం, 2013లో అప్పటి విద్యాశాఖమంత్రి కె.పార్థసారధిగారి చేతుల మీదుగా అత్యంత ప్రతిష్టాత్మకరమైన ' అంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు' 2015లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా 'విశిష్ట ఉగాది సాహితీ పురస్కారం', 2022లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి 'గిడుగు రామమూర్తి భాషా పురస్కారం', 2023లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, అధికార భాషా సంఘం వారు ఇచ్చిన 'జీవిత సాఫల్య పురస్కారం' కొన్ని మాత్రమే.

అందమైన అనుభూతులు : నా పర్యవేక్షణలో 28 మందికి ఎం.ఫిల్, 16 మందికి పి.హెచ్.డిలు వచ్చాయి. వివిధ పత్రికల్లో కొందరు ప్రముఖులు నా గురించి, నా రచనలు గురించి 50కి పైగా వ్యాసాలు, నా పుస్తకాలపై సమీక్షలు వ్రాసారు. ఎం.గోపాల నాయుడు గారు 'ఆచార్య వెలమల సిమ్మన్న వ్యాసాలు - పరిశీలన' అనే అంశంపై ఎం.ఫిల్, 'ఆచార్య వెలమల సిమ్మన్న భాషా సాహిత్య సేవ' అనే అంశంపై పి.హెచ్.డి చేశారు. నేను వ్రాసిన 'తెలుగు భాషా చరిత్ర' ను ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు ఆంధ్ర విశ్వ కళాపరిషత్ హిందీ విభాగంలోని ప్రొఫెసర్ వర్మ గారిచే హిందీ లోకి అనువాదం చేయించడం విశేషం. ఆయనే 'నవయుగ వైతాళికుడు - కందుకూరి' అనే గ్రంథాన్ని అప్పటి భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడుగారి చేత ఆవిష్కరింప చేయించడం మరిచిపోలేని మధుర జ్ఞాపకం. నేను ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారిని ఆదర్శంగా తీసుకొని విజయం సాధించాను. ఒకరోజు వారు ఒక పెద్ద సభలో 'సిమ్మన్న నా వారసుడు' అని ప్రకటించారు. నా జీవితంలో ఇంతకన్నా గొప్ప విషయం మరొకటి లేదు. నేను ఎదగడానికి ప్రేరకులు, కారకులు శ్రీ కొర్లపాటి వారే. నా వందో పుస్తకం 'అభినవ విమర్శకుడు మార్గదర్శి - కట్టమంచి' 26-4-2026న ఆవిష్కరణ జరుగుతుంది. ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఆవిర్భవించి ఆరోజుకి వందేళ్ళు పూర్తి అవుతుంది. అంతేకాదు కట్టమంచి రామలింగారెడ్డి గారు కూడా వైస్ ఛాన్సలర్‌గా పదవీ స్వీకారం చేసి అదే రోజుకి వందేళ్లు నిండుతాయి. ఇది యాదృచ్ఛికమైనా ఆనందించే విషయం.

సాహితీ మిత్రులు : జీవితంలో నాకు మంచి మిత్రులు దొరకడం అదృష్టంగా భావిస్తున్నాను. వారిలో డాక్టర్ దానాశాస్త్రి, ఆచార్య కొండపల్లి సుదర్శనరాజు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డా.డి.వీరాస్వామి, డా.ఎన్.చంద్రశేఖర్, ఎన్.రామకృష్ణ, డా.దామెర వెంకట సూర్యారావు, డా.మరడాన సుబ్బారావు, డా. ఎస్.పోలయ్య, ఉప్పల అప్పలరాజు, అడపా రామకృష్ణ, మేడా మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు, శేఖరమంత్రి ప్రభాకర రావు, డా.కె.జి.వేణు, సి.హెచ్.

చిన సూర్యనారాయణ, డా. మీగడ రామలింగస్వామి, పరవస్తు ఫణిశయన సూరి, డా. మాటూరి శ్రీనివాస్, డా.బండి సత్యనారాయణ, డా. గండికోట రఘురామారావు, డా.పెద వీర్రాజు, డా.కె.వి.ఎస్ కొందరు మాత్రమే. ఇంకా చాలామంది ఉన్నారు.

కుటుంబం : నాకు నలుగురు అన్నదమ్ములు. ఒక చెల్లెలు. నా వివాహం 1986 డిసెంబరు 5 తేదీన జరిగింది. శ్రీమతి పేరు పార్వతి. మాకు ఒక అబ్బాయి. పేరు ప్రశాంత్. ఒక అమ్మాయి పేరు ప్రియాంక. ఇద్దరికీ పెళ్ళిళ్ళయ్యాయి. ఇద్దరు మనవళ్ళు, ఒక మనవరాలితో జీవితం సంతృప్తిగా సాగుతోంది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేను ప్రశాంతంగా ఉండటానికి ప్రధాన కారణం నా అర్ధాంగి శ్రీమతి పార్వతి. నేనీ స్థితికి రావడానికి దోహదపడిన ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖకు శతకోటి వందనాలు చెప్పుకోవాలి.

కృతజ్ఞతలు : పెంచి, పోషించి, పెద్ద చేసి చదువు చెప్పించిన మేనత్త సీతమ్మ, పిన్ని వెలమల తవిటమ్మ, మరో మేనత్త పాగోటి సీతమ్మ, మామయ్య పాగోటి సూర్యనారాయణలకు, వారి పిల్లలకు కృతజ్ఞతలు. విజయనగరం మహారాజా కాలేజీలో నేను బి.ఎ. చదవడానికి ప్రధాన కారకులైన పెదనాన్న వెలమల ఆదినారాయణ, చిన్నాన్న వెలమల సీతారాం గార్లకు, చదువు చెప్పిన మాస్టార్లకు, దిశానిర్దేశకులు ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారికి, నా పరిశోధన విషయంలో సహకరించిన డాక్టర్ వెలమల సుందరరావు, శ్రీమతి వెలమల సుశీలమ్మ, నన్ను ఎంతగానో అభిమానించే

శ్రీయుతులు ఒరుదు రంగారావు, ఆచార్య జోగులు, ముద్దాడ సత్యంలకు కృతజ్ఞతలు. పూర్వ రాజ్యసభ సభ్యులు శ్రీ కింజరాపు ఎర్రంనాయుడు, పూర్వ ఉప కులపతులు ఆచార్య కోనేరు రామకృష్ణారావు, డాక్టర్ మద్ది గోపాలకృష్ణారెడ్డి, ఆచార్య కె.సి.రెడ్డి, ఆచార్య వి.బాల మోహన్‌దాస్, ప్రముఖ కార్డియాలజిస్టు డా. గొద్దు శ్రీరామచంద్రమూర్తి, శ్రీమతి డా.గొద్దు రమాదేవి, పూర్వ ఎ.పి.పి.ఎస్.సి. ఛైర్మన్ గొల్లు సూర్యనారాయణ, శ్రీమతి గొల్లు సింహాచలం, డి.సుందర నారాయణ గార్లకు కృతజ్ఞతలు. పూర్వ రాజ్యసభ సభ్యులు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్,

ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావుగార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు. లోక్ నాయక్ ఫౌండేషన్ సాహితీ పురస్కారానికి నన్ను ఎంపిక చేసిన కార్యవర్గ సభ్యులకు అనేకనేక కృతజ్ఞతలు.

తెలుగు భాష పరిరక్షణ : 3000 సంవత్సరాలు నుండి మౌకికంగా ఉన్న తెలుగు, 1500 సంవత్సరాల నుండి శాసన భాషగా వృద్ధి చెంది ప్రాచీన హోదా పొందింది. 1856 వరకు తెలుగు భాష సంస్కృతం నుండి పుట్టిందని మేధావులు, పండితులు అనుకున్నారు. 1856లో 'రాబర్ట్ కాల్డ్‌వెల్' అనే పరిశోధకుడు 'ద్రావిడ భాషలు తులనాత్మక వ్యాకరణం' అనే గ్రంథంలో తెలుగు భాష సంస్కృతం నుండి పుట్టలేదని మూల ద్రావిడ భాష నుండి ఆవిర్భవించిందని చెప్పాడు. ఈరోజు వరకు కూడా రాబర్ట్ కాల్డ్‌వెల్ చెప్పిన సిద్ధాంతాన్నే ఆమోదిస్తున్నారు. అంతటి ప్రాచీనమైన తెలుగు భాషను మనం రక్షించుకోవాలి. మాతృభాష నశించిపోతే మన జాతి నశించినట్లే. మన జాతి చరిత్ర సంస్కృతులు వగైరాలు అన్నీ కాలగర్భంలో కలిసి పోయినట్లే. తల్లి భాషను ప్రభుత్వాలు అశ్రద్ధ చేస్తే కాలక్రమంలో మన తెలుగు భాష మరుగున పడిపోతుంది. కొంతకాలానికి లిపి అంతరించి పోతుంది. కేవలం మాట్లాడే భాషగా మాత్రమే మిగులుతుంది. తర్వాత తర్వాత అది కూడా ఉండదు. కాబట్టి మాతృభాష మీద తెలుగువారందరూ ప్రేమ, అభిమానం, గౌరవం తప్పనిసరిగా పెంచుకోవాలి. తెలుగు భాషా, సాహిత్యాల ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని పరిరక్షించుకోవడానికి ప్రపంచంలోని తెలుగువారందరూ కృషి చేయాలి. ప్రభుత్వాలు సహకరించాలి.

యువతకు సందేశం : నేను ఇన్ని గ్రంథాలు, ఇన్ని పరిశోధన వ్యాసాలు వ్రాసి ప్రభుత్వం చేత మెప్పు పొంది పురస్కారాలు, బిరుదులు పొందడానికి ప్రధాన కారణం చదువు. ప్రతీ ఒక్కరూ రోజుకు 16 గంటలు సీరియస్‌గా చదవాలి. అలా తక్కువలో తక్కువ రెండు సంవత్సరాలు చదవాలి. ఆ రెండు సంవత్సరాలు నాకు మల్లే మీకు గ్రంథాలయమే దేవాలయం కావాలి. అక్షరమే దేవత అని



భావించాలి. అలా చదివితే జ్ఞానం వస్తుంది. ఉద్యోగం వస్తుంది. జీవితం ఆనందంగా ఉంటుంది.

విశాఖ సంస్కృతి మాసపత్రిక : ఈరోజుల్లో ఒక తెలుగు మాస పత్రిక నడపడమే చాలా కష్టమైన విషయం. సాహిత్య మాస పత్రిక నడపడం మరీ కష్టం. భాష మీద అభిమానం ఉన్న చాలా డబ్బున్న శ్రీమంతులు కూడా పత్రికలు నడపలేకపోయారు. తెలుగు భాష వికాసానికి పెద్ద పీట వేస్తూ పరమ ప్రామాణిక పత్రికగా గత 13 సంవత్సరాలుగా ప్రతీ నెలా క్రమం తప్పకుండా పాఠకులకు అందిస్తున్న సంపాదకులు శిరేల సన్యాసిరావు గారు ఎంతైనా అభినందనీయులు. వారికి శుభాశీస్సులు. పత్రిక కలకాలం నడవాలని త్రికరణశుద్ధిగా కోరుకుంటున్నాను.



సంభాషణ – మేడా మస్తాన్‌రెడ్డి, 9441344365

SITAM
SATYA INSTITUTE OF TECHNOLOGY AND MANAGEMENT
COMBINED ANNUAL TRAINING CAMP - V

SITAM

SITAM
SATYA INSTITUTE OF TECHNOLOGY AND MANAGEMENT
NAAC
SITAM
సంక్రాంతి సంబరాలు-2026

SITAM
SATYA INSTITUTE OF TECHNOLOGY AND MANAGEMENT
NAAC
SITAM
సంక్రాంతి సంబరాలు-2026

SITAM

SATYA INSTITUTE OF TECHNOLOGY AND MANAGEMENT

ACCREDITED BY NAAC, RECOGNISED UNDER 2(F) AND 12 (B) OF UGC
APPROVED BY AICTE, NEW DELHI,
{ PERMANENTLY AFFILIATED TO JNTU-GV, RECOGNISED BY SBTET, GOVERNMENT OF A.P}

(Under SRI BOTCHA GURU NAIDU MEMORIAL EDUCATIONAL SOCIETY)

ACCREDITED WITH GRADE B+ NAAC

INSTITUTION'S INNOVATION COUNCIL (Ministry of HRD Initiative)

- Dr.Botcha Jhansi Lakshmi
Secretary & Correspondent - Satya Group
Former - Member of Parliament

NOT JUST EDUCATION, PREPARING YOU FOR LIFE...

B.TECH (CSE/MECH/CIVIL/EEE/ECE)

M.TECH (Computer Science Engineering)

DIPLOMA (Skill & Job-Oriented Courses)
- COMPUTER SCIENCE (VCS)
- MOBILE COMMUNICATION (VMC)
- AUTOMOBILE SERVICING (VAS)

BBA (Bachelor of Business Administration)

MBA (Master of Business Administration)

BCA (Bachelor of Computer Applications)

MCA (Master of Computer Applications)

B.TECH ARTIFICIAL INTELLIGENCE & DATA SCIENCE (AI & D S)

COLLEGE CODE **SGVP**

NEAR RTO OFFICE, GAJULAREGA, VIZIANAGARAM – 535003, ANDHRA PRADESH
86393 84239,92902 51491,79890 40214

FOLLOW US
www.sitam.co.in

SATYA

Degree & PG College
(AFFILIATED TO ANDHRA UNIVERSITY)
(Under Sri Botcha GuruNaidu Memorial Educational Society)

SCIENCE COURSES

- B.Sc honours : Mathematics
- B.Sc honours : Chemistry
- B.Sc honours : Computer Science
- B.Sc honours : Zoology



COMMERCE & MANAGEMENT COURSES

- B.Com : Computers
- B.Com (honours): General

ARTS COURSES

- B.A honours : History
- B.A honours : Politics

PG COURSES

- M.Sc Organic Chemistry

THOTAPALEM,VIZIANAGARAM
08922 - 273019 , 224019, 9490049096, 9963069332

FOLLOW US
/sgvpvzm

RNI No.APTEL/2012/42810 POSTAL REGISTED No.VSP-189/2025-2027 VISAKHA SAMSKRUTHI TELUGU MONTHLY

Published Owned by : S. Sanyasi Rao, Flat No. 402, Vaishno Keerthana Apartment, Bottavanipalem, Madhurawada, Visakhapatnam-530048
Published at : Flat No. 402, Vaishno Keerthana Apartment, Bottavanipalem, Madhurawada, Visakhapatnam - 530 048.
Printed at : Visakha Offset Printers, # 48-13-8, Flat No. 1, Janakiram Street, Visakhapatnam-16, A.P., Editor : S. SANYASI RAO